


నేటి దినపత్రిక

సూర్య



www.suryaa.com | సంపుటి 11 | సంచిక 139

శనివారం | 17 మార్చి 2018 | విజయవాడ | పేజీలు 12+16 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, బహుళ పక్ష తిథి : అమావాస్య సా.6.16, పూర్వాభాద్ర రా.7.33, వర్జ్యం తె.5.26 నుంచి
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుంచి 7.36 వరకు, సూర్యోదయం : ఉ.6.26 గం; సూర్యాస్తమయం: సా. 6.23 గం.



జగన్, పవన్‌లను అడ్డుపెట్టుకుని

మోడీ మహాకుట్ర



- పథకం ప్రకారం తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేయిస్తున్నారు
- ప్రత్యేక హోదా ఇవ్వాలని మోడీ భావిస్తున్నారు
- ఆ క్రెడిట్ జగన్‌కు, పవన్‌కు దక్కాలన్నది మోడీ కుట్రలోని ప్లాన్
- పవన్ ఆమరణ దీక్ష తరువాత ప్రత్యేక హోదా ప్రకటన
- విమర్శల తూటాలతో విరుచుకుపడ్డ చంద్రబాబు
- కేంద్రం ఇక తప్పించుకోలేదు
- బీజేపీ వ్యవహరించిన తీరు అభ్యంతరకరం
- ఏపీని కేంద్రం ఏనాడూ పట్టించుకోలేదు
- గత నాలుగు బడ్జెట్లలోనూ రాష్ట్రానికి అన్యాయం
- శాసనమండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

శుక్రవారం ఉదయం తెలుగుదేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఎన్డీయేతో తెగదెంపులు చేసుకోవాలని నిర్ణయించారు. ఆ వెంటనే తామే సొంతంగా అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్టు ప్రకటించారు. ఇదే సమయంలో నిన్నటివరకూ పాటించిన మిత్రధర్మాన్ని పక్కనబెట్టి ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలతో విరుచుకుపడ్డారు. ప్రధాని ప్రత్యేక హోదా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆ క్రెడిట్‌ను టీడీపీకి దక్కనీయకుండా చూడాలని కుట్ర పన్నారని ఆరోపించారు. ఓవైపు వైఎస్ జగన్‌ను, మరోవైపు పవన్ కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని స్వప్రయోజనాల కోసం నరేంద్ర మోడీ డ్రామాలు మొదలుపెట్టారని సంచలన విమర్శలే చేశారు.

(వెలగపూడి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఏపీ ప్రత్యేక హోదా కోసం లోక్‌సభలో టీడీపీ పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు పెరుగుతోంది. ఏపీ హక్కుల కోసం ఉభయసభల్లో టీడీపీ ఎంపీలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ అవిశ్వాసం తాజా రాజకీయ పరిణామాలపై సీఎం చంద్రబాబు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అవిశ్వాసంపై 57 మంది సంతకాలు పెట్టారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తప్పించుకునే అవకాశం కేంద్రానికి లేదని తేల్చిచెప్పారు. పీఎంవో చుట్టూ తిరిగే వారి అవిశ్వాసానికి మద్దతు ఇవ్వదలుచుకోలేదని స్పష్టం చేశారు. నైతిక విలువలకు లోబడే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. జాతీయపార్టీల నాయకులతో ఇంకా మాట్లాడ లేదని, నాయకులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపార న్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. బీజేపీ వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతర కరమని, జాతీయ రాజకీ యాలపై దృష్టి సారించలేదని తేల్చిచెప్పారు. జాతీయ మిగతా 6లో

అవిశ్వాసం నిలబడేనా?

- కేంద్రంపై టీడీపీ, వైసీపీ అవిశ్వాసం
- మద్దతు పలికిన కాంగ్రెస్ సహా పలు విపక్షాలు
- ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం మోడీ సర్కారుకు ఇబ్బందులు లేనట్టే

దక్షిణాది డబ్బులు ఉత్తరానికా?



- మేం అభివృద్ధి చెంది ఏమి లాభం?: మండిపడ్డ సిద్ధరామయ్య
- కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నది దక్షిణాది రాష్ట్రాలే
- కేంద్రం నుంచి వస్తున్న నిధులు మాత్రం చాలా తక్కువ
- మేం అభివృద్ధి చెంది ఏమి లాభం?

వివరాలు 11లో

మోడీకి దెబ్బ మీద దెబ్బ!



- మాకు ప్రత్యేక హోదా ఇవ్వాలి
- గతంలో మాట ఇచ్చారు
- బీహార్ సీఎం నితీశ్ కుమార్ డిమాండ్
- నరేంద్ర మోడీపై ఒత్తిడి పెంచుతున్న భాగస్వామి
- హోదా ఇవ్వకుంటే వైదొలగేందుకూ సిద్ధమన్న సంకేతాలు
- మారుతున్న దేశ రాజకీయాలు

11లో

అవిశ్వాసంపై చర్చకు
అవకాశమెక్కడ?
సభ ఆర్డర్‌లో లేదంటూ వాయిదా

- అవిశ్వాసంపై నోటీసులు అందాయి
- ఒక్కరు కూడా సహకరించడం లేదు
- ఈ పరిస్థితుల్లో నేనేం చేసేది?
- సభ్యులకు సుమిత్రా మహాజన్ సూటి ప్రశ్న
- వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం నోటీసులు ఇచ్చారు
- సభ ఆర్డర్‌లో లేకుంటే అవిశ్వాసంపై చర్చ ఎలా?
- వాయిదా వేయక తప్పడం లేదన్న సుమిత్రా మహాజన్





న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంపై తమకు నమ్మ కం పోయిందంటూ వచ్చిన అవిశ్వాస తీర్మానాలు తనకు అందాయని, వాటిపై చర్చించాలని తనకు ఉన్నప్పటికీ, సభ ఆర్డర్‌లో లేదని లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వ్యాఖ్యానించారు. సభలో చర్చకు సానుకూల పరిస్థితి ఉన్నట్టు తనకు కనిపించడం లేదని, అందువల్లే అవిశ్వాసంపై చర్చ చేపట్టలేకపోతున్నానని అన్నారు. అన్ని పార్టీల సభ్యులూ ఇలా పోడియంలో నిరసనలు తెలుపుతూ నినాదాలు చేస్తున్న పరిస్థితుల్లో తాను మా త్రం ఏమి చేయగలనని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ సభ్యుడు మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం



- చంద్రబాబులా మాట మార్చే వ్యక్తిని కాదు
- చెప్పినట్టుగానే హోదా ఇవ్వకుంటే రాజీనామాలు చేసి తీరుతాం
- తెలుగుదేశం పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తాం
- సభలో ఎవరి అవిశ్వాసం పరిగణనలోకి తీసుకున్నా ఫర్వాలేదు
- అక్రమాస్తుల కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ నిమిత్తం పాదయాత్రకు జగన్ బ్రేక్

హైదరాబాద్,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, ప్రజల ప్రయోజ నాలే వైసీపీ అత్యంత ముఖ్యమని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా కోసం టీడీపీ అవిశ్వాస తీర్మానం పెట్టినా తాము మద్దతు ఇస్తామని చెప్పారు. మిగతా ఏ పార్టీతో పోల్చుకున్నా తాము రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తామని, అందుకోసం ఏం చేసేందుకుకైనా సిద్ధం అని స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు ట్వీటర్‌లో స్పందించిన ఆయన ప్రత్యేక హోదా విషయంలో మాట తప్పిన కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ ముందే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని, అయితే, సభలో ఎవరిది పరిగణన లోకి తీసుకొని చర్చిస్తారనేది అంత ముఖ్యమైన అంశం కాదని, ఆంధ్ర ప్రదేశ్ పౌరుల హక్కులకు హామీ లభించిందా రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చిందా అన్నదే మిగతా 6లో

అంతా ఇంతే!



డ్రంకన్ డ్రైవ్ బదులు డ్రంకన్ వాక్ పెట్టాలి సార్

ఎన్డీయేకు టిడిపి టాటా

- కేంద్రంపై అవిశ్వాసానికి టీడీపీ నిర్ణయం
- వైసీపీ తీర్మానానికి మద్దతిస్తే తప్పుడు సంకేతాలు
- జగన్, పవన్‌తో కేంద్రం నాటకాలు ఆడిస్తోంది
- ఆర్థిక నేరస్థులకు పీఎంవోలో ఏం పని?
- దోషులను వదిలిపెట్టేది లేదు
- ప్రజా కోర్టులో నిలబెడతాం
- పవన్‌కళ్యాణ్ ఆరోపణలు అర్థరహితం
- ఇక ఏ మొహమాటాలూ లేవు
- జాతీయ పార్టీలను కలుపుకు వెళతాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఎన్డీయేతో తెలుగుదేశం పార్టీ తెగదెంపులు చేసుకుంది. తెలుగుదేశం పార్టీ అత్యున్నత స్థాయి నిర్ణాయక పొలిట్ బ్యూరో సభ్యులతో టీడీపీ అధినేత చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్డీయే నుంచి వైదొలగాలని తెలుగుదేశం పొలిట్ బ్యూరో ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు లేఖ రాయాలని నిర్ణయించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు సమాచారం పంపనున్నారు. ఎందుకు పొత్తు పెట్టుకున్నాం, ఈ నాలుగేళ్లలో ఏం జరిగింది, ఎందుకు విడిపోతున్నాం వాస్తవ వివరాలతో లేఖ రూపొందించారు.



అవిశ్వాసం మనమే పెడదాం

కేంద్రంపై సొంతంగా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలని పొలిట్‌బ్యూరోలో నిర్ణయించారు. దొంగల పార్టీ వైసీపీ నోటీసుకు మద్దతిస్తే మిగతా 6లో

ఎవరికీ భయపడను

- ప్రత్యేక హోదా అడిగిన వారికే హోదా పెరిగింది
- నేను ఎవరి మనిషినీ కాదు ప్రజల మనిషిని
- సీపీఐ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన జనసేనాని
- వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి రాజకీయాల్లోకి రాలేదు : పవన్



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై పోరాటానికి జనసేన సిద్ధంగా ఉందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పవన్ తన తండ్రి కమ్యూనిస్టు సానుభూతిపరులని, అవినీతికి, దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు పోరాటం చేస్తాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు హైదరాబాద్‌లో చేసిన పోరాటాలు తనకు స్ఫూర్తి అని తెలిపారు. లెఫ్ట్ పార్టీలు పని చేసుకుంటూ వెళ్తాయే తప్ప వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించవన్నారు. 25మంది ఎంపీలను భయపెడితే 5కోట్ల మంది ప్రజలు భయపడరని, ఆ విషయం కేంద్ర ప్రభుత్వ పెద్దలు గమనించాలని హితవు పలికారు. జనసేన, వామపక్షాలు కేంద్రం బెదిరింపులకు భయపడవని, కేంద్రంపై పోరాటంలో అవసరమైతే మిగతా 6లో

సభ్యత్వం రద్దుపై కోర్టులో విచారణ షురూ!

- చైర్మన్ బాగానే ఉన్నా ఆసుపత్రిలో ప్రత్యక్షం!
- సోమవారానికి విచారణ వాయిదా

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : అనర్హత వేటుపడ్డ కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, సంపత్ కుమార్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దుపై పిటిషనర్ తరపు న్యాయవాది రవిశంకర్ జంధ్యాల తన వాదనలు వినిపించారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన చాలాసేపు వరకు మండలి చైర్మన్ బాగానే ఉన్నా అనంతరం ఆస్పత్రిలో ఎందుకు ప్రత్యక్షమయ్యారో అర్థం కావడం లేదన్నారు. ఈ నెల12న కేవలం గవర్నర్ నరసింహన్ ప్రసంగం మాత్రమే జరిగిందని, 13న శాసనసభ ప్రారంభమైందని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రోజు సభలో ఎలాంటి దాడి జరగలేదని, ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయడం చట్ట విరుద్ధమని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే నేతల సభ్యత్వం రద్దు చేశారని న్యాయవాది వివరించారు. తమకు ఎన్నో అనుమానాలున్నాయని, సీసీ ఫుటేజీ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత మండలి చైర్మన్ స్వామి గౌడ్ బాగానే ఉన్నారని, అనంతరం చాలా సేపటికి ఆస్పత్రిలో ప్రత్యక్షమయ్యారని చెప్పారు. ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆ వీడియోలోనే లేరని, అయినా అతనిపైనా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ తరపు అడ్వొకేట్ జనరల్ ప్రకాష్ రెడ్డి సోమవారం వరకు గడువు కోరారు. దీంతో కేసు విచారణ సోమవారానికి వాయిదా పడింది. తమ సభ్యత్వాల రద్దును సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి, సంపత్ గురువారం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రొసీడింగ్ సరిగా జరగలేదని, సభ్యుల వివరణ తీసుకోకుండానే తమపై చర్య తీసుకున్నారని న్యాయస్థానానికి నేతలు విన్నవించారు.



నల్లగొండ, ఆలంపూర్‌కు ఉప ఎన్నిక

- ఎన్నికలు ఖాయమంటున్న అధికారపార్టీ • అభ్యర్థుల వేటలో అధికార పార్టీ • మొదట ఇంటిని చక్కదిద్దే పనిలో అధినాయకత్వం • పార్టీ నేతలతో మొదలైన మంతనాలు • నల్గొండ బరిలో కంచర్ల సోదరులు • ఆలంపూర్‌లో అబ్రహం? • త్వరలోనే సీఎం కేసీఆర్ ప్రత్యేక భేటీ?

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : ఈనెల 13 కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఎమ్మెల్యే పదవిని రద్దు చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించడం, వెంటనే ఆ రెండు అసెంబ్లీని యోజకవర్గాల ఖాళీ అయ్యాయని, ఎన్నికలు జరుపాలని అసెంబ్లీ సచివాలయం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించిన విషయం తెలిసిందే!. రద్దుపై ఇద్దరు ఎమ్మెల్యేలు కోర్టులో ఫిటిషన్ వేసినా..అధికారం పార్టీ మాత్రం రెండు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఉప ఎన్నికలు జరగడం ఖాయమని భావిస్తున్నది. కర్నాటక ఎన్నికల తేదీలలో రెండు నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అధికార టీఆర్ఎస్‌పార్టీ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాలలో గెలిచే నేతల కోసం అన్వేషన ప్రారంభించింది. వచ్చే ఏడాది రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏడాది ముందుగా జరుగబోయే ఉప ఎన్నికల్లో అధికారపార్టీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నది. ఈ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గులాబిదళపతి స్కెచ్ వేసినట్లు సమాచారం. ఈ గెలుపు వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని గులాబిపార్టీ భావిస్తున్నది. ఇందుకోసం రెండు ఉప ఎన్నికలను టీఆర్ఎస్ ఖాతాలో వేసుకొని ఇక టీఆర్ఎస్‌కు ఎదురులేదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లాని నిర్ణయించారు. దీనిలో భాగంగా నల్గొండ, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన నేతలతో పార్టీ అధినాయకత్వం మంతనాలు జరుపుతోంది. పార్టీలోని విశ్వసనీయ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు నల్లగొండ, ఆలంపూర్‌పై పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహ రచన చేస్తోంది. గురువారం సీఎం కేసీఆర్ మరో మారు పార్టీ ముఖ్య నాయకులు కొందరిని పిలిపించుకుని ఎన్నికల వ్యూహంపై చర్చించారని తెలిసింది. నల్లగొండ ఇన్చార్జీ కంచర్ల భూపాల్‌రెడ్డి ఆయన సోదరుడు కృష్ణారెడ్డిలతో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారని సమాచారం. ఆలంపూర్ నియోజకవర్గం ముఖ్యనేతలతో సైతం మాట్లాడినట్లు సమాచారం. అయితే ఆలంపూర్ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మంద కుటుంబానికి ఈ ఎన్నికల్లో టికెట్ దక్కదని పార్టీలోని కొంతమంది తెలిపారు. ఉప ఎన్నికలు పార్టీకి ప్రతిష్టాత్మకం అవుతున్న దరిమిళ గెలిచే నేతను బరిలోకి దింపాలని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే అబ్రహంను టీఆర్ఎస్‌పార్టీ నుంచి బరిలోకి దింపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే కర్నూల్‌లో ఉంటున్న అబ్రహం గత రెండు, మూడు రోజుల నుంచి ఆలంపూర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారని నియోజకవర్గ పార్టీ నేతలు తెలిపారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైతే, ఎట్టి పరిస్థితుల్లో విజయం సాధించాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ జిల్లా నాయకులు దిశానిర్దేశం చేశారని సమాచారం. కలిసి పనిచేయాలి : పార్టీ వర్గాలు చెబుతున్న వివరాల మేరకు నల్లగొండ నియోజకవర్గంలో అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. టీడీపీ నుంచి కంచర్ల భూపాల్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరగానే ఆయనకు నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో అప్పటిదాకా ఇన్చార్జిగా వ్యవహరించిన దుబ్బాక నర్సింహా రెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ముందునుంచీ ఎడమొహం, పెడమొహంలా ఉంటున్న ఎంపీ గుత్తాసుఖేంద రెడ్డి, కంచర్ల వర్గాలు కలిసి పనిచేస్తాయా అన్న అనుమానాలూ రేకెత్తాయి. దీంతో అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిందేనని, అందరినీ కలిసి, కలుపుకొని పోవాల్సిన బాధ్యత భూపాల్రెడ్డిదేదని కేసీఆర్ చెప్పారని అంటున్నారు. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు వచ్చినా, రాకున్నా, 2019 సార్వత్రిక ఎన్నికల కోసమైనా ఇప్పటినుంచే పనిచేసుకుంటూ పోవాలని కూడా సూచించారని సమాచారం. మరో వైపు జిల్లా నాయకులను, ముఖ్యంగా నియోజకవర్గంలోని గ్రూపులను సమన్వయం చేసి, అంతా కలిసికట్టుగా పనిచేయించే బాధ్యతను, ఉప ఎన్నికకు ఇన్చార్జిగా మంత్రి కేటీఆర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ వ్యవహారాలు ముగిసి ఉప ఎన్నిక ప్రకటన వెలువడేలోగా పార్టీని బలోపేతం చేసుకోవడం, తమలో ఉన్న అభిప్రాయ బేధాలను పక్కన పెట్టి కలిసి పనిచేసేలా కార్యక్రమాలను రూపొందించే పనిలో టీఆర్ఎస్ ఉంది. మొత్తంగా ఉప ఎన్నికల ప్రకటన వచ్చే నాటికి నల్గొండ, ఆలంపూర్‌లో పూర్తి సంసిద్ధంగా ఉండేలా కేడర్‌ను సిద్ధం చేసే పనిపై జిల్లా, రాష్ట్రపార్టీ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది.







అసెంబ్లీకి రామంటే కుదరదు

- చిత్తశుద్ధి ఉంటే వెంటనే రావాలి • దేవుడికి ప్రజలకే భయపడతా
- నేనూ బలంగా మాట్లాడగలను • జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

(అమరావతి నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంటే వైసీపీ నేతలు అసెంబ్లీకి రావాలని బయట ఉంటామంటే కుదరదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అతిసార బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీరు అసెంబ్లీలో ప్రవేశించాలి. మమ్మల్ని గొర్రెల్లా కొంటున్నారని రోడ్లమీద పడితే కుదరదు. మీకు ప్రజా సమస్యల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే మేం అసెంబ్లీకి రామంటే కుదరదు. అలాంటప్పుడు మీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో పనికిరారు. ఇది వైసీపీ నాయకులు తెలుసుకోవాలి. కేంద్ర ప్రభుత్వంతో గొడవ పెట్టుకునే ధైర్యం మీకు లేకపోవచ్చు. నాకు ఉంది. నాకు మీలాగా లూప్ హోల్స్ లేవు. అవసరాలూ లేవు. నేను దేవుడికి భయపడతాను. ప్రజలకు భయపడతాను. పవన్ ఒకరి కింద పనిచేస్తాడు. ఒకరు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతాడని అనటానికి మీకు నోరెలా వస్తోంది. నేను అనాలి అంటే చాలా ఉన్నాయి మర్చిపోకండి. ప్రతి ఒక్కరూ నోటికి వచ్చినట్లు మాట్లాడితే నేనూ బలంగా మాట్లాడగలను. ప్రజా సమస్యలపై నేను మాట్లాడుతున్నప్పుడు మీకేం తమాషాగా ఉందా? ప్రాణాలు పోతుంటే ఇక్కడ?

కల్తీ ఎక్కువై పోయింది : గుంటూరులో కల్తీ వ్యవహారం ఎక్కువగా ఉంది. కారంలో రంపంపొట్టు కలిపిన దాఖలాలు కూడా ఉన్నాయి. నీటిలో కూడా కల్తీనే. జనాలు డబ్బులు పెట్టి మినరల్ వాటర్ తాగుదామనుకుంటే అవి కూడా కల్తీ అయిపోయాయి. ప్రభుత్వం పాలనా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. తాగునీటికి కూడా రక్షణ కల్పించలేకపోతే రేపు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఎలా వస్తుంది? పెట్టుబడులు ఎలా వస్తాయి? ఎత్తైన కట్టడాలు ఎలా వస్తాయి? సింగపూర్ తరహా రాజధాని ఎలా వస్తుంది? సింగపూర్ తరహా పాలన అంటే తప్పుచేసిన వారిని కచ్చితంగా చాలా బలంగా శిక్షించి తీరాలి. ఎమ్మెల్యేలని, ప్రజాప్రతినిధులను, అధికారులను కచ్చితంగా నిలదీయాలి. మీరే అవినీతికి పాల్పడితే అధికారులను ఎలా నిలదీయగలరు? పోయిన ప్రాణాలు ఎలా వస్తాయి? జనసేన పార్టీ, ప్రజల తరపున మేం కోరుకుంటోంది. వెంటనే మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించండి. ఈ సమస్య సమసిపోయేదాకా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించండి. చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి. తక్షణమే దీనికి శాశ్వత చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆ కడుపుకోత మీకు తెలియదా : ఒకవేళ రాజకీయ నాయకులు వైఫల్యం చెందితే ఉద్యోగులు అడ్డుకోవాల్సిన బాధ్యత ఉంది. ప్రజల పక్షాన నిలవాల్సిన నైతిక బాధ్యత మీది. మిమ్మల్ని కోరుకుంటున్నాను. ఒక్కో చోట ఓ కడుపుకోత. మన ఇళ్లల్లో ఇలా జరిగితే ఎలా ఉంటుంది. ఓ మంత్రి ఇంట్లోనో, ఎమ్మెల్యే, ఓ అధికారి ఇంట్లోనో జరిగితే ఎలా ఉంటుందో ఆ కడుపుకోత మీకు తెలియదా? ఇలాగే స్పందిస్తారా? నాణ్యతా లోపంతో డ్రైనేజి వ్యవస్థను ఇలాగే చేసుకుంటే వెళ్తే ఇవ్వాల్టి నుంచి ఏ ప్రభుత్వంలో ఎవరు పనిచేశారో ఏ అధికారి చేశాడో వాళ్లని బాధ్యులని చేస్తూ కోర్టు కీడుస్తాం.

అందిరినీ సమంగా చూడాలి : ఏ ప్రభుత్వమైనా సరే అన్ని కులాలను, మతాలను సమానంగా చూడాలి. మనకు ఓట్లు వేసినా వేయకపోయినా మన దేశ ప్రజలకు అండగా నిలవాలి. పాపం చనిపోయిన వ్యక్తులంతా దారిద్ర్య రేఖ సమీపాన, దిగువన ఉన్నవారే. మనసున్న ఏ ఒక్కరైనా ఈ సమస్యపై కదలాల్సిందే. 48 గంటల్లో ప్రభుత్వం కదలకపోతే నేను ఇక్కడికే వచ్చి కూర్చుంటాను. బంద్‌కు పిలుపునిస్తాను. మీ కుటుంబాల్లో జరిగితే మీరు ఇలాగే స్పందిస్తారా? గత ప్రభుత్వాల బాధ్యత అని చెప్పినా సరే తెదేపా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. బీజేపీ ఎమ్మెల్యేలతో సహా ఈ సమస్యపై బాధ్యత తీసుకోవాలని పవన్ చెప్పారు.



టీడీపీ మా నెత్తిన పాలుపోసింది సంతోషం

హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారు

అమరావతి,సూర్యబ్యూరో: ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు రావడంపై బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ స్పందించారు. తమ నుంచి విడిపోయిన టీడీపీ మా నెత్తిన పాలు పోసిందంటూ, తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నుంచి టీడీపీ బయటకు వెళ్లిపోయిందని విమర్శించారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఏపీకి ఎంతో చేసినా, ఏమీ చేయలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ బురదజల్లుతోందని, వైసీపీతో తాము కుమ్మక్కు కాలేదని అన్నారు. టీడీపీ తమపై కుట్రలు చేస్తోందని, బీజేపీతో పొత్తు పెట్టుకోమని నాడు చెప్పిన చంద్రబాబు, దేశంలో మోదీ హవా ఉండటంతోనే పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు.

త్యాగధనుడు పొట్టిశ్రీరాములు

ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి




న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: నాడు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఏపీసీసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షతో నాడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆయన త్యాగాన్ని మరువలేమని అన్నారు. నాడు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు.

ప్రతి రోజూ మోడీని విజయసాయిరెడ్డి కలుస్తున్నారు

అనంతపురంఎంపీ జేసీ దివాకర్ రెడ్డి

న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ప్రధాని నరేంద్ర మోదీని వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ప్రతి రోజూ కలుస్తున్నారని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ను కేసుల నుంచి తప్పించడం కోసమే ఆయన ఈ పని చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా డ్రామానే అని ఎద్దేవా చేశారు. ఏపీకి నరేంద్ర మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ స్పెషల్ స్టేటస్ ఇవ్వబోరని స్పష్టం చేశారు. ఏపీ మంత్రి నారా లోకేష్ ను జనసేన అధినేత పవన్ కల్యాణ్ టార్గెట్ చేయడం వెనుక పెద్ద కుట్ర దాగుందని చెప్పారు. ఎలాంటి కుట్రనైనా తిప్పి కొట్టే సామర్థ్యం టీడీపీకి ఉందని అన్నారు



ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ జరపాలి

అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీల మద్దతు కూడగట్టాలి



రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు, విభజన హామీలను సాధించే క్రమంలో చంద్రబాబు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో సెల్ఫ్ డిఫెన్స్ లో పడకూడదని అన్నారు. లోక్ సభలో పెట్టిన అవిశ్వాస తీర్మానానికి వివిధ పార్టీల మద్దతును కూడగట్టాలని చెప్పారు. జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడం కోసం ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ జరపాలని అన్నారు. ఏపీకి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ కేవలం 2 శాతం ఓట్లకు మాత్రమే పరిమితమైందని రాబోయే రోజుల్లో బీజేపీకి కూడా అదే గతి పట్టబోతుందనే గట్టి సంకేతాలు ఢిల్లీకి వెళ్లాలని చెప్పారు. బహిరంగసభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పిన మాటలను 90 శాతం మంది ప్రజలు విశ్వసించారని తెలిపారు. పవన్ తో తన సంబంధం జేఎఫ్సీ వరకే పరిమితమని చెప్పారు


దేశంలో ఎలాంటి ఫ్రంట్‌కూ అవకాశం లేదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఇతర పార్టీలు పెట్టే అవిశ్వాస తీర్మానాలకు బీజేపీ భయపడే ప్రసక్తే లేదని తెలంగాణ బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వ వైఫల్యాల గురించి వైసీపీ అధినేత జగన్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు నిలదీస్తే... వారిద్దరినీ బీజేపీ రెచ్చగొట్టిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అనడం భావ్యం కాదని చెప్పారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరినీ రెచ్చగొట్టాల్సిన అవసరం బీజేపీకి లేదని అన్నారు. దేశ వ్యాప్తంగా మోదీ అనుకూల గాలి వీస్తోందని... ఎలాంటి ఫ్రంట్ కు అవకాశం లేదని చెప్పారు. ఇదే సమయంలో టీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వం గొప్పలకు పోయి, బడ్జెట్ లో ఎక్కువ లెక్కలు చూపుతోందని విమర్శించారు. బడ్జెట్ కంటే అప్పులే ఎక్కువ ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ కోసం 5 శాతం నిధులను కూడా కేటాయించలేదని అన్నారు. యూనివర్శిటీలపై ప్రభుత్వం కక్ష కట్టిందని... ఉస్మానియా యూనివర్శిటీలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

అవిశ్వాసానికి ఎన్డీయేతర పార్టీల మద్దతు

- వివిధ పార్టీలతో టీడీపీ, వైసీపీ వేర్వేరు చర్చలు • చంద్రబాబుకు ఎస్పీ అధినేత ములాయం ఫోన్



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఢిల్లీలో రాజకీయం క్షణం క్షణం మారుతోంది. వైసీపీ, టీడీపీ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలతో దేశ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఏపీకి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ నిన్న వైసీపీ అవిశ్వాస తీర్మానం ఇవ్వగా శుక్రవారం ఉదయం తెలుగుదేశం పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం స్పీకర్ కార్యాలయానికి వెళ్లి అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేశారు. ప్రస్తుతం ఇరు పార్టీలు ఇతర పార్టీల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యాయి. మరోవైపు టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఆజాద్, జ్యోతిరాదిత్య తదితరులు సుమారు 20 పార్టీలతో సంప్రదింపులు జరిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే మద్దతు ప్రకటించారు. టీడీపీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మమత్ ట్వీట్ చేశారు. టీడీపీ ఎంపీలు సుజనాచౌదరి, అశోక్‌గజపతి రాజు, తోట నరసింహం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో వివిధ పార్టీల ఎంపీలతో సమావేశమై మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. అవిశ్వాసం తీర్మానంపై 54 మంది ఎంపీల సంతకాలు చేయించి సోమవారానికల్లా లోక్‌సభలో తీర్మానం చర్చకు వచ్చేలా చేయాలని తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోంది. మరోవైపు వైసీపీ తీర్మానానికి సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. అవిశ్వాస తీర్మానంపై ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో టీడీపీ ఉంది. ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నేతలందరూ చంద్రబాబుతో సంప్రదింపులు జరుపుతున్నారు. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిసింది. టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి వామపక్ష నేతలు కూడా మద్ధతు తెలువుతున్నారని టీడీపీ ఎంపీలు ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఎంఐఎం అధ్యక్షుడు, ఆ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ టీడీపీ ఎంపీల అవిశ్వాస నోటీసుపై సంతకం చేశారు. ఇంకా ప్రతిపక్ష పార్టీల ఎంపీల మద్దతు కోరుతూ వారి సంతకాలు తీసుకునే పనిలో టీడీపీ ఎంపీలు ఉన్నారు.



ఇప్పటివరకు సుమారు 40 మంది ఎంపీలు సంతకాలు సేకరించినట్లు సమాచారం. సభ సరిగా నడవనందున అవిశ్వాస తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ సుమిత్ర మహాజన్ చెప్పడంతో టీడీపీ ఎంపీలు మరో అవిశ్వాస తీర్మాన లేఖను సిద్ధం చేసి స్పీకర్‌కు అందజేశారు. సోమవారం తమ తీర్మానాన్ని చర్చకు తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో డిమాండ్ చేశారు. అయితే సభ ఆర్డర్‌లో లేకపోతే అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు తప్పుపట్టారు. సభ ఆర్డర్ లేకపోయినా చర్చ లేకుండా ఆర్థిక బిల్లును పాస్ చేశారని, ఇప్పుడు అవిశ్వాస తీర్మానంపై సభ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నారని టీడీపీ ఎంపీలు విమర్శించారు.

టీడీపీ తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తాం

కేంద్రంపై టీడీపీ అవిశ్వాసం పెట్టడం సంతోషకరం:విజయసాయిరెడ్డి



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ అవిశ్వాస తీర్మానానికి తాము అనుకూలంగా ఓటేస్తామని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. లోక్ సభ వాయిదా అనంతరం పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏపీ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో ఏ రాజకీయ పక్షానికైనా మద్దతు ఇచ్చేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంపై వైసీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానం విషయం చర్చకు వచ్చే దాకా ఎన్డీఏలో కొనసాగిన చంద్రబాబు, ఎట్టకేలకు బయటకు వచ్చి అవిశ్వాసం పెట్టడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రధానినే కాదు, ఎవరినైనా తాను కలుస్తానని, అందులో తప్పేముందని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించండి

ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునథరెడ్డి

వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : అనంత రైతాంగానికి రావాల్సిన రూ.122 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. అసెంబ్లీలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని కోరారు. అనంతపురం జిల్లాలో అతివృష్టి, అనావృష్టితో పూర్తిగా పంటనష్టపోయిన వేరుశనగ రైతాంగానికి సుమారు రూ.122 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ అందించాల్సి ఉందని ,వాటిని సత్వర్యమే అందించి ఆదుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ లో మాట్లాడుతూ, జిల్లాలో రెండు హెక్టార్ల లోపల ఉన్న రైతులు , ఈ క్రాప్ చేయకుండా మిగిలిపోయిన రైతులు సుమారు 80 వేల మంది ఉన్నారని, వీరికి రూ.122 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో అనంత జిల్లా రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ గతంలో ఎన్నడూ లేనంతగా మంజూరు చేశారని గుర్తుచేశారు. ఇంకా అర్హులైన రైతులకు సుమారు రూ.122 కోట్ల నిధులు అవసరం కాగా వీటిలో ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో జిల్లా వ్యవసాయ శాఖ వద్ద రూ.72 కోట్లు మిగిలిఉన్నాయని, ఇంకా రూ.50 కోట్ల రూపాయలు ప్రభుత్వం తక్షణం మంజూరు చేస్తే అందరికి న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా 2016, 2017 లో వుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం, కొత్తచెరువు, వుట్టపర్తి ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలకు మామిడి, చీనీ, బొప్పాయి, వరి, వంటి ఉద్యాన పంటలు దెబ్బతిందని , రైతులకు జరిగిన పంట పరిహారం ప్రభుత్వం నుంచి సుమారు రూ.7 కోట్ల రూపాయలు రావాల్సి వుందని తక్షణం ఈనిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనికి వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం రైతులకు కష్ట కాలంలో అండగా ఉంటుందని, రైతులకు అందించాల్సిన ఇన్ ఫుట్ సబ్సిడీ నిధులు మంజూరు కు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వర్షాలకు ఉద్యాన వన పంటలు నష్టపోయిన రైతాంగాన్ని తప్పకుండా ఆదుకుంటామని, వెంటనే అధికారులతో నివేదకలు తెప్పించుకుని న్యాయం చేస్తామన్నారు. అనంతపురం జిల్లాలో కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ అకాడమీ కి 900 ఎకరాలు, బెల్ కంపెనీ కి 500 ఎకరాలు, ఎయిర్ బస్ ఏర్పాటుకు సుమారు 209 ఎకరాలు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం వివిధ కంపెనీలకు అప్పగించిందని, అవి ఏ స్థాయిలో ఉన్నాయో, వాటి వల్ల ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఎంత మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని పరిశ్రమల శాఖ మంత్రిని అడిగారు. దీనికి పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ఇవ్వనంతగా టీడీపీ ప్రభుత్వం అనేక రాయితీల తో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కియా, దాని అనుబంధ రంగ పరిశ్రమల రాకతో అనంత జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.



పవన్ వ్యాఖ్యల్లో స్పష్టత లేదు: రావుల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై బీజేపీ డ్రామాలకు తెరలేపిందని టీటీడీపీ నేత రావుల చంద్ర శేఖర్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ మేరకు శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీని కేంద్రం అనేక ఇబ్బందులు పెడుతోందన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఏపీ మంత్రి నారా లోకేశ్ పై అవినీతి ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్‌కు ఓ ప్రశ్న వేస్తున్నానని, ఏపీకి ప్రత్యేక హోదాపై రాజ్యసభ సభ్యుడిగా ఉన్న మీ అన్న చిరంజీవి ప్రశ్నించకపోవడంపై ప్రశ్నించవే అని అన్నారు. పవన్ వ్యాఖ్యల్లో స్పష్టత లేదని, లోకేశ్ పై ఆయన చేసిన ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. ఏపీని కేంద్రం అనేక ఇబ్బందులు పెడుతోందని, కేంద్రానికి రాష్ట్రాలు ఇచ్చే పన్నుల కంటే, కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధులు చాలా తక్కువని అన్నారు. ఇన్నాళ్లు ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.



అవిశ్వాసం చర్చకు వస్తే కేంద్రానికి టీఆర్ఎస్ వ్యతిరేకమే : ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్:పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తే టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. టీఆర్ఎస్ పార్లమెంట్‌లో అనుసరించే వైఖరిని ఎంపీ వినోద్ కుమార్ ఇప్పటికే స్పష్టం చేశారని ఆయన అన్నారు. శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించిందన్నారు. బడ్జెట్‌పై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు అక్షర సత్యాలుగా అమలవుతాయని, బడ్జెట్ మరోమారు నిరూపించిందని కర్నె ప్రభాకర్ అన్నారు. దేశంలోనే అభివృద్ధిపథంలో దూసుకుపోతున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. . ఉమ్మడి రాష్ట్ర పాలనలో జీడీపీ 5 శాతంగా నమోదయ్యేదని, కానీ ఇప్పుడు తెలంగాణ జీడీపీ రెండంకెల స్థాయిని దాటిందన్నారు. 2017-18 బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేటాయింపుల్లో 95 శాతం ఖర్చు చేసిన ఘనత తెలంగాణదేన్నారు. బడ్జెట్ ఇంత బాగా ఉంటే కాంగ్రెస్ నేతలు దొంగ దీక్షలు చేస్తూ పిల్లి శాపాలు పెడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందని ప్రజలు గత ఎన్నికల్లో తీర్పు ఇచ్చారన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణను కాంగ్రెస్ నేతలు ఎప్పుడో అమ్మేసేవారని విమర్శించారు. కేసీఆర్ శక్తి ఏమిటో ఢిల్లీలో దేశం చూడబోతుందని కర్నె ప్రభాకర్ అన్నారు. టీఆర్ఎస్‌లో చేరేందుకు తనకు కాంట్రాక్టులు ఇవ్వజూపారని కాంగ్రెస్ నేత సంపత్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. అంత దిగజారి ప్రవర్తించాల్సిన కర్మ టీఆర్ఎస్‌కు పట్టలేదన్నారు. సీఎం కేసీఆర్‌పై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

అతిసార బాధితులకు ప్రభుత్వం అండ

• రోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా చికిత్స • రోజూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష • 8 మంది బాధ్యుల సస్పెన్షన్ • క్రిమినల్ కేసులకు చర్యలు • మృతుల నిర్ధారణకు కమిటీ నియామకం • మృతులకు చంద్రన్న బీమాతోపాటు రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా • పవన్ కు దీక్ష చేసే అవకాశం ఇవ్వం • 48 గంటల్లో సమస్యల పరిష్కారం • మంత్రులు నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే మోదుగుల



వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : గుంటూరులోని అతిసార వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు డాక్టర్ పి.నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల రెడ్డి చెప్పారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వారు మాట్లాడారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ట్యాంకులో నిల్వ ఉన్న నీరు కలుషితం అవడం వల్ల ఆ ప్రాంతంలోని వారు అతిసార(డయేరియా) బారినపడ్డారని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఇంటింటికి తిరిగి బాధితులను గుర్తించి ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఆ ప్రాంతాల్లో పది మెడికల్ క్యాంపులు, పది అంబులెన్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం రోగులకు ప్రభుత్వ ఆస్పత్రితోపాటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా చికిత్స చేయిస్తున్నామని, ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యుల సూచనల మేరకు కొంతమందిని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇంకా ముగ్గురు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రతి రోజు పరిస్థితిని సీఎం సమీక్షిస్తున్నట్లు చెప్పారు. నీరు కలుషితం అవడానికి బాధ్యులైన 8 మంది శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇంకా బాధ్యులు ఎవరైనా ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం 130 మంది ఆసుపత్రిలో చేరారని, ఆ సంఖ్య ఈరోజుకు 82కు తగ్గినట్లు తెలిపారు. మరణించిన వారు ఎంతమందో నిర్ధయించడానికి ఒక కమిటీ వేశామని, 8 మంది మరణించినట్లు ప్రస్తుతానికి ఆ కమిటీ నిర్ధారించిందని, ఆ కుటుంబాల వారికి చంద్రన్న బీమాతోపాటు రూ.5లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇచ్చినట్లు వివరించారు. తామే మృతుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా మరణించినట్లు ఆ కమిటీ నిర్ధారిస్తే వారికి కూడా ఎక్స్ గ్రేషియా అందజేస్తామన్నారు. తాము ఆస్పత్రికి వెళ్లి రోగులను రోగులను పరామర్శించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మునిసిపల్, ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది రక్షిత మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అతిసారం వ్యాపించిన ప్రాంతాలకు 75 ట్యాంకుల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ట్యాంక్ లను సూపర్ క్లోరినేషన్ చేయించినట్లు తెలిపారు. రాత్రి 11.30 గంటల వరకు తాము ఆ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి నీరు ఎలా వస్తుందో విచారించామని, మంచినీరు వస్తున్నట్లు వారు తెలిపారన్నారు. గుంటూరులో 40 ఏళ్ల క్రితం అమర్చిన మంచినీటి సరఫరా పైప్ లైన్లను మార్చడానికి గత ఫిబ్రవరి 20న టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఇటువంటి సంఘటన జరిగిన సందర్భంలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలోపెట్టుకొని విలువైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి బదులు దీనిని రాజకీయం చేయడానికి కొందరు నాయకులు రావడం భావ్యంకాదన్నారు. సమస్య పరిష్కారానికి సద్విమర్శలు చేయాలన్నారు. రాళ్లువేయడం తగదన్నారు. నిర్మాణాత్మక సలహాలు ఇచ్చినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ విమర్శలను స్వాగతిస్తున్నామని, ఆయనకు దీక్షకు కూర్చునే అవకాశం ఇవ్వం అని, 48 గంటల లోపలే అన్ని అంశాలు పరిష్కరిస్తామని చెప్పారు. గుంటూరు ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే గుంటూరు అభివృద్ధికి రూ.2వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

ఉగాదికి తిరుమల ముస్తాబు



తిరుమల, సూర్య ప్రతినిధి : ఈ నెల 18వ తేదీ ఆదివారంనాడు ఉగాది పర్వదినాన్ని నిర్వహించేందుకు తిరుమల దివ్యక్షేత్రం శోభాయ మానంగా ముస్తాబు అవుతున్నది. తెలుగువారి సంవత్సరాదియైన శ్రీ విలంబినామ ఉగాది పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఆలయం, పరిసరాలను పచ్చని పందిళ్లతో, రంగవల్లులతో, దేదీప్యమానమైన విద్యుద్దీపాలతో, వివిధ రకాల పుష్పాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 3గంటలకు సుప్రభాతం, శుద్ధి నిర్వహించి అనంతరం తోమాలసేవను ఏకాంతంగా నిర్వహిస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి మరియు విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ నిర్వహిస్తారు.

పార్లమెంట్ సాక్షిగా మోడీ, టీఆర్ఎస్ లాలూచీ బట్టబయలు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రధాని మోదీతో టీఆర్ఎస్‌పార్టీ లాలూచీ పార్లమెంట్ సాక్షిగా బట్టబయలైందని కాంగ్రెస్‌నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అన్నారు. అవిశ్వాసం చర్చకు రాకుండా మోదీ తరపున టీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషించిందని విమర్శించారు. టీఆర్ఎస్ సభ్యుల ఆందోళనతో సభ ఆర్డర్ లో లేదన్న వంక చూపి స్పీకర్ అవిశ్వాసంపై చర్చ చేపట్టలేదన్నారు. అవిశ్వాసం చర్చకు వస్తే విభజన సమస్యల పై చర్చించే అవకాశం ఉండేదన్నారు. విభజన చట్టం పై చర్చ జరిగితే తెలంగాణ సమస్యల మరోసారి పార్లమెంట్ దృష్టికి వచ్చేవని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీతో టీఆర్ఎస్ లాలూచిపడి అవిశ్వాసాన్ని అడ్డుకున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ది థర్డ్ ఫ్రంట్ కాదని, మోదీ సెకండ్ ఫ్రంట్ అని మొదటి నుంచీ తాము చెబుతూనే ఉన్నామని పేర్కొన్నారు. ఇవాళ పార్లమెంట్ లో టీఆర్ఎస్ తీరుతో మేం చెప్పింది నిజమని తేలిందని రేవంత్ అన్నారు.

రాష్ట్రం అప్పుల కుప్ప!

• ఇంతింతై...వటుడింతైనట్లు • రాష్ట్ర అప్పు రూ.2.21కోట్లపైకి • 1.51 లక్షల కోట్లు ప్రస్తుతమున్న అప్పు • అప్పు కోసం కొత్తగా కార్పొరేషన్ల ఏర్పాటు • ఈ ఏడాది మరో 70 వేల అప్పు కోసం ప్రయత్నం • ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర వాటాగా వచ్చిన అప్పు రూ.70 వేల కోట్లు. • రూ.13వేల కోట్లు ఏటా వడ్డీ చెల్లింపులు!



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: అప్పుచేసి పప్పుకూడు తినొద్దని ఓ సినిమాలో పాడిన పాట. అయితే తెలంగాణ సర్కార్ మాత్రం అప్పుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తున్నది. కంపెనీలు సైతం అప్పు చేయకుండా అభివృద్ధి సాధించవని, తెలంగాణ సర్కార్ సైతం అప్పు చేసి పప్పుకూడా తినడం లేదని..రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్ గురువారంనాడు సెలవిచ్చారు. అయితే తెలంగాణ రుణ ప్రస్థానం భారీ బడ్జెట్‌తో పాటే పరుగులు వేస్తున్నది . వచ్చే ఏడాదికి అప్పు ఏకంగా రూ.2.21 లక్షల కోట్లు దాటనుంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి అప్పుల మొత్తం రూ.1,80,238 కోట్లకు చేరుతుందని ప్రభుత్వం బడ్జెట్లో ప్రస్తావించింది. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.1,51,133 కోట్ల అప్పులు చేసినట్లు వెల్లడించింది. వీటితో పాటు ఇప్పటికే మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర కార్పొరేషన్ల పేరిట మరో రూ.41,538 కోట్ల అప్పు చేసినట్లుగా వెల్లడించింది. వెరసి మొత్తం అప్పు రూ.2.21 లక్షల కోట్లు దాటడం ఖాయంగా కనిపిస్తోంది. వీటికి తోడు సాగునీటి ప్రాజెక్టుల రుణ సమీకరణకు తెలంగాణ వాటర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌ను ఇటీవలే ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసింది.

వీటి ద్వారా దాదాపు రూ.20 వేల కోట్లు అప్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయనుంది. దీంతో కార్పొరేషన్ల అప్పు అంతకంతకూ పెరిగిపోనుంది. సాధారణంగా కేంద్రం నిర్దేశించిన ఎఫ్ఆర్‌బిఎం చట్ట పరిధిలోకి లోబడే రాష్ట్రాలు వివిధ ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర జీఎస్డీపీలో 3.25 శాతం మేరకు రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే రెవెన్యూ మిగులు ఉన్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణకు కేంద్రం 3.50 శాతం వరకు పెంచుతూ వెసులుబాటు కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.23 వేల కోట్ల మేర అప్పు తీసుకున్న ప్రభుత్వం వచ్చే ఏడాది రూ.29 వేల అప్పులు తీసుకోనుంది. అంతమేరకు జీఎస్డీపీలో 3.45 శాతం ద్రవ్యలోటును బడ్జెట్లో ప్రస్తావించింది. నిబంధనల ప్రకారం రాష్ట్ర అప్పు జీఎస్డీపీలో 25 శాతం మించకూడదని, అంతకు మించితే ఆర్థిక క్రమశిక్షణ పాటించని రాష్ట్రాల జాబితాలో చేరి పోయే ప్రమాదం ఉంటుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే అప్పులు జీఎస్డీపీలో 21.39 శాతానికి చేరనున్నాయి. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉమ్మడి రాష్ట్రం నుంచి పంచుకున్న అప్పు రూ.70 వేల కోట్లు. గడిచిన నాలుగేళ్లలో ఈ అప్పు అంతకంతకు పెరిగిపోయింది. వడ్డీలకే 13 వేల కోట్లు!: చేసిన అప్పులు తిరిగి చెల్లించటం తెలంగాణ రాష్ట్ర ఖజానాకు భారంగా మారనుంది. 2016-17లో రాష్ట్ర ప్రభుత్వం రూ.8,609 కోట్ల వడ్డీలు చెల్లించినట్లు అకౌంటెంట్ జనరల్ తన గణాంకాల్లో ధ్రువీకరించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో పొందుపరిచింది. అలాగే 2017-18లో వడ్డీల చెల్లింపులకు రూ.11,138 కోట్లు వెచ్చించింది. సవరణ బడ్జెట్లోనూ ఇవే గణాంకాలున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ఈ వడ్డీల భారం రూ.11, 691 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. దాదాపు రూ.29 వేల కోట్ల అప్పులను అంచనా వేసిన ప్రభుత్వం.. వడ్డీల లెక్కలను మాత్రం తక్కువ చేసి చూపినట్లు స్పష్టమవుతోంది. వడ్డీల మోత రూ.13 వేల కోట్లు దాటే అవకాశాలున్నాయని ఆర్థికనిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరంఅప్పులు (రూ.కోట్లలో) 2015-1693, 1152016-171, 27,8292017- 181,51, 1332018- 191,80,223 కార్పొరేషన్ల అప్పు (జనవరి 2018నాటికి)మిషన్ భగీరథ7,031ఇరిగేషన్16,413ఇతర రుణాలు 18,094

కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శిని కలిసిన గంటా



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర మానవ వనరులశాఖ కార్యదర్శిని మంత్రి గంటా శ్రీనివాసరావు కలిశారు. రాష్ట్రంలో సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ ఏడాదిలోనే తాత్కాలిక భవనాల్లోనైనా తరగతులు ప్రారంభించాలని వినతిపై తాత్కాలిక భవనాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని రెడ్డిసు మణ్యం చెప్పారు. ఏపీలో సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై త్వరలో కేబినెట్ ఆమోదానికి నోట్ పంపుతామని రెడ్డిసుబ్రమణ్యం తెలిపారు.

బిజెపి అధికారంలోకి రావడం ఖాయం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సంస్థాగతంగా ఎలాంటి బలం లేని త్రిపుర లాంటి రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందని, 2014 తర్వాత దేశంలో 14 రాష్ట్రాల్లో క్రమంగా పార్టీ అధికారం చేపట్టిందని, 2019లో తెలంగాణాలో కూడా బిజెపి అధికారంలోకి వస్తుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం పార్టీ కార్యాల్యంలో ఏర్పాటు చేసిన బిజెపి రాష్ట్ర పదాధికారుల, ఓబీసీ మోర్చా, మీడియా కమిటీ, ఐటీ, సోషల్ మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని, అధికారాన్ని ఏర్పాటు చేస్తుందని..దాని తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో పెను మార్పులు సంభవిస్తాయని అవి బిజేపీకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. టిడిపి.. ఎన్డీయే నుంచి వెళ్లిపోయినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని, దాని ప్రభావం ఏమీ ఉండదని, ఇది బిజెపికి అనుకూలంగా మారుతుందని తెలిపారు.

టిటిడి అనుబంధ ఆలయాల్లో ఉగాది వేడుకలు



తిరుపతి, సూర్య ప్రతినిధి : టిటిడికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో మార్చి 18న ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేయనుండడంతో ప్రత్యేకంగా క్యూలైన్లు తదితర ఏర్పాట్లు చేపట్టారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు శ్రీకృష్ణ ముఖ మండపంలో స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు పుష్పపల్లకీలో అమ్మవారు వేంచేసి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహిస్తారు. శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు.

శ్రీ కోదండరామాలయంలో : తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 18న ఉగాది సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారు మూలవర్లకు, ఉత్సవర్లకు వస్త్రసమర్పణ చేస్తారు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో : టిటిడికి అనుబంధంగా ఉన్న గుంటూరు జిల్లా అనంతవరంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మార్చి 18న ఉగాది సందర్భంగా ఉదయం 4 గంటలకు మూలవర్లకు అభిషేకం చేస్తారు. సాయంత్రం 5 నుండి రాత్రి 7గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు.

జగన్ రెండు సార్లు మద్దతిస్తే ఏం చేశావ్ బాబు?

వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



విజయవాడ,సూర్యబ్యూరో: చంద్రబాబు అనే వ్యక్తి ఒక సామాజిక నేరగాడు ఒక వెన్నుపోటు దారుడని ఏపీ ప్రజలు గుర్తించారని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఓటుకు కోట్ల కేసులో అడ్డంగా ఆడియో, వీడియో టేపుల్లో దొరికిపోయి నేటికీ మనవాళ్లు బ్రీఫ్డ్‌మీ వాయిస్ తనది కాదని చెప్పలేకపోయిన వ్యక్తి చంద్రబాబు అని ఆర్కే ధ్వజమెత్తారు. విజయవాడలోని వైసీపీ కార్యాలయంలో ఆర్కే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి విషయంలోనూ ఏదో రకంగా దోచుకుని చంద్రబాబు ఈ నాలుగేళ్లలో సుమారు రూ. 5 లక్షల కోట్లు సంపాదించారని ఆర్కే ఆరోపించారు. వైఎస్ఆర్‌సీపీ నేతలను ఆర్థిక నేరగాళ్లు అని చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు చుట్టూ ఉండే వారే అసలైన ఆర్థిక నేరగాళ్లన్నారు. సుజనా చౌదరి, గంటా శ్రీనివాసరావు, రాయపాటి బ్యాంక్‌లకు డబ్బులు ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాళ్లు కాదా అని ఆర్కే ప్రశ్నించారు. రాష్ట్రాన్ని మొత్తం దోచేసిన చంద్రబాబు అతిపెద్ద ఆర్థిక నేరగాడంటూ ధ్వజమెత్తారు. నాలుగేళ్లుగా పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టులు, రాజధాని నిర్మాణం, మట్టి, ఇసుక ఇలా ప్రతి విషయంలో దోచుకుని చంద్రబాబు సుమారు రూ. 5 లక్షల కోట్లు సంపాదించారని ఆర్కే ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఏమైపోయినా పరవాలేదని, తాను, తన కుమారుడు నారా లోకేష్ బాగుంటే చాలని భావించే వ్యక్తి చంద్రబాబు అని ఆర్కే .

ప్రత్యేక హోదా కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు దీక్షలు, ధర్నాలు చేసిన ఏకైక వ్యక్తి వై సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. వైఎస్ జగన్ నాయకత్వంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రజలకు సంజీవని అని పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా ఉన్నారని చెప్పారు. నవ్యాంధ్రకు 15 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన వారు మాట నిలబెట్టుకోవాలని వైఎస్ జగన్ అన్నారు. మేము అవిశ్వాసం పెడితే.. మీరు మద్దతు ఇవ్వండి.. ఒకవేళ మీరు నోటీసులిస్తే మేము మద్దతు ఇస్తామని వైఎస్ జగన్ మాటల్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ టీడీపీ ఆ మాట మర్చిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తే తన భవిష్యత్తు అని నమ్మిన వైఎస్ జగన్ సీఎం చంద్రబాబు దొంగ అని తెలిసినా అసెంబ్లీలో టీడీపీ పెట్టిన తీర్మానానికి రెండు సార్లు సభ్యులందరితో సంతకాలు చేయించి మద్దతు ఇచ్చారని చెప్పారు. తీర్మానాలు చేయించిన కాగితాలు కేంద్రానికి పంపించి ఉంటే ఏపీ ప్రజల బాధ వారికి తెలిసేదని, ఆ కాగితాలు ఉన్నాయా? లేక స్పీకర్‌తో చింపించి పడేశావా? అని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఆర్కే ప్రశ్నించారు. వైఎస్ఆర్‌సీపీ నేతలపై పెట్టినవన్నీ అక్రమ కేసులని న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్ ఒక్కొక్కటిగా కొట్టేస్తున్నాయని ఆర్కే తెలిపారు. ఆర్థిక నేరగాళ్లు చంద్రబాబు చుట్టూ ఉన్నారు. బాబు పక్కనే ఉండే సుజనా చౌదరి మారిషస్ దేశ బ్యాంక్ నుంచి వేల కోట్లు అప్పు తీసుకొని ఎగనామం పెట్టాడన్నారు. అదే విధంగా రాయపాటి సాంబశివరావు, గంటా శ్రీనివాసరావులు ప్రజలు బ్యాంక్‌లలో దాచుకున్న సొత్తును అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించలేదన్నారు. ఇలాంటి వారందరినీ పక్కన పెట్టుకున్న చంద్రబాబే అతిపెద్ద ఆర్థిక నేరగాడని ఎమ్మెల్యే ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు

బీజేపీ కనుసైగలలో నడుస్తున్న టీఆర్ఎస్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : విభజన చట్టంలోని హామీల అమలు కోసం కేంద్రంపై అవిశ్వాసం ప్రవేశపెడితే టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు, పార్లమెంట్ లో సభ ఆర్డర్‌లో లేకుండా ఆందోళన కొనసాగించడం దురదుష్టకరమని సీఎల్పీ ఉపనేత జీవన్ రెడ్డి అన్నారు. మూడో ప్రత్యామ్నాయం పేరు వల్లిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, బీజేపీ సర్కారు కు వ్యతిరేఖంగా టీడీపీ, టీఎంసీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు అవిశ్వాసం ప్రవేశపెడితే, టిఆర్ఎస్ పార్లమెంట్ లో అడ్డుకోవడంలో అంతర్యమేమిటని ఎద్దేవా చేశారు. బీజేపీ కనుసైగలో టిఆర్ఎస్ నడుచుకున్నట్లు ఈసంఘటన ద్వారా మరోమారు స్పష్టమయిందని జీవన్‌రెడ్డి అన్నారు. విభజన హామీల అమలు కోసం విపక్షాలు పోరాడుతుంటే, టీఆర్ఎస్ వైఖరి దానికి విరుద్ధంగా ఉండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడి రాయితీ, పంట గిట్టుబాటుకు ప్రత్యామ్నాయం కాబోదని అన్నారు. రుణమాఫీ లబ్దినే రైతులు పొందలేకపోయారని, ఇక ఈ పెట్టుబడి ఏం పొందుతారని ఆయన అన్నారు. శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ రుణమాఫీ కింద వడ్డీ రాయితీ నాలుగేళ్లలో ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. విద్యుత్ కొనుగోలులో కమీషన్ల బండారం బయటపడకుండా ఉండేందుకే 24 గంటల విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఆరోపించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. దళితులకు గత బడ్జెట్‌లో రూ. 26వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, అందులో కేవలం 13వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఎంబీసీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం వద్ద అత్యంత వెనుకబడిన వర్గాల కులాల జాబితానే లేనే లేదని విమర్శించారు. 27వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతున్న ప్రభుత్వం, మిగతా 80వేల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారో చెప్పలేదన్నారు. మిషన్ భగీరథ కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్న ఆయన పైపుల కోసం నీళ్లా? నీళ్ల కోసమా పైపులా? అంటూ ఎద్దేవా చేశారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“దేశంలో ఇటీవల సంభవిస్తున్న రాజకీయ పరిణామాలు అత్యంత ఆశ్చర్యాన్ని కలగజేస్తున్నాయి. 2014లో సార్వత్రిక ఎన్నికలలో అఖండ విజయం అనంతరం వివిధ రాష్ట్రాలలో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయాలతో అప్రతిహతంగా సాగిపోతున్న భారతీయ జనతా పార్టీ ఉప ఎన్నికలలో ఎదురుదెబ్బలు తింటున్నది. ఉత్తరాదిన పలు రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బిజెపి ఈశాన్య రాష్ట్రాలలో కూడా ఆ విషయంలో కృతకృత్యమైంది. దీనితో బిజెపిలో ఒక విధమైన అహంభావం నెలకొన్న సూచనలు కనిపిస్తున్నాయి. అందుకే గతంలో తాను చేసిన వాగ్దానాలను బేఖాతరు చేయడానికి కూడా బిజెపి వెనుకాడడం లేదు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విభజన సమయంలో పార్లమెంట్‌లో రాష్ట్రాన్ని రెండుగా చేసినా ఎపికి న్యాయం జరిగేలా పోరాడతామని బిజెపి అగ్ర నేతలు శపథం చేశారు. తెలుగు దేశం పార్టీ సహా కొన్ని ప్రాంతీయ పార్టీల భాగస్వామ్యంతో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)ని ఏర్పాటు చేసిన బిజెపి 2014 లోక్‌సభ ఎన్నికలలో సొంతంగా పూర్తి మెజారిటీ సాధించింది. దీనితో మరే పార్టీపైనా ఆధారపడవలసిన అవసరం లేకపోవడంతో బిజెపి ఇతర భాగస్వామ్య పక్షాల పట్ల ఎలా అయినా వ్యవహరించవచ్చుననుకొంటున్నట్లుగా కనిపిస్తోంది.
రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని యుపిఎ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వాగ్దానం చేసింది. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న బిజెపి ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వవలసిందేనని పట్టుబట్టింది కూడా. కాని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా మంజూరుకు నిబంధనలు అనుమతించవనే సాకు చూపి దానికి బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని బిజెపి నమ్మబలికింది.”

దేశంలో ఇటీవల సంభవిస్తున్న రాజకీయ పరిణామాలు అత్యంత ఆశ్చర్యాన్ని కలగజేస్తున్నాయి. 2014లో సార్వత్రిక ఎన్నికలలో అఖండ విజయం అనంతరం వివిధ రాష్ట్రాలలో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయాలతో అప్రతిహతంగా సాగిపోతున్న భారతీయ జనతా పార్టీ ఉప ఎన్నికలలో ఎదురుదెబ్బలు తింటున్నది. ఉత్తరాదిన పలు రాష్ట్రాలలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన బిజెపి ఈశాన్య రాష్ట్రాలలో కూడా ఆ విషయంలో కృతకృత్యమైంది. దీనితో బిజెపిలో ఒక విధమైన అహంభావం నెలకొన్న సూచనలు కనిపిస్తున్నాయి. అందుకే గతంలో తాను చేసిన వాగ్దానాలను బేఖాతరు చేయడానికి కూడా బిజెపి వెనుకాడడం లేదు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విభజన సమయంలో పార్లమెంట్‌లో రాష్ట్రాన్ని రెండుగా చేసినా ఎపికి న్యాయం జరిగేలా పోరాడతామని బిజెపి అగ్ర నేతలు శపథం చేశారు. తెలుగు దేశం పార్టీ సహా కొన్ని ప్రాంతీయ పార్టీల భాగస్వామ్యంతో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)ని ఏర్పాటు చేసిన బిజెపి 2014 లోక్‌సభ ఎన్నికలలో సొంతంగా పూర్తి మెజారిటీ సాధించింది. దీనితో మరే పార్టీపైనా ఆధారపడవలసిన అవసరం లేకపోవడంతో బిజెపి ఇతర భాగస్వామ్య పక్షాల పట్ల ఎలా అయినా వ్యవహరించవచ్చుననుకొంటున్నట్లుగా కనిపిస్తోంది.

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని యుపిఎ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వాగ్దానం చేసింది. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న బిజెపి ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వవలసిందేనని పట్టుబట్టింది కూడా. కాని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా మంజూరుకు నిబంధనలు అనుమతించవనే సాకు చూపి దానికి బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని బిజెపి నమ్మబలికింది. కాని అప్పటి నుంచి సంవత్సరాలు గడచిపోయాయి కాని రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ కింద ఇవ్వవలసిన నిధులు సరిగ్గా విడుదల చేయకుండా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తప్పించుకుంటూ వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని సార్లు ఢిల్లీ సందర్శించినా ఫలితం లేకపోయింది. ప్రత్యేక హోదా గాని, ప్రత్యేక ప్యాకేజీ గాని లేకపోవడంతో ఆర్థికపరంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోతోంది.

ఎన్‌డిఎపై తొలి అవిశ్వాస తీర్మానం

తాజా బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి మొండి చేయి ఎదురవడంతో సిఎం చంద్రబాబుకు ఓపిక నశించిపోయింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వంలోని టిడిపి మంత్రులు పి అశోక్ గజపతి రాజు, వై సుజన చౌదరిలను సిఎం ఉపసంహరించారు. అందుకు ప్రతిగా బిజెపి రాష్ట్ర ప్రభుత్వంలోని తమ మంత్రులు కామినేని శ్రీనివాస్, పి మాణిక్యాలరావులను ఉపసంహరించింది. చంద్రబాబు ఆ తరువాత ఎన్‌డిఎ నుంచి వైదొలగుతూ ఆ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ఇతర పార్టీలు కూడా సానుభూతిగా ఉన్నాయన్న ఆయన వాటి మద్దతు తీసుకుంటామని చంద్రబాబు శుక్రవారం చెప్పారు. ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని, రాష్ట్రానికి న్యాయం చేయాలన్నదే తమ డిమాండ్ అని సిఎం స్పష్టం చేశారు.

మరొక వైపు ప్రతిపక్షం వైసిపి కూడా కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. ఎన్‌డిఎ ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రకటిస్తూ తెలుగు దేశం పార్టీ ఎంపిలతో పాటు వైసిపి ఎంపిలు కూడా శుక్రవారం లోక్‌సభలో తీర్మానం ప్రతిపాదనకు నోటీస్‌లు ఇచ్చారు. టిడిపి అవిశ్వాస తీర్మానానికి పలు పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, వైసీపీలు కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చాయి. ఈ తీర్మానాలకు ఇతర పార్టీల మద్దతును కూడగట్టేందుకు రెండు పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో, తెలుగు దేశం పార్టీ ఇచ్చిన తీర్మానానికి కాంగ్రెస్, ఎఐఎడిఎంకె, వామపక్షాలు మద్దతు ప్రకటించినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. లోక్ సభలో కాంగ్రెస్‌కు 48, అన్నా డిఎంకెకు 37 మంది ఎంపిలు ఉన్నారు. మరొక వైపు ఎన్‌డిఎలో భాగస్వామ్య పక్షమైన శివసేన కూడా తెలుగు దేశం పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు. తీర్మానానికి మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. మోడీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏక తాటిపైకి రావాలని ఆమె పిలుపు ఇచ్చారు. కాగా, అవిశ్వాస తీర్మానాల నేపథ్యంలో జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. శుక్రవారం కూడా జైట్లీ పాత పాటే వినిపించారు. తాము ప్యాకేజీకి కట్టుబడి ఉన్నామని, వాగ్దానం చేసిన మేరకు ప్రత్యేక కేటగరీ రాష్ట్రం హోదాకు సమానంగా ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు అందజేయగలమని, అయితే, తమ పరంగా ఆలస్యమేమీ లేదని జైట్లీ చెప్పారు. కాని ఆ నిధులు అందుకోవడానికి తగిన యంత్రాంగం గురించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరాలు కోసం తాము నిరంతరంగా నిరీక్షిస్తున్నామని ఆయన చెప్పారు. జైట్లీ మరొక మాట కూడా అన్నారు. తాము ఒక పరిష్కారాన్ని సూచించామని, తమకు వనరులు కావాలా లేక వివాదం చేయదలచుకున్నారా అనేది తేల్చుకోవలసింది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమే అని జైట్లీ అన్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు తరువాత ఏ రాష్ట్రానికీ ప్రత్యేక కేటగరీ హోదా కల్పించవలసిన అవసరం లేకపోయిందనే పాత పాట కూడా ఆయన పాడారు. అయితే, ఆ ఆర్థిక సంఘం సభ్యులు కొందరు ఆ మాటలను తోసిపుచ్చారు. ఆర్థిక సంఘం సిఫార్సులకు, ప్రత్యేక హోదా మంజూరుకు ఏమాత్రం సంబంధం లేదని వారు పేర్కొన్నారు. కాని కేంద్రం మాత్రం అదే వాదనను మళ్లీ మళ్లీ వినిపిస్తోంది. అసలు జైట్లీ ఆంధ్ర ప్రదేశ్ పట్ల కక్షతో వ్యవహరిస్తున్నారేమో అనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఏమైనా ఎన్‌డిఎ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం నోటీస్ అందుకోవడం ఇదే ప్రథమం. ఎన్‌డిఎకు లోక్‌సభలో ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా అవిశ్వాస తీర్మానం వీగిపోతే వీగిపోవచ్చు. కాని ఈ పరిణామం ఎన్‌డిఎకు ఒక విధంగా అవమానకరమైనది కూడా. ఇటువంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం ముందుగా జాగ్రత్త పడి ఉంటే బాగుండేది.

అన్ని పార్టీలలో దేశం, వైసీపీల అవిశ్వాసాల వేడి

ఎం.రామ్ గోపాల్ – హైదరాబాద్

- ఇరు పార్టీలు అవిశ్వాసానికి చెరో వైపు
- పదే పదే సాయిరెడ్డి పిఎంఒ కెళ్లడంతో అనుమానాలు
- పవన్ వెనుక లేమంటూ కమలనాథుల ప్రకటనలు
- అవిశ్వాసంపై దేశానికి మద్దతిస్తున్న పలు పార్టీలు
- బాబు నేతృత్వంలో సరికొత్త ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు?



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రత్యేక హోదా తో పాటు విభజన చట్టంలోని అంశాలను తుంగలో తొక్కడంతో పాటు ఇస్తామని చెప్పిన ప్రత్యేక పేకేజీలోనూ కోతలు పెడుతు తెలుగువారిని మోసం చేసిన బిజెపిపై అవిశ్వాసం ప్రకటించేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. అందరూ తాము రెడీ అంటే రెడీ సవాల్ చేసుకుంటున్న టైంలో ఇంతకాలం బీజేపీకి మిత్రపక్షంగా వ్యవహరించిన తెలుగుదేశం సైతం మేము కూడా రెడీ ప్రకటించడం క్షణాలలో దేశ వ్యాప్తంగా మద్దతు రావటంపై జాతీయ మీడియాలోనూ ఈ విషయంపై ప్రత్యేక కథనాలు ఆరంభమయ్యాయి. నిజానికి ఎన్డిఏలో ఉన్నప్పుడు తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుని విపక్షం చేసిన సవాళ్లపై స్పందిస్తూ అవిశ్వాస తీర్మానంతో ఒదిగేదేం లేదని వ్యతిరేకించినా.. విపక్ష వైసిపి రాజకీయంగా ముందుకు దూసుకు పోయేందుకు యత్నిస్తుండటంతో మిగతా పార్టీలతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమయ్యారు. కాగా ఇదే అంశంపై గత నెల 18వ తేదీనే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోలో ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం ఉంది. అయితే అప్పటికి

ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం గురించిన చర్చ జరగాల్సి ఉండగా, ఎటూ నెగ్గలేమని తెలిసిన జగన్, తన పాదయాత్రలో గత రెండు నెలలుగా ఈ విషయాన్ని పదే పదే చెపుతూ సవాళ్లు విసురుతున్నా, ఢిల్లీలో ఆ పార్టీ నేతలు, ముఖ్యంగా విజయసాయిరెడ్డి పదే పదే పిఎంఓని కలవటం, మరోవైపు జగన్ సంబంధిత కేసులలోఇడి జప్తు చేసిన ఆస్తులను విడుదల చేయించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలన్నీ ఒక్కొక్కటితో ఫలిస్తుండటంతో ఇరు పార్టీల మధ్య బంధం బలమవుతున్నట్లు తెలుగుదేశం వర్గాలు గత కొంత కాలంగా చేస్తున్న ఆరోపణలకు ఊతం దొరికి నట్లు అయ్యింది.

చంద్రబాబు పలు పర్యాయాలు వెళ్లినా, తెలుగుదేశం ఎంపీలు నిరసనలు చేస్తూ, ప్రధానిని కానీ మంత్రులను కానీ కలిసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో వారిని అపాయింట్ మెంట్లు నిరాకరిస్తూ వైసిపి ఎంపిలకు అపాయింట్ మెంట్లు ఇస్తుండటంతో సమస్యను పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం మీద అసత్య ఆరోపణలకు దిగేం దుకు కమలనాథుల సూచనలు అందుతున్నట్లు స్పష్టమైన సమాచారంతోనే చంద్రబాబు సొంతంగా అవిశ్వాసానికి సిద్ధమైనట్లు కనిపిస్తోంది.

మరోవైపు ఇన్నాళ్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాలను, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని ఎదుర్కొంటూ దిక్కూ దివాణం లేని రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్న ముఖ్యమంత్రి అంటూ చంద్రబాబుని ప్రశంసలలో ముంచెత్తిన పవన్ కళ్యాణ్ హఠాత్తుగా తన పంథా మార్చుకుని, జనసేన పార్టీ నాలుగో ఆవిర్భావ సభలలో తెలుగుదేశంపై విరుచుకుపడటం ఆశ్చర్యంకి గురి చేసింది. అందులోనూ ముఖ్యంగా ముక్యమంత్రి తనయుడు రాష్ట్ర మంత్రి లోకేష్ పేరును ప్రధానంగా ప్రస్తావిస్తూ, అనేక అవినీతి ఆరోపణలు చేసారు పవన్ వెనుక భారతీయ జనతా పార్టీ ఉండి నడిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో ఇక ఉపేక్షించేందుకు తెలుగుదేశం శ్రేణులు సిద్ధంగా లేవనిపిస్తోంది.

మరోవైపు మంత్రి లోకేష్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సైతం ఖండిస్తునే, ఆధారాలేకుండా పవన్ ఆరోణలు చేసినట్లు తేల్చి చెప్పారు. ఫాతిమా విద్యార్థులకు టీడీపీ న్యాయం చేయలేదనడం కరెక్ట్ కాదని, ప్రభుత్వం ఫాతిమా విద్యార్థులకు న్యాయం చేసేందుకు తమ మంత్రి ఢిల్లీ చుట్టూ తిరిగిన విషయాన్ని పవన్ ఎందుకు గుర్తించరని చెపుతూనే, ఇసుక, భూకబ్జాల మీద గతంలో తాను చేసిన ఆరోపణలపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. జాతీయ రాజకీయాల్లో శూన్యత ఏమీ లేదని విష్ణు కుమార్‌రాజు కొట్టిపారేయటం వెనుక పవన్ వెనుక తాము లేమన్నది నిరూపిం చుకోవాలన్న తపన కనిపించింది. బీజేపీ చేసిన పనులు చెప్పలేకపోయిందని, టీడీపీ తమను ప్రజల ముందు దోషిగా నిలబెట్టిందన్న ఆతని ఆవేదన గమనించదగ్గదే.

దేశంలో జరుగుతున్న అవినీతితో లెక్కిస్తే, అవినీతిలో రాష్ట్రం 20వ స్థానంకి దిగజారింది. ఈ విషయాన్ని మరోవైపు చంద్రబాబు సైతం పవన్ ఆరోపనలపై గుర్తు చేసారు. తన ప్రభుత్వంలో ఎవరైనా పైసా తీసుకున్నట్టు నిరూపిస్తే... వారిని జైల్లో పెట్టేందుకు సిద్ధమని చంద్రబాబు అనడం ప్రతిపక్షానికి సవాలు అనడంకంటే అవకాశం ఇవ్వడం అనడమే సబబు. కానీ ఆధారమే లేని తన ఆరోపణల మీద జగన్‌కానీ, ఇటు పవన్ కళ్యాణ్ కానీ ఎంతవరకు నిలబడతారన్నది ప్రశ్నార్థకం.

అయితే గతంలో పవన్ విసరిన సవాల్‌పై స్పందించిన వైసిపి కేంద్రంపై అవిశ్వాసానికి సిద్దమైంది. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు జగన్ బిజెపికి దగ్గర కావాలని అనుకుంటు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన స్థితిలో వైసిపి సభ్యుడు విజయసాయి రెడ్డి పిఎంవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని , ఓ వైపు ప్రధాని మోడీపై విశ్వాసం ప్రకటిస్తునే, మరోవైపు తనస్వలాభం కోసం బిజెపికి దగ్గర కావడానికి అవిశ్వాసాన్ని జగన్ వాడుకుంటున్నారనే అభిప్రాయం కలుగుతోందని తెలుగు దేశం చేస్తున్న ఆరోణలపై వైసిపి తగిన జవాబు ఇవ్వలేక పోతోంది.


దీనికి తోడు జగన్ అవిశ్వాసానికి మద్దతు సేకరిస్తానంటూ ప్రకటనలు చేసిన పవన్ కళ్యాణ్ నేరుగా వైసిపి ఎంపిలతో మాట్లాడిన తరువాతే వేదికపై తెలుగు దేశం పార్టీపై యుద్ధం ప్రకటించడంపైనా పలు అనుమానాలకు తావిస్తోందన్నది ఆ పార్టీ వర్గాల వాదన. ఇన్నాళ్లు తెలుగుదేశం మద్దతు తీసుకువస్తానని చెప్పిన పవన్ హఠాత్తుగా తన స్వరం మార్చేసారు. తెలుగుదేశం, వైసిపిలో ఎవరి వ్యూహాలు వారు అమలు పరుస్తూ రెండు అవిశ్వాస తీర్మానాలు ఇచ్చేందుకు సిద్ధం కావటంతో ఆ రెండు పార్టీలు కుమ్మక్కయిపోయాయని ఆరోపణల పరంపర ఆరంభించారు.

(రేపు తరువాయి)

జనసేనాని వ్యాఖ్యల వెనుక ప్రశ్నలు బోలెడు

జి. శ్రీనివాస్ – హైదరాబాద్

- ప్రజారాజ్యం మాజీ నేతలపై పవన్ కక్ష సాధింపులు
- తన వల్లే రాష్ట్రంలో టిడిపి గెలిచిందన్న భీషణలు
- ఆరోపణలు చేసినా నేటికీ చూపని ఆధారాలు
- హెూదా కోసం పోరాడే వారిపైనే అతని పోరాటాలు
- కులలకు అతీతమంటూనే చేస్తున్న కుల రాజకీయాలు



ఒక్కసారిగా తెలుగుదేశంపై పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలతో రాష్ట్ర రాజకీయాలు మలుపుతిరిగాయి. గత నెల రోజులుగా ప్రత్యేక హోదా, కేంద్రంతో తె.దే.పా మైత్రి మీదే నడిచిన చర్చంతా పవన్ సునామీతో పక్కదారి పట్టింది. నాలుగేళ్ళుగా చంద్రబాబుని ప్రశ్నించని పవన్ నేడు అన్ని ఆరోపణలు కలిపి ఒకేసారి చెయ్యడం ఆశ్చర్యకరమే. అదీ రాష్ట్రమంతా ప్రత్యేకహోదాపై మంచి కాక మీద ఉన్న తరుణంలో జనసేనానిచర్చను ఎందుకు పక్కదారి పట్టించారన్నదే ప్రశ్నార్థకం.ఇదే ఆయనపైన,ఆయన తీరు పైనా అనుమానాలు పెంచుతున్నాయి. గత ఎన్నికలలో తెలుగుదేశం తనవల్లే గెలిచిందన్న ఆలోచన జనసేనానిదైతే, గాలికి పోయే పేలపిండిని కృష్ణార్పణం అన్నట్లుగా అప్పటికే ఊవు మీదున్న తె.దే.పా కి ఎన్నికల ముందు హడావుడిగా పార్టీ పెట్టి మరీ మద్దతిచ్చి క్రెడిట్ కొట్టేసారన్నది తె.దే.పా వర్గాల్లోని కొందరి భావన. నిజానికి ఏదైనా సమస్య జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం,సమస్య పరిష్కారం దిశగా వెళ్తున్నవుడు రంగంలోకి దిగి ఆవేశపడటం పవన్‌కు మొదటి నుంచి అలవాటు. అలాగే ఎవరో చెప్పిన మాటలు వినటం, వాటిని లోతుగా పరిశీలించి నిజానిజాలు నిర్ధారించుకోకుండా వ్యాఖ్యలు చెయ్యటం కూడా ఆయనకున్న మరో అలవాటు. విభజన సమస్య రగులుతున్నంత కాలం కనీసం చిన్న ట్వీట్ అయినా చెయ్యని కాటమరాయుడు విభజన పూర్తయ్యాక రంగంలోకి దిగి కదం తొక్కాడు. విభజన చట్టం లోని సెక్షన్ 8, ఇతర్రతా అంశాల్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన సందర్భంలో సైతం ఆయన తెలంగాణకే మద్దతు పలకడం విశేషం. చట్టం అంటే పూర్తిగా చట్టమే అవుతుంది కానీ మనకి నచ్చిన అంశాలు అమలు చెయ్యమనటం, మిగతావి వద్దని అనటం ఏ మేరకు విజ్ఞతో ఆయనకే తెలియాలి. ఒకపక్క ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు కాంగ్రెస్‌ని సమూలంగా చట్టసభలకు దూరం చేసినా ఆ పార్టీకి చెందిన ఎం.పి అయిన కె.వి.పి పార్లమెంట్ లో గత నాలుగేళ్ళుగా రాష్ట్ర సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నారు. అయినా అదే పార్టీకి చెందిన మరో సభ్యుడు జనసేనాని అన్న అయిన చిరంజీవి ఏనాడు ఆయనకు కనీసం సహకారం అందించిన దాఖలా కూడా లేదు. అయినా పవన్ తన అన్నయ్యను ఒక్కసారి ప్రశ్నించిన పాపాన పోలేదు. ఆశ్రిత పక్షపాతాన్ని ఆయనే పాటిస్తూ ఎదుటివారికి నీతులు చెబితే ఎవరు మాత్రం వింటారు.

ఒక పక్క లోక్ సభలో ఆంధ్రకు మద్ధతిచ్చిన తెలంగాణ ఎం.పీ కవితను అభినందించిన జనసేనాని పార్లమెంట్ లో ప్రధానినే నిలదీసి అశేష ఆంధ్రుల మన్ననలు పొందిన గుంటూరు ఎం.పీ జయదేవ్ ని కనీసం ప్రశంసించకపోవటాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? మాట్లాడితే తనకు కులం, మతం లేదంటూనే ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ము కాస్తుందని వ్యాఖ్యానించటం ఏ మేరకు సమంజసం.ఆయనలో ఉండే సహజావేశం అలా మాట్లాడిస్తుందని ఇన్నాళ్లూ అనుకున్నారే కానీ ఆయనకు దురుద్దేశాలు ఉన్నాయని ఎవ్వరూ భావించలేదు.కానీ నేడు అయన మాటలు వింటుంటే ఆయన చేతలకి, చెప్పే అంశాలకి ఏమాత్రం పొత్తు కుదరటం లేదని అర్థమవుతుంది.తన కులం వారికి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో తీర్మానించిన 5శాతం రిజర్వేషన్ ని ఆవకాయ బద్దతో పోల్చిన ఆయనకు అసలు తన కులస్పృహ లేదని ఎలా అనుకోగలం. ఇక రెండు కులాల చేతుల్లో అధికారం అనటం ఏ మేరకు సమంజసమో ఆయనే ఆలోచించుకోవాలి. చిత్ర పరిశ్రమలో ఆయన కుటుంబానికి చెందిన వారే పదిమందికి పైగా హీరోలుగా ఉన్నప్పుడు ఆయన ఎప్పుడూ మన కుటుంబం వారేనా? వేరే వారికి అవకాశం ఇద్దాం అని అనుంటే కాస్త అర్థం ఉండేదేమో? ముఖ్యమంత్రి ఏ కులానికి చెందితే పాలన ఆ కులం వారిది, ఏ మతానికి చెందితే ఆ మతం వారిది అనటం పూర్తిగా భాధ్యతారహితమైన వ్యాఖ్యానం. ఇటువంటి వ్యాఖ్యలు సాదాసీదా రాజకీయ నాయకులు చెయ్యటం సాధారణమే అయినా ప్రజాకర్షణ ఉన్న పవన్ వంటి నేతల స్థాయికి సరిపడవు. దీనివల్ల ఆయనే ఒక కులానికి చెందిన నేతగా ముద్రపడే అవకాశం ఉంది. రాజధానికి ముప్పై వేల ఎకరాలు ఎందుకంటూ తాను మాత్రం రెండు ఎకరాల్లో ఇల్లు కట్టుకోవడం కూడా ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమే. ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడే ఒక్కసారిగా ప్రత్యేక హోదా కోసం ప్రాణత్యాగం చేస్తాననటం యువతను రెచ్చగొట్టడానికే అని అర్థమవుతుంది. ప్రత్యేక హోదా వచ్చేస్తే చాలు ఇప్పటికిప్పుడు ఆంధ్రప్రదేశ్ కి ఉన్న కష్టాలన్నీ తీరిపోతాయన్నట్లు ముఖ్యమంత్రితో సహా రాష్ట్రంలోని నేతలు అందరూ కలరింగ్ ఇవ్వటం వచ్చే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే కానీ మరేమీ కాదు. ఈ విషయం గబ్బర్ సింగ్ కి తెలియనిది కాదు. నేతల మాటలు విని యువత రెచ్చిపోతే నష్టపోయేది వారిని కన్న తల్లిదండ్రులే అన్న సంగతి సైతం అంతా గమనించాలి.తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగింది ఇదే. పైగా పవన్ కు మొదటి నుంచి టార్గెటెడ్ పాలిటిక్స్ చెయ్యటం అలవాటు. తన అన్నయ్యను విమర్శించారన్న కోపంతో రోజా,రాజశేఖర్ వంటి వారి పేర్లను తన సినిమాలలో కొన్ని సీన్లలో అవమానించి మానసిక ఆనందం పొందిన వింత మనస్తత్వం ఆయనది. పాతస్పర్ధలు మనస్సులో ఉంచుకుని కేశినేని నానిపై ఆయన ప్రదర్శించిన దుగ్ధను సైతం మర్చిపోలేం. ఒక్కసారిగా ఆయన తెలుగుదేశం పై విమర్శల జడివాన కురిపించిన తీరు సైతం పరకాల ప్రభాకర్‌ని అనుకరించినట్లుగా అనిపిస్తుంది.ఈ మధ్యే పరకాలపై పవన్ విమర్శలు గుప్పించిన అంశాన్ని గుర్తు చేసుకోవాలి. తన అన్నయ్య ప్రజారాజ్యంని దెబ్బతీసిన వారిపైనా పగ తీర్చుకుంటానని అప్పట్లో ఆయన వ్యాఖ్యాలు. ప్రస్తుత సంఘటనల్ని జాగ్రత్తగా గమనిస్తే పరకాల ఎలా అయితే తమ పార్టీని బ్లేం చేసారో అలాగే తాను కూడా ఎన్నికల ఏడాదిలో చంద్రబాబుని,లోకేష్‌ని బ్లేం చేసి ప్రజల్లో వారిద్దరిని పలచన చెయ్యాలనే ఆలోచనతోనే ఆయన ఈ నాలుగేళ్ళుగా ఎదురు చూస్తూ గడిపారని అర్థమవుతుంది. బహుశా చంద్రబాబు పరకాలకి మంచి పదవి ఇచ్చి గౌరవిం చటం ఆయనకు నచ్చలేదేమో? అయినా పగలు,ప్రతీకారాలు తీర్చుకోవడానికి పార్టీలు పెట్టడం ఏమిటో అర్థం కాదు. ప్రజాస్వామ్యవాదులకు మింగుడు పడని ఇటువంటి వ్యాఖ్యల వల్ల కొందరి నుంచి చప్పట్లు లభిస్తాయేమో కానీ ప్రజామోదం మాత్రం లభించదు.జనసేనాని ఇప్పటికైనా ఈ వాస్తవాన్ని గ్రహించి జాగ్రత్త పడటం మేలు.

ఆందోళనాంధ్రప్రదేశ్ పంచాంగం



ఆదాయం : అప్పు దొరికిన మేరకు
వ్యయం : అంతకు మించి,ఎన్నో రెట్లు
రాజపూజ్యం : బొత్తిగా పూజ్యం
అవమానం : కొలమానం లేదు,అనుమానం లేదు. ఘనం

ఈ విళంబి నామ సంవత్సరాన్ని కంగాళీ నామ సంవత్సరం అనుకున్నా పరవాలేదు ఆంధ్రప్రదేశ్ వరకూ.అంత ఆందోళనకరం.'చంద్ర' నిప్పులు,'వేడి' పవనాలు','వై'కో' పాలు, ఒకటేమిటి ఒకటే వేడి పెరిగి రాష్ట్రం రాజకీయ నిప్పుల కొలిమిలా మారుతుంది.అప్పుల కొలిమికి ఇదో అదనం.ఎన్నికల వేళా విశేషం.గ్రహాలన్నీ ఉత్సవ విగ్రహాల్లా మారి ఏమాత్రమూ అనుకూలించవు.ఏ గ్రహాలూ అనుకూలించని తీరు చూసి,నిగ్రహం కోల్పోయిన ప్రజలు ఆగ్రహమే అన్నిటికీ మందు అని భావిస్తారు.మన్మథ నామ సంవత్సరం మొదలైన హోదా అంశం విళంబిలోనూ హామీగానే ఉండి శాశ్వతత్వం పొందుతుంది.విభజన చట్టంలోని 19 హామీలపై 19 కమిటీలను వేసి అన్నీ అనవసరమే అని కేంద్రం తేల్చిపారేస్తుంది.మేమైతే అవన్నీ తీర్చి పారేస్తామని మరో జాతీయ కోయిల కొత్త పాట అందుకొంటుంది.వెరసి రాజకీయాలు తప్ప వేరే రోజువారీ అవసరాల చర్చలుండవు.అన్ని రాసుల వారూ చెవుల్లో క్యాబేజీలు ధరించాలి.రోజూ పెరిగే పెట్రోల్ ధరలకు అలవాటు పడ్డట్టు,కొత్త కొత్త హామీల్ని అలవాటు పడాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే ఈ సంవత్సరం రాష్ట్రానికి ఇతమిద్దంగా జరిగే మేలేమీ ఉండకపోవచ్చు.ఎన్నికల సీజన్ దాటే వరకూ ప్రజలంతా అన్ని బాధల్ని మరిపించే 'గజనీ'మంత్రం జపిస్తే చాలు.(అఫ్ కోర్స్. తరువాత నేతలు అదే మంత్రం జపిస్తారనుకోండి) శుభం భూయాత్.

–డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా
Editor, Surya, Surya Soudha, Plot.No.185,
MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i t p a g e

చరిత్రలో ఈరోజు

మార్చి 17

జననాలు
1887: డి.వి.గుండప్ప, ప్రముఖ కన్నడ కవి, పద్మభూషణ్ అవార్డ్ గ్రహీత
1892: రాయపలు సుబ్బారావు, ప్రముఖ తెలుగు కవి.
1896: మందుముల నరసింగరావు, నిజాం విమోచన పోరాటయోధుడు
1936: కోవెల సుప్రసన్నాచార్య, సుప్రసిద్ధ సాహితీ విమర్శకుడు, కవి.
1962: కల్పనా చావ్లా, వ్యోమనౌక యంత్ర నిపుణురాలు.
1963: రోజర్ హార్పర్, వెస్టిండీస్ మాజీ క్రికెట్ క్రీడాకారుడు.
1990: సైనా నెహ్వాల్, బ్యాడ్మింటన్ క్రిడాకారిణి.
మరణాలు
1961: నాళం కృష్ణారావు, సంఘ సంస్కర్త
1984: ఎక్కిరాల కృాఎష్ణమాచార్య, రచయిత.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయపలు సుబ్బారావు (మార్చి 17, 1892–జూన్ 30, 1984) తెలుగులోభావ కవిత్వానికి ఆద్యుడు. ఈయన 1913లో వ్రాసిన తృాఎణకంకణముతో తెలుగు కవిత్వములో నూతన శకము ఆరంభమైనదని అంటారు. ఇందులో ఈయన అమలిన శృంగార తత్వాన్ని ఆవిష్కరించాడు. ప్రేమ పెళ్ళికి దారి తీయని యువతీయువకులు స్నేహితులుగా మిగిలిపోవడానికి నిర్ణయించుకున్న ఇతివృత్తముతో ఖండకావ్య ప్రక్రియకు అంకురార్పణ చేశాడు. కళాకారుని ఊహలు, భావాలు, సృజనాత్మకతకు ప్రాధాన్యమిచ్చే కళారూపం భావుకత. పాశ్చాత్యదేశాలలో పరిమళించిన ఈ భావుకతను రాయపలు తెలుగులో విరజిమ్మాడు. సంస్కృత రచనలపై అతిగా ఆధారపడిన తెలుగు కవిత్వాన్ని స్వతంత్ర రచనలవైపు మళ్ళించాడు.

కల్పనా చావ్లా



కల్పనా చావ్లా (మార్చి 17, 1962 ఫిబ్రవరి 1, 2003), ఈమె ఒక ఇండియన్ –అమెరికన్ వ్యోమగామి మరియు వ్యోమనౌక యంత్ర నిపుణురాలు. 1994లో మొట్టమొదటిసారి కల్పనా చావ్లా పేరు ప్రపంచానికి తెలిసింది. ఎందుకంటే అప్పుడామెను నాసా వ్యోమగామిగా ఎంపిక చేసింది. కాని కొలంబియా స్పేస్ షటిల్ దుర్ఘటనలో ఆమె మరణించారు. న్యూయార్క్ సిటీ లోని క్వీన్స్ ప్రాంతంలో 74 జాక్సన్ హైట్స్ వీధిని ఇప్పుడు ఆమె గౌరవార్థమ్ 74వ కల్పనా చావ్లా వీధి మార్గం అనిపేరు పెట్టారు. 2004 సంవత్సరంలో అర్లింగ్టన్‌లో ఉన్న టెక్సాస్ విశ్వవిద్యాలయం (ఇక్కడ నుంచే చావ్లాకు 1984 లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీ ఇన్ ఎరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వచ్చింది) చావ్లా గౌరవార్థమ్ వసతి గృహాన్ని ఆమె పేరు మీద, 2004లో కల్పనా చావ్లా హాల్‌ను ఆరంభించారు.

ఎక్కిరాల కృష్ణమాచార్య



ఎక్కిరాల కృష్ణమాచార్య (ఆగష్టు 11, 1926–మార్చి 17, 1984) ఆంధ్రప్రదేశ్కు చెందిన రచయిత. ఆయన శిష్యులు ఆయనను మాస్టర్ ఇ. కె. అని పిలుచుకుంటుంటారు. ఈయన 1926, ఆగష్టు 11వ తేదీన ఆంధ్రప్రదేశ్కు చెందిన గుంటూరు జిల్లా, బాపట్లలో అనంతాచార్యులు మరియు బుచ్చమ్మ దంపతులకు జన్మించాడు. ఈయన తెలుగు, సంస్కృాఎత, ఆంగ్ల భాషలలో పాండిత్యాన్ని సాధించాడు. 'పాండురంగ మాహా త్మ్యం' కావ్యంపై పరిశోధన చేసి ఒక అద్భుతమైన గ్రంథాన్ని వెలయించి 'డాక్టరేట్' సాధించాడు. గుంటూరులోని హిందూ కళాశాలలోను, తరువాత ఆంధ్ర విశ్వకళాపరిషత్తులోను తెలుగు ఉపన్యాసకుడుగా పనిచేశాడు. వీరి రచనలలో 'రాసలీల', 'ఋతుగానం', 'గోదా వైభవం', 'అశ్వత్థామ సుభద్ర', 'అపాండవము', 'స్వయంవరము', 'పురాణ పురుషుడు', 'పురుష మేధము', 'లోకయాత్ర' లు మంచి ప్రచారం పొందాయి. జయదేవుని 'గీత గోవిందము'ను 'పీయూష లహరి' అనే పేరుతో అచార్య తెలుగులోకి అనువదించారు.



నెట్ బ్యాంకింగ్‌కు దూరంగా సైబర్ సెక్యూరిటీ చీఫ్


న్యూఢిల్లీ: డిజిటల్ లావాదేవీలను పెంచాలని మోదీ సర్కారు ప్రయత్నాలు చేస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం చీఫ్ గుల్షన్ రాయ్ నెట్ బ్యాంకింగ్ లావాదేవీలకు తాను దూరంగా ఉంటానంటూ చెప్పడం ఆశ్చర్యం కలిగించే అంశం. తాను నెట్ బ్యాంకింగ్ ను అరుదుగా వాడతానని, ఎందుకంటే దానివల్ల ఎదురయ్యే సమస్యలు ఏంటో తనకు తెలుసునని ఆయన చెప్పారు. తద్వారా ఆన్ లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తగా మసలుకోవాలని ఆయన పరోక్షంగా చెప్పారు. అక్కడ కొన్ని సమస్యలున్నాయి. ఈ కామర్స్ వేదికలపై నియంత్రణ ఎవరిది? వినియోగదారు ఫిర్యాదులను పరిష్కరించేది ఎలా? ఏటీఎంలు, క్రెడిట్ కార్డు మోసాలు చాలా సంక్లిష్టమైనవి. వాటిని పరిష్కరించడం ఒకింత కష్టం అని రాయ్ చెప్పారు. నాకు ఒక ప్రత్యేక ఖాతా ఉంది. అందులో కొంచెమే నగదు ఉంచుతాను. డెబిట్ కార్డుతో లావాదేవీలు చేయాలనుకుంటే ఆ ఖాతాలో రూ.25,000 మాత్రమే ఉంచి చేస్తాను. దాంతో జాతీయ వినియోగారుల సంస్థ వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదు అని ఆయన చెప్పారు. సైబర్ సెక్యూరిటీ విభాగాన్ని ప్రధానమంత్రి మోదీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసి దానికి తొలి బాస్ గా రాయ్ ను నియమించిన విషయం గమనార్హం.



15-3-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్		& నిఫ్టీ	
ఆరంభం	33,818.22	ఆరంభం	10,345.15
గరిష్ఠం	34,067.24	గరిష్ఠం	10,345.15
కనిష్ఠం	33,731.63	కనిష్ఠం	10,182.40
ముగింపు	**33,176.00**	ముగింపు	**10,195.15**
మార్పు (పా)	-509.54	మార్పు (పా)	-165.00
మార్పు (శా)	-1.51	మార్పు (శా)	-1.59

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,664.19	-163.98	-1.51
S&P BSE SENSEX Next 50	33,132.62	-258.22	-0.77
S&P BSE 100	10,579.91	-150.12	-1.40
S&P BSE Bharat 22 Index	3,481.73	-69.28	-1.95

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
JPASSOCIAT	20.90	+1.75	+9.14
SINTEX	20.30	+1.65	+8.85
MMTC	67.25	+5.15	+8.29
VAKRANGEE	248.15	+11.20	+4.73
ADANITRANS	190.20	+7.55	+4.13

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
KWALITY	90.90	-7.00	-7.15
NIITTECH	926.40	-61.75	-6.25
COX&KINGS	237.40	-14.65	-5.81
BBTC	1204.25	-71.15	-5.58
OBEROIRLTY	512.50	-29.45	-5.43

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
HEG	3144.65	96.16	306477
MAITHANALL	876.15	93.66	1046682
GHCL	277.15	84.01	3016308
LT	1267.60	79.00	619393
GODREJPROP	746.45	78.70	1046667


రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	**64.9875**	యూరో	**80.5845**
యన్	**60.9900**	పౌండ్	**90.8265**

సెంటిమెంట్‌పై అవిశ్వాస ప్రభావం

● టీడీపీ దెబ్బకు కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు ● భారీగా పతనమైన సెన్సెక్స్ ● ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన టీడీపీ ● అవిశ్వాస తీర్మానానికి వివిధ పార్టీల మద్దతు ● రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో కుప్పకూలిన మార్కెట్లు

ముంబై: దేశీయ రాజకీయాల సెగ స్టాక్‌మార్కెట్లను కూడా తాకింది. కూటమి నుంచి వైదొలిగిన అనంతరం ప్రభుత్వంపై తెదేపా అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చింది. దీంతో ఒక్కసారిగా దేశమంతా రాజకీయ వేడి మొదలైంది. కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ చేసిన తిరుగుబాటు భారతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎన్డీయేలో అతి పెద్ద భాగస్వామి అయిన టీడీపీ... ఆ కూటమి నుంచి బయటకు రావడం, అవిశ్వాస తీర్మానాన్ని పెట్టడం, వివిధ పక్షాలు సమర్థించడంతో... దేశవ్యాప్తంగా రాజకీయం వేడెక్కింది. ఈ రాజకీయ అనిశ్చితి ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ను దెబ్బతీసింది. దీంతో, పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున అమ్మకాలకు మొగ్గు చూపారు. ఈ క్రమంలో, ఇవాల్టి ట్రేడింగ్ ముగిసే సమయానికి... సెన్సెక్స్ ఏకంగా 510 పాయింట్లు పతనమై 33,176కు పడిపోయింది. నిఫ్టీ 165 పాయింట్లు కోల్పోయి 10,195కి దిగజారింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్‌గా జై ప్రకాశ్ అసోసియేట్స్ (9.14%), సింటెక్స్ ఇండస్ట్రీస్ (8.85%), ఎంఎంటీసీ లిమిటెడ్ (8.29%), వక్రాంగీ (4.73%), అదానీ ట్రాన్స్ మిషన్ (4.33%) తదితర కంపెనీలుండగా, క్వాలిటీ (-7.15%), ఎన్ఐఐటీ (-6.25%), గేట్ వే డిస్ట్రిపార్క్స్ (-5.84%), కాక్స్ అండ్ కింగ్స్ (-5.81%), బాంబే బుర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ (-5.58%) తదితర కంపెనీలు నష్టపోయాయి. అంతర్జాతీయ సంకేతాలు, చమురు, లోహ, ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో శుక్రవారం స్టాక్‌మార్కెట్లు నష్టాలతో ట్రేడింగ్‌ను ఆరంభించాయి. 137 పాయింట్ల నష్టంతో 33,548 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇక తెదేపా అవిశ్వాస తీర్మానంపై దేశీయంగా రాజకీయ వేడి రగులుకోవడంతో సూచీలు మరింత పతనమయ్యాయి. ఒక దశలో 550 పాయింట్లకు పైగా దిగజారిన సెన్సెక్స్ 33,120 పాయింట్ల కనిష్ఠస్థాయికి పడిపోయింది. చివరకు కాస్త కోలుకున్నా భారీ నష్టాలు తప్పలేదు. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 509 పాయింట్లు కోల్పోయి 33,176 వద్ద స్థిరపడింది.



అటు నిఫ్టీ కూడా నేడు భారీగా కుదేలైంది. 50 పాయింట్ల నష్టంతో 10,300 మార్క్ వద్ద ఊగిసలాడుతూ ప్రారంభమైన నిఫ్టీ మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో అంతకంతకూ పతనమైంది. ఒక సమయంలో 170 పాయింట్లకు పైగా నష్టంతో ట్రేడ్ అయిన సూచీ చివరకు 165 పాయింట్లు కోల్పోయి 10,195 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, టాటామోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్‌పెట్రోలియం, ఏషియన్ పెయింట్స్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఒక్కో కంపెనీ షేరు విలువ 3 నుంచి 4శాతానికి పైగా పతనమైంది. దాదావు అన్ని రంగాల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి.

ఇషా ఆలోచనతోనే జియో

● వెల్లడించిన రిలయన్స్ చైర్మన్ ముఖేష్ అంబానీ ● 2001లో వచ్చిన ఆలోచన ఇది ● 31 బిలియన్ డాలర్లు ఖర్చుచేశాం ● భవిష్యత్తు డిజిటల్ టెక్నాలజీదే

ముంబై: జియో..ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ మాటే వినిపిస్తోంది. జియో ప్రవేశపెట్టిన రెండేళ్లలోనే యావత్ ప్రపంచంలో అతిపెద్ద మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ డేటాగా ప్రసిద్ధి చెందింది. అయితే తన కూతురు ఇషా ఇచ్చిన ఐడియాతోనే జియోను ఏర్పాటు చేయగలిగానని అంటున్నారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ. రిలయన్స్ సంస్థ డ్రైవర్స్ ఆఫ్ ఛేంజ్ అవార్డు అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖేశ్ తన కుటుంబంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేశ్ మాట్లాడుతూ..2011లో జియో గురించి ఇషా తనకు చెప్పిందని తెలిపారు. జియో కోసం రిలయన్స్ భారతీయ మొబైల్ మార్కెట్‌లో 31 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు.

జియో ఐడియా నా కూతురు ఇషాది. 2011లో దీని గురించి ఇషా నాకు వివరించింది. ఆ సమయంలో ఇషా సెలవుల నిమిత్తం అమెరికా నుంచి భారత్ వచ్చింది. ఓ రోజు ఇంట్లో తన కోర్సుకు సంబంధించిన వర్క్ చేసుకుంటోంది.



అప్పుడు డాడీ మన ఇంట్లో నెట్ అస్సలు బాలేదు అంది. భవిష్యత్తులో ప్రపంచం డిజిటల్ టెక్నాలజీతోనే నడుస్తుందని ఇషా, ఆకాశ్ నాకు చెప్పారు. అలా వారి ఆలోచనల నుంచే ఈ జియో వచ్చింది. జియెను 2016 సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టాను. ఇప్పుడు భారతదేశంలో జియో గేమ్ ఛేంజర్‌గా మారింది. పాన్ ఇండియా 2జీ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేయడానికి భారతీయ టెలికాం రంగానికి 25 ఏళ్లు పట్టింది. కానీ 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్క్‌ను రూపొందించడానికి జియోకి కేవలం మూడేళ్లే పట్టింది. 5జీ కూడా సిద్ధమవుతోంది. అని చెప్పుకొచ్చారు ముఖేశ్ అంబానీ. 2016లో జియోను ప్రవేశపెట్టారు. ఉచితంగా సిమ్ కార్డులు ఇవ్వడంతో పాటు అతి తక్కువ ధరలకే ఉచిత కాల్ సేవలు, డేటా అందిస్తున్నారు. త్వరలో జియో కొత్త డేటా కనెక్ట్ ప్రక్రియను ప్రవేశపెట్టనున్నట్లు ముఖేశ్ తెలిపారు. దీని ద్వారా మన ఇంటికే కాకుండా, వివిధ వ్యాపారాలకు, కార్లకు నెట్ కనెక్షన్లు ఏర్పాటుచేసేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. భారతదేశంలోని ప్రతిభావంతులైన యువత ఉన్నారని వారితో 2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా తయారవుతుందని అభిప్రాయపడ్డారు.

శివ్‌నాడార్ వర్శిటీలో ఎంబీఏ ప్రవేశాలకు ఆహ్వానం

హైదరాబాద్: దేశంలోని ప్రైవేటు అగ్రగామి యూనివర్శిటీలలో ఒకటైన శివ్‌నాడార్ యూనివర్శిటీ ఎంబీఏ ప్రోగ్రాంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఐగ్లోబల్ ఎంబీఏ ప్రోగ్రాంతోపాటు అండర్ గ్రాడ్యుయేట్ ఎంబీఏ ప్రోగ్రాం, మేనేజిమెంట్ లో పీహెచ్‌డీ ప్రోగ్రాంలను అందిస్తున్నట్లు వర్శిటీ తెలిపింది. ఎంబీఏతోపాటు ఒక ఏడాది అడ్వాన్స్‌డ్ మేనేజిమెంట్ ప్రోగ్రాంను పార్ట్ టైమ్‌ప్రాతిపదికన అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ డాక్టర్ శుబ్రో సేన్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ వాతావరణానికి అనుకూలమైన రీతిలో రూపొందించిన కోర్సును అందిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో ఫెర్న్ అండ్ పెటల్స్ అవుట్‌లెట్



హైదరాబాద్: పూల బొకేలను ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ చేస్తున్న పెర్న్ అండ్ పెటల్స్ తన ఆరో అవుట్‌లెట్‌ను అత్తాపూర్ లో ప్రారంభించింది. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ రిటైల్ అండ్ ఫ్రాంచైజీ విభాగం వైస్ ప్రెసిడెంట్ అనిల్ శర్మ మాట్లాడుతూ 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో ప్రపంచవ్యాప్తంగా లభించే అన్ని రకాల పూలు లభ్యమవుతాయని, మరింత వేగవంతంగా డెలివరీ జరుగుతుందని తెలిపారు.

క్రీడాభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు అవసరం



న్యూఢిల్లీ: దేశంలో ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న యువతకు చేయూతను అందించాలని, తద్వారా ఈ క్రీడను అంతర్జాతీయ స్థాయికి తీసుకురావాలని హీరో మోటో కార్ప్ సీఈవో, ఎండీ, చైర్మన్ పవన్‌ముంజల్ పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఈ క్రీడకు భారత్‌లో ఆదరణ మరింతగా పెరుగుతున్నదన్నారు. అయితే దేశంలో ఫుట్‌బాల్ క్రీడను మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్లే గ్రౌండ్‌లాంటి ఇతర సదుపాయాలను మరింత మెరుగు పరచాలని అన్నారు. అలాగే ఈ క్రీడలో రాణిస్తున్నవారికోసం మరింత మెరుగైన స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుల అవసరం ఉందని పేర్కొన్నారు. దీనికితోడు ఈ క్రీడపై ఆసక్తికలిగిన యువను ప్రోత్సహించేందుకు తగిన శిక్షణను అందించాలని, అప్పుడే ఈ క్రీడ దిశగా యువత దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.

జీ చానళ్లలో ఉగాది వేడుకలు



హైదరాబాద్: తెలుగు లోగిళ్లలో ఉగాది పండుగకు ఉన్న ప్రత్యేకతే వేరు. ఎన్ని పండుగలు ఉన్నా తొలి పండుగ ఉగాదే. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సారి ఉగాది పండుగకు జీ కుటుంబం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో నంబర్‌వన్‌గా ఉన్న జీ తెలుగు ప్రక్షకులను మరింత రంజింపజేసేందుకు జీ కుటుంబ సభ్యుల తమ ఆటాపాటలతో మరింత ఆనందింపజేయనున్నారు. ఈ నెల 18న ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటలవరకూ ఈ వినోద కార్యక్రమం జీ తెలుగు, జీహెచ్‌డీ చానళ్లలో ప్రసారం కానుందని జీ తెలుగు తెలిపింది.

రూ.21 కోట్ల సమీకరణకు క్యాప్‌స్టన్ సన్నాహాలు

హైదరాబాద్: వినియోగదారులకు సెక్యూరిటీ అండ్ ఫెసిలిటీ మేనేజిమెంట్ సేవలను అందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన క్యాప్‌స్టన్ గురించి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కొడాలి తెలిపారు. క్యాప్‌స్టన్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపీవో) కింద ఎన్ఎస్ఈ స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎస్ఎంఈ) మాధ్యమంలో రూ. 21.19 కోట్లను సేకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఇష్యూ తర్వాత ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో షేర్లను లిస్ట్ చేయనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ వ్యాపార విస్తరణకు, రుణాలు తీర్చేందుకు, ఇతర నిర్వహణ కార్యకలాపాలకు వినియోగించనున్నారు. కాగా వినియోగదారులకు సెక్యూరిటీ సొల్యూషన్ అందిస్తూ వారికి క్యాప్‌స్టన్ ప్రశాంతమైన జీవితాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు. యుఎస్‌లో వినియోగదారుల అభిమానాన్ని క్యాప్‌స్టన్ ఇప్పటికే చూరగొంది. దశాబ్దకాలం నుంచి సేవలు అందిస్తున్న క్యాప్‌స్టన్ భారత్ లోని వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది.



కాగా క్యాప్‌స్టన్ 2015లో నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) భాగస్వామ్యంతో దేశంలోని యువతకు స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించింది. తాజా ఇష్యూ లో భాగంగా 23,04,000 ఈక్విటీ షేర్లను 10 రూపాయల ముఖ విలువతో ఒక్కో షేరును 92 రూపాయల ధరకు ఆఫర్ చేయాలని ప్రతిపాదించారు. ఆఫర్ ఫర్ సేల్, షేర్ల జారీ ద్వారా 26.5 శాతం వాటాను విక్రయించనున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె శ్రీకాంత్ తెలిపారు.

కనీస ఈపీఎస్ పింఛను రూ. 2,000

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ వో) నిర్వహిస్తున్న ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ పరిధిలో ఉన్న వారికి త్వరలో తీపి కబురు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం నెలవారీ కనీస పింఛను రూ.1,000 ఉంది. దీన్ని మోదీ సర్కారు రూ.2,000 చేయనుందని ప్రభుత్వ వర్గాల సమాచారం. దీనివల్ల 40 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వంపై ఏటా రూ.3,000 కోట్ల భారం పడుతుందని చెప్పారు. ప్రస్తుతం కనీసం రూ.1,000 పింఛను ఇవ్వడం వల్ల ఈపీఎఫ్ వో సంస్థకు ఏర్పడుతున్న లోటును కేంద్రం పూడుస్తోంది. పెన్షన్ ను రెట్టింపు చేస్తే మరింత అధికంగా నిధుల భారాన్ని మోయాల్సి వస్తుంది. వాస్తవానికి కనీస పింఛను ను రూ.3,000 నుంచి రూ.7,000 వరకు పెంచాలని కార్మిక సంఘాలు, పెన్షనర్ల సంఘాల నుంచి కేంద్రంపై ఒత్తిళ్లు ఉన్నాయి.

ఎయిరిండియా ట్విట్టర్ ఖాతా హ్యాక్: భారత విమానయాన సంస్థ ఎయిరిండియా అధికారిక ట్విటర్ ఖాతా హ్యాకింగ్ కు గురైంది. నిన్న కొన్ని గంటల పాటు ఎయిరిండియా ట్విట్టర్ ఖాతా పని చేయకుండా పోయింది. ఈ సమయంలో ఆ ట్విట్టర్ ఖాతాలో టర్కిష్ భాషలో చివరి నిమిషపు ముఖ్యమైన ప్రకటన.. మా అన్ని విమానాలు రద్దయ్యాయి. ఇక నుంచి మేము టర్కిష్ ఎయిర్ లైన్స్ లో ప్రయాణాలు కొనసాగిస్తాం అంటూ ఒక సందేశాన్ని పోస్టు చేశారని తెలిపారు.

సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా సంజయ్ సింగ్



హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) తెలంగాణ చైర్మన్‌గా సంజయ్ సింగ్ ఎంపికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా రాజు ఎన్నికయ్యారు. సింగ్ ఐటీసీ లిమిటెడ్‌లో ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ బిజినెస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాన్పూర్ ఐఐటీలో కెమికల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 1977లో ఐటీసీలో చేరారు. 1999 నుంచి ఐటీసీకి పూర్తిస్థాయి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా వైస్ చైర్మన్‌గా ఎంపికైన డి రాజు కిర్బీ బిల్డింగ్ సిస్టమ్స్ ఇండియాకు సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్నారు. ఉస్మానియా నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశారు.



సిఐఐ యంగ్ ఇండియన్స్ చైర్మన్‌గా నమన్ బల్వా



హైదరాబాద్: సీఐఐ యంగ్ ఇండియన్స్ హైదరాబాద్ చాప్టర్ 16 వార్షికోత్సవ వేడుకలను నిర్వహించింది. యంగ్ ఇండియన్స్(వైఐ) అనేది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ)లో భాగం. సమాజాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు చేపడుతుంటుంది. 2002లో వైఐ ప్రారంభమైంది. వైఐలోగల 40 చాప్టర్లలో మొత్తం2600 మంది మెంబర్లున్నారు. ఈ వార్షికోత్సవ సమావేశంలో నమన్ బల్వా చైర్మన్‌గా, ఆనంద్ దుర్గా కో చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా వైఐలో 21 నుంచి 40 సంవత్సరాల మధ్యవయసు కలిగిన పారిశ్రామికవేత్తలు భాగస్వాములుగా ఉంటారు. దేశాభివృద్ధిలో యువ భాగస్వామ్యానికి వీరు కృషి చేస్తుంటారు.

టీడీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, అన్నా డీఎంకే, వామపక్షాలు?

న్యూఢిల్లీ : ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, వైసీపీలు కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చాయి. ఈ తీర్మానాలకు ఇతర పార్టీల మద్దతును కూడగట్టేందుకు ఇరు పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో, తెలుగు దేశం పార్టీ ఇచ్చిన తీర్మానానికి కాంగ్రెస్, ఏఐఏడీఎంకే, వామపక్షాలు మద్దతు ప్రకటించినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. లోక్ సభలో కాంగ్రెస్ కు 48, అన్నా డీఎంకేకు 37 మంది ఎంపీలు ఉన్నారు. మరో వైపు శివసేన, టీఎంసీ కూడా తెలుగు దేశం పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతించిన మమత: కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాసానికి మద్దతు పెరుగుతోంది. అవిశ్వాస తీర్మానం పెట్టాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు. తీర్మానానికి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. మోడీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏక తాటిపైకి రావాలని ఆమె పిలు పు ఇచ్చారు. ఇప్పటికే పలు పార్టీలు టీడీపీ తీర్మానానికి మద్దతు పలికా యి. తరువాత తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని శివసేన ప్రకటించింది. అవిశ్వాస తీర్మానాల నేపథ్యంలో, జాతీయ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసిన కెప్టెన్



న్యూయార్క్ : అలాస్కా ఎయిర్‌లైన్స్ కెప్టెన్ తనకు మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశాడని కో పైలట్ బెట్టీ పినా సంచలన ఆరోపణలు చేసింది. విమానం డ్యూటీలు మారే నిమిత్తం తాము మిన్నెపోలిస్‌లో సేదదీరుతున్న వేళ ఈ ఘటన జరిగిందని చెబుతూ బాధితురాలు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల పాటు తామిద్దరమూ కలసి పని చేయాల్సి వచ్చిందని, తాను ఓ గ్లాస్ వైన్ తీసుకుని, రెండో గ్లాస్‌ను చేతికి తీసుకున్నట్టు మాత్రమే గుర్తుందని, ఆపై తెలివి వచ్చేసరికి బెడ్‌పై ఉన్నా నని, తన లో దుస్తులు తొలగించి ఉన్నాయని, బెడ్‌పై వాంతి చేసుకున్న స్థితిలో ఉన్నానని చెబుతూ, ఎయిర్‌లైన్స్‌కు, పైలట్‌కు వ్యతిరేకంగా ఓ కేసును దాఖలు చేసింది. జరిగిన ఘటనపై ఎయిర్‌లైన్స్ యాజమాన్యానికి తాను ఫిర్యాదు చేసి నా, చర్యలు తీసుకోకుండా అతన్ని కొనసాగిస్తున్నారని ఆరోపిం చింది. గతంలో సైన్యంలోనూ పని చేసిన పినా ఇటువంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయని ఆరోపించింది. ఇదే తొలి కేసు కాదని, ఇదే చివరి కేసు కూడా కాదన్న సంగతి తనకు తెలుసునని, బాధ్యత తీసుకోవాల్సిన యాజమా న్యాలు అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని 'సియాటెల్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వ్యాఖ్యానించింది. కాగా, పినా దాఖలు చేసిన లా సూట్‌పై ఇప్పుడు అమెరికాలో చర్చ జరుగుతోంది. పని చేసే చోట లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నాకు పట్టిన గతే నీ కుమార్తెకూ పడుతుంది

- ప్రొఫెసర్‌తో వేగలేక పారిపోయిన పీహెచ్డీ విద్యార్థిని లేఖ
- ఢిల్లీ జేఎన్యూలో ఘటన
- సభ్యత, సంస్కారం లేని ప్రొఫెసర్
- అమ్మాయిలతో ఎలా ఉండాలో తెలియదన్న విద్యార్థిని
- ఆరోపణలు అవాస్తవమన్న ప్రొఫెసర్



న్యూఢిల్లీ : ఓ ప్రొఫెసర్ వేధింపులకు తాళలేని పీహెచ్డీ విద్యార్థిని వర్శిటీ నుంచి పారిపోతూ, సదరు ప్రొఫెసర్ బండారాన్ని లేఖ రూపంలో బయటపెట్టిన ఘటన న్యూఢిల్లీలోని జేఎన్యూలో జరిగింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల యువతి జేఎన్యూలో ఇంటిగ్రేటెడ్ ఎంఫిల్, పీహెచ్డీ చేస్తూ ఇటీవల పారిపోయింది. ఈ విషయంపై పోలీసు కేసు కూడా నమోదైంది.

వర్శిటీ గైడ్‌గా ఉన్న ప్రొఫెసర్ ఏకే జోరి ప్రవర్తన కారణంగానే తాను వెళ్లిపోతున్నట్టు ఆ యువతి రాసిన లేఖ పోలీసులకు లభ్యమైంది. మీకు సభ్యత, సంస్కారం లేవని, అమ్మాయిలతో ఎలా ప్రవర్తించాలో తెలియదని, మీ కూతురికి ఇటువంటి పరిస్థితి రాకూడదని అనుకుంటున్నానని ఆ లేఖలో ఆమె వ్యాఖ్యానించింది.

ఎంతో గొప్ప మార్గనిర్దేశకుడిగా ఉంటారని తాను భావించానని, కానీ ఆ తరువాతే నిజ స్వరూపం తెలిసిందని పేర్కొన్నది. అమ్మాయిల బాధను అర్థం చేసుకోలేదని మండిపడింది. ఇక తనపై సదరు యువతి చేసిన ఆరోపణలను జోరి ఖండించారు. క్లాసులకు వరుసగా రాని తొమ్మిది మందిని తాను హెచ్చరించానని, వారు పీహెచ్డీ పూర్తి చేయడం కష్టమని చెప్పానని, అందరితో ప్రవర్తించినట్టే ఆమెతోనూ ప్రవర్తించానే తప్ప ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. ఆ అమ్మాయి ఆరోపణలు తనకు బాధను కలిగించాయని అన్నారు.

ఈ తొమ్మిది మసీదులను హిందువులకు అప్పగించండి.. అక్కడ నమాజ్ వద్దు



న్యూఢిల్లీ : మతపరమైన వివాదాస్పద ప్రాంతాల్లో ముస్లింలు నమాజ్ చేయకుండా ఆపాలని అఖిల భారతీయ ముస్లిం పర్సనల్ లా బోర్డుకు యూపీ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డ్ చీఫ్ వసీం రిజ్వీ సూచించారు. ఈ మేరకు పర్సనల్ లా బోర్డు చైర్మన్ మౌలానా రబీ హసన్ నద్వీకి లేఖ రాశారు. దేశంలో మొత్తం తొమ్మిది వివాదాస్పద ప్రాంతాలు ఉన్నాయని, వాటిలో నాలుగు యూపీలో, రెండు గుజరాత్‌లో, ఢిల్లీ, మధ్య ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ఒక్కోటి ఉన్నా యని లేఖలో పేర్కొన్నారు. ఇవన్నీ వివాదాస్పద స్థలాలు కావడం వల్ల ఇక్కడ ముస్లింలు నమాజ్ చేయకుండా నియంత్రించాలని కోరారు. హిందూ ఆలయాలకు సంబంధించిన ఈ స్థలాల్లో ముస్లిం రాజులు బలవంతంగా మసీదులను నిర్మించారనే బలమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇతర మతాలకు చెందిన స్థలాలను ఆక్రమించుకోవడం, నాశనం చేయడం, అక్కడ మసీదులను నిర్మించడం వంటి వాటిని ఇస్లామిక్ చట్టాలు అనుమతిం చవని రిజ్వీ తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లో చేసే ప్రార్థనలను ఖురాన్, షరియా అంగీకరించవని చెప్పారు. అయోధ్యలోని రామమందిర ప్రాంతాన్ని హిందువు లకు అప్పగించాలని గతంలోనే రిజ్వీ కోరిన సంగతి తెలిసిందే. అయోధ్య సహా వివాదాస్పదమైన ఈ తొమ్మిది స్థలాలను హిందువులకు అప్పజెప్పాలని తాజా లేఖలో ఆయన కోరారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఏక్కడ అక్రమ మైనింగ్ జరిగినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారుల ను మైనింగ్, ఐటి, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశిం చారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను సహించేది లేదని, ఏంతటి వారైనా ఒత్తిడి గురికా వద్దని మంత్రి అధికారులకు తెలిపారు. శుక్రవారం నాడు గనుల శాఖపైన సుదీర్ఘ సమీక్ష సమావేశాన్ని మంత్రి కెటి రామారావు నిర్వహించారు. ఈ సందర్భంగా మం త్రి అధికారులకు పలు అదేశాలుజారీ చేశారు. గత సంవత్సకాలంలో గనుల శాఖలో అనేక కట్లుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు మంత్రికి అధికారులు తెలియజేశారు. వరంగల్ , హైదరా బాద్, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో 354 తనీఖీలు నిర్వహించామని, 79 ఉల్లంఘనలు గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటు న్నామని అధికారులు తెలిపారు. దీంతోపాటు రాష్ట్రంలో గనులు లీజు తీసుకుని కార్యకలాపాలు నిర్వహించని 477 లీజులను రద్దు చేశామన్నారు. గనుల శాఖలో సాంకేతిక పరిజానాన్ని విస్తృతంగా వినియోగించు కోవాలన్నారు. ముఖ్యంగా గనుల పర్యవేక్షణలో జియోఫెన్సింగ్, జీయో ట్యాగింగ్, ఉపగ్రహ చిత్రాల ఉపయోగం, డ్రోన్ల వినయోగాన్ని ఉపయోగించుకో వాలన్నారు. త్వరలో తీసుకురానున్న మైనింగ్ పాలసీలో దేశంలోని అత్యుత్తమ విధానాలను చేకూర్చాలన్నారు. ఈ పాలసీని చట్టరూపంలో తీసుకువస్తా మన్నారు. ఈ ఆక్షన్ ద్వారానే గనుల, ఇసుక రీచుల లీజులు జరగాలని, ఇందు కోసం అవసరం అయిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం లోని సున్నపు రాయి గనుల లీజుపైన మంత్రి చర్చించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరతామన్నారు. టియస్ యండిసి సైతం రాక్ సాండ్ క్రషర్ల ఏర్పాటును పరిశీలించాలని అదేశించారు. పలు జిల్లాల్లో చేపట్టిన సాండ్ టాక్సీ విధానం విజయం వంతం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్దంగా ఉండాలన్నారు. ఒక్క ఫోన్ కాల్ తో రాష్ట్రంలోని ఏవరికైనా ఇసుక ఏ ధరతో లభిస్తుందో తెలిసేలా విధానం ఉండాలన్నారు.

భారీగా ఆదాయం: ఈ అర్థిక సంవత్సరానికిగాను గనుల శాఖ ఆదాయం లక్ష్యాన్ని సాధించినట్లు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరానికి గాను నిర్ధేశిత 3166 కోట్ల రూపాయాల లక్ష్యానికి గాను మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా ఫిబ్రవరి నెఖరుకు సూమారు మూడు వేల 500 వందల కోట్ల రూపాయాల(110శాతం) అదాయం ప్రభుత్వానికి వచ్చింది.

ముఖ్యంగా ఇసుక అధాయ లక్ష్యం 388కోట్లకు గాను 538 కోట్ల ఆదాయం (139శాతం) ఖజనాకు లభించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కపాదం మోపడంతో ఇంత పెద్ద ఎత్తున ప్రజల సంపధ ప్రభుత్వానికి చేరిందన్నారు. ఖనిజాల అధాయం ప్రజల ఆస్థి అని, అది వారి అభివృద్ధికే ఉపయోగపడాల న్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

అందుకే మైనింగ్ అదాయంలోని లీకేజీలను సాద్యమైనంత ఎక్కవగా అరికట్టామని తెలిపారు.

బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పైన మంత్రి సమావేశంలో అధికారులతో చర్చించారు. సమావేశానికి హజరైన యంంన్ యండిసి డైరెక్టర్ మరియు ప్రతినిధులతో ఇనుప ఖనిజం కేటాయింపులపై చర్చించారు.

ఇప్పటికే పల సార్లు కేంద్రాన్ని కోరినా బయ్యారంపైన ఏలాంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పైన త్వరలోనే కేంద్ర గనుల శాఖ, స్టీల్ శాఖ మంత్రులను కలుస్తామన్నారు. గనుల శాఖ డైరెక్టర్ సుశీల్ కూమార్, టియస్ యండిసి యండి మల్సూర్, గనుల శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

దలేర్ మెహందీ దోషి



చండీగఢ్ : ప్రముఖ పంజాబీ పాప్ సింగర్ దలేర్ మెహందీని పటియాలా న్యాయస్థానం దోషిగా తేల్చింది. దాని వివరాల్లోకి వెళితే, 2003లో దలేర్ మెహందీ తన మ్యూజికల్ ట్రూప్‌తో విదేశాల్లో కచేరీలు చేసేందుకు వెళ్లేవాడు. ఈ క్రమంలో యుఎస్, కెనడాతో పాటు మరికొన్ని దేశాలకు కొందరితో ఒప్పందం చేసుకుని, వారిని ట్రూప్‌లో సభ్యులుగా పేర్కొంటూ, అక్రమంగా మనుషులను తీసుకువెళ్లేవాడు. ఇటువంటి 31 కేసులు దలేర్‌పై నమోదు కావడంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టారు. అనంతరం బెయిల పై దలేర్, ఆయన సోదరుడు షంషేర్ విడుదలయ్యారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం దలేర్, షంషేర్‌లను దోషులుగా నిర్ధారించింది. దీనితో వారిద్దరూ న్యాయస్థానం కస్టడీలో ఉన్నారు. వారికి శిక్ష ఖరారు చేయాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి


అవిశ్వాసంపై చర్చకు అవకాశమెక్కడ?



తోట నరసింహం నోటీసులు ఇచ్చా రని, వాటిని తాను స్వీకరించానని చెప్పిన సుమిత్రా మహాజన్ గత్యంతరం లేని పరిస్థితుల్లోనే సోమవా రానికి సభను వాయిదా వేయాల్సి ఉంటుందని అన్నారు. సభ సజావుగా ఉంటేనే అవిశ్వాస తీర్మానాలను పరిగణనలోకి తీసుకుంటానని హెచ్చరిం చిన ఆమె సభ్యు లు ఎంతకూ సర్దుకోకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం కూడా పార్లమెంట్ సమావేశాలు ప్రతిపక్షాల ఎంపీల నినాదాలతో, ఆందోళనలతో అట్టుడికాయి. వివిధ పార్టీలకు చెందిన నేతలు వివిధ సమస్యలపై లోక్ సభను అడ్డుకున్నారు. స్పీకర్ పోడి యంలోకి వెళ్లి ప్లకార్డులు పట్టుకుని, నిరసన వ్యక్తం చేశా రు. ఏపీ ఎంపీలు అంతా ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయగా, టీఆర్ఎస్ ఎంపీలు రిజర్వేషన్ల అంశంపై పోరా టం చేశారు. ఈ నేపథ్యంలో, పశ్నోత్తరాల కార్య క్రమం ఏమాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. సభను సజావుగా కొనసాగించేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పలుమార్లు విన్నవించినప్పటికీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. చివరకు విధిలేని పరిస్థి తుల్లో సభను వాయిదా వేశారు. సభను కొనసాగించలేని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో లోక్ సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

మోడీ మహాకుట్ర



రాజకీయాల్లో శూన్యత ఉందని చెప్పలేనని, రెండు పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీలే ఉండకూడదనే ప్రయత్నం మంచిది కాదని చంద్రబాబు హితవుపలికారు. బీజేపీ ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్ల లోనూ రాష్ట్రానికి అన్యాయం చేసిం దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో ఉండబోదని తెలుగుదేశం పార్టీ నిర్ణయించిందని, ఇంతటి కఠిన నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో వారు ఆత్మవిమర్శ చేసు కోవాల న్నారు. రాష్ట్ర ప్రయో జనాల విషయం లో రాజీపడే ప్రసక్తే లేదు. ఆంధ్రప్రదేశ్ కష్టాలను కేంద్రం ఏనా దూ పట్టించు కోలేదు. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు అన్ని హామీలు నెరవేరుస్తామని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన బీజేపీ అధికారంలోకి రాగానే మరిచిపోయిందని, సెంటిమెంట్‌తో నిధులు రావని జైట్లీ ఎలా చెబుతారని చంద్రబాబు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సెంటిమెంట్ ద్వారానే ఇచ్చిన సంగతి ఆయనకు తెలీదా? విభజన చట్టంలో ఉండే హామీలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలు మాత్రమే నెరవేర్చాలని కేంద్రాన్ని కోరుతున్నా నన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోమని అడిగితే రక్షణ శాఖ బడ్జెట్ ప్రస్తావన ఎందుకు తెస్తారు. దేశ రక్షణను పణంగా పెట్టి మమ్మల్ని ఆదుకోమని మేం అడిగామా? మాకు దేశభక్తి లేదా? పార్లమెంటులో మా పార్టీ ఎంపీలు ఆందోళన చేస్తుంటే కనీసం మాట్లాడదాం రండి అని ప్రధానమంత్రి పిలువలేక పోయారు? టీడీపీ విలువలు కలిగిన పార్టీ కాబట్టే ఎన్డీయే కూటమి నుంచి వైదొలగిన తర్వాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామన్నారు. కేంద్రానికి మద్దతు ఇచ్చినా కేంద్ర మంత్రి పదవులు కోరుకోలేదని, వాళ్లు ఇస్తామంటేనే రెండు మంత్రి పదవులు తీసుకున్నామని, పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఇవ్వవద్దని సూచించిందని గతంలో చెప్పారని, నిన్న రాజ్యసభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ అలాంటిదేమీ లేదని చెప్పారని, దీన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయం పరంగా అట్టడుగున ఉన్నామని, మమ్మల్ని ఆదుకోవాల్సిన అవసరం కేంద్రానికి లేదా? ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు పరిశ్రమలు ఇచ్చారు. అలాంటి పరిశ్రమలు మాకూ కావాలని అడుతున్నాం. ఎన్నికలకు ముందు మోడీ ఏపీ పట్ల ఎంతో సానుభూతి చూపించారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టిస్తామన్నారు. ఆ హామీలన్నీ ఏమైపోయాయి. అమరావతి నగరం దేశానికే తలమానికం అవుతుంది. అలాంటి నగరాన్ని నిర్మించేందుకు కేంద్రం ఎందుకు సహకరించడం లేదని చంద్రబాబు ప్రశ్నించారు. రైల్వేజోన్ విషయంలో కేంద్రం దాటవేత ధోరణి అవలంభిస్తోందని, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలోనే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు రైల్వేజోన్ ఇచ్చినప్పుడు మమ్మల్ని అడిగారా? పోలవరం రాష్ట్రానికి జీవనాడి. అది పూర్తయితే రాష్ట్రంలో కరువు ఉండదు. ఆ ప్రాజెక్టుకు అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. పోలవరంలో అవినీతి జరుగుతోందని దుష్ప్రచారం చేస్తున్నారు. పోలవరంపై పవన్ కల్యాణ్ అవగాహన ఉండే మాట్లాడుతున్నారా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తీసుకున్న నిర్ణయాలపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని చంద్రబాబు అన్నారు.


ఎన్నికల తర్వాత వైసీపీకి పవన్ మద్దతు...

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సీఎం చంద్రబాబు విమర్శలవర్షం గుప్పించారు. ఎన్నికల తర్వాత పవన్ వైసీపీకి మద్దతిస్తారని తెలిసిందని, ఈ విషయం వైసీపీ ఎంపీ ఒకరు చెప్పారని సీఎం తెలిపారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై, మోదీపై పోరాడుతోంటే తనపై విమర్శలు చేస్తారా ? నేను భయపడుతున్నానని అంటారా ? కానీ మోడీపై పవన్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్రంలో అలజడి సృష్టించి కేంద్రానికి వెసులుబాటు కల్పిస్తారా? తన పార్టీ బహిరంగ సభలో కేంద్రం గురించి మాట్లాడకుండా నాపై విమర్శలు చేస్తే ఏం లాభం. మరొకాయన పాదయాత్ర చేస్తూ నిరంతరం నన్నే విమర్శిస్తున్నారు. ప్రత్యేక హోదా కేంద్రం ఇవ్వకుంటే నన్ను విమర్శిస్తారా ? పవన్ ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తే మేం హోదా ఇస్తామని బీజేపీ నేతలే అంటున్నారు. పవన్ మాత్రం ఢిల్లీకి వెళ్లను. ఇక్కడే పోరాడుతానని అంటున్నారు. ఇదేమి రాజకీయం. రాష్ట్రానికి అన్యాయం జరగడానికి కారణం ప్రధాని నరేంద్ర మోడీనే అని అందరూ అంటున్నారు. నేను భయపడేది ప్రజలకే కానీ వేరెవరికీ కాదు. నాపై ఏం కేసులున్నాయని నేను భయపడడానికి. నేను కేంద్రంపై పోరాడుతోంటే బీజేపీ వాళ్లు రాయలసీమ డిక్లరేషన్ ఇస్తారా? ఇది చిచ్చు పెట్టడం కాదా ? నేను రాయలసీమ బిడ్డనే. నాకంటే బీజేపీ వాళ్లకు రాయలసీమపై ప్రేమ ఉంటుందా ? రాయలసీమపై ప్రేమ ఉంటే కర్నూలులో సుప్రీం కోర్టు బెంచ్ పెట్టండి. లేదా అమరావతిని దేశ రెండో రాజధానిని చేయండని చంద్రబాబు నిప్పులు చెరిగారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం



ముఖ్యం అని వైఎస్ జగన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, ప్రజల ప్రయోజనాలే వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి అత్యంత ముఖ్యం. అన్ని రాజకీయ పార్టీలకు ఈ అంశం అతీతం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా ఎవరిది పరిగణలోకి తీసుకుంటారనేది అంత ముఖ్యమైన అంశంకాదు. ఆంధ్ర ప్రదేశ్ పౌరుల హక్కులకు హామీ దొరికిం దా రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చిందా అన్నదే ముఖ్యం' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ఏపీ ప్రత్యేక హోదా కోసం ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం తీర్మానంపై నోటీసులు ఇవ్వగా దానిపై సోమవారం చర్చిస్తామని లోక్‌సభ స్పీకర్ చెప్పిన విషయం తెలిసిందే. దీంతో మరోసారి అవిశ్వాస తీర్మానంపై నోటీసులు ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అదే సమయంలో టీడీపీ పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తామని కూడా స్పష్టం చేసింది.



ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అందుకే తెలుగుదేశం పార్టీ కేంద్రంపై ప్రత్యేకంగా అవిశ్వాస నోటీసు ఇస్తుందని తెలిపారు. వైసీపీ నోటీసుపై ఐదుగురు ఎంపీలే సంతకాలు చేయగా, తెలుగుదేశం నోటీసుపై 16మంది సంతకాలు ఉంటాయని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ఇతర పార్టీలు కూడా సానుభూతిగా ఉన్నాయన్న ఆయన వాటి మద్దతు తీసుకుంటామని చెప్పారు. ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని, రాష్ట్రానికి న్యాయం చేయాలన్నదే తమ డిమాండ్ అని సీఎం స్పష్టం చేశారు.

ఆర్థిక నేరస్తులకు పీఎంవోలో ఏం పని?...

ఆ రోజు టీడీపీని దెబ్బతీయడానికి కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించిందని, నేడు అదే ఉద్దేశంతో బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. జగన్, పవన్‌తో కేంద్రం రోజుకో డ్రామా ఆడిస్తోందని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా మహాకుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు.

ఎన్డీయేకు టిడిపి టాటా

దోషులను వదిలిపెట్టేది లేదని, వారిని ప్రజాకోర్టులో నిలబెడతామని నేతలతో చంద్రబాబు అన్నారు. అవిశ్వాసం పెట్టి రాజీనామాలు చేయించి పవన్ జగన్‌ల ద్వారానే హోదా వచ్చేలా చేస్తామని బీజేపీ సరికొత్త డ్రామాకు తెరలేపిందని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ డ్రామాలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్న ఆయన తగిన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. వైసీపీకి సహకరిస్తానని పవన్ చెప్పినట్లు తిరుపతి ఎంపీ వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలను సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు. కుట్రకు ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. పీఎంవో చుట్టూ విజయసాయి రెడ్డి ప్రదక్షిణలే కుట్రలకు రుజువులని పేర్కొన్నారు. పీఎంవో పవిత్ర కార్యాలయమని, అక్కడ ఏ1, ఏ2 నిందితులకు పనేమిటని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని కార్యాలయం చుట్టూ ప్రధాన నిందితుల ప్రదక్షిణలు చేయడం ద్వారా ఏం సంకేతాలు పంపుతున్నారని నిలదీశారు. ఏదైనా విషయాలు ముందుగా మిత్రపక్షాలకు తెలుస్తాయని, అలాంటిది కేంద్రంలో అన్ని అంశాలు వైకాపాకే ముందు ఎలా తెలుస్తున్నాయని ప్రశ్నించారు. రాజీనామాలపై సభలో ప్రకటనలు చేయడానికి తమ సభ్యులకు అవకాశాం ఇవ్వారా? అని ఆక్షేపించారు. నీరవ్ మోదీ లాంటి నిందితులు దేశం దాటిపోతున్నారని, విజయసాయి రెడ్డిలాంటి వాళ్లు పీఎంవోలో తిరుగుతున్నారని, వీటిద్వారా ఏ సంకేతాలు ప్రజల్లోకి పంపుతున్నారని కేంద్రాన్ని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు.


పవన్ ఆ ఆరోపణల్ని నిరూపించగలరా?...

గుంటూరులో ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ సభలో మంత్రి నారా లోకేశ్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అవినీతి ఆరోపణలు అర్థరహితమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆ ఆరోపణలు చేసేవాళ్లు వాటిని నిరూపించగలరా? అని ప్రశ్నించారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. డబ్బే కావాలనుకుంటే లోకేశ్ హెరిటేజ్ చూసుకుంటే సరిపోతుందని, వ్యాపారాలతో ఏడాదికి రూ.65 కోట్లు మిగిలేదన్నారు. ప్రజాసేవ కోసమే లోకేశ్ రాజకీయాల్లోకి వచ్చారని సీఎం స్పష్టంచేశారు. లోకేశ్‌ను చిన్నప్పుడు తాను అర్ధరాత్రి తర్వాతే చూసేవాడినని, ఇప్పుడు దేవాన్ష్‌ను వారానికి ఒక్కరోజు మాత్రమే చూసుకునే పరిస్థితి లోకేశ్‌దని చంద్రబాబు చెప్పారు.

మధ్యవర్తులుగా ఉంటామనడానికి వీళ్లెవరు: విభజన హామీల్లో భాగంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల లెక్కలను పరిశీలించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన జేఎఫ్‌సీపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఆ కమిటీనే ఓ తప్పన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు అడగకుండా మధ్యవర్తులుగా ఉంటామనడానికి వీరెవరని సీఎం ప్రశ్నించారు. ఎన్డీయేలో ఉన్నంత వరకు ఇతర పార్టీలతో మాట్లాడేందుకు తమకు ఇబ్బందులు ఉండేవని, ఇక తనకు ఏ మొహమాటాలూ లేవన్నారు. అన్ని జాతీయ పార్టీలను కలుపుకుని వెళ్తానని సీఎం స్పష్టంచేశారు.

అందుకే ఎన్డీయే నుంచి బయటకు: రాష్ట్ర ప్రయోజనాలే తన లక్ష్యమని చంద్రబాబు మరోసారి స్పష్టంచేశారు. ప్రాంతీయ పార్టీలు ఉండకూడదనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చని కేంద్రంపై అవిశ్వాసం ఎన్డీయేలో ఉండి పెట్టడం అనైతికత కాబట్టే, దాన్నుంచి వెంటనే బయటకు వచ్చి పెట్టామని సీఎం వివరించారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల కోసం రెండు నెలల నుంచి వైకాపా అవిశ్వాసం అంటున్నా ఏ ఒక్క పార్టీ ముందుకు రాలేదని చంద్రబాబు అన్నారు. పీఎంవో చుట్టూ చక్కర్లు కొట్టే అవిశ్వాసాన్ని ఎవరూ నమ్మలేదన్నారు. తాను ఏ పార్టీలతో మాట్లాడకపోయినా టీడీపీ అవిశ్వాసం పెట్టగానే అనేక పార్టీలు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. అది జాతీయ పార్టీలకు టీడీపీ పట్ల ఉన్న విశ్వసనీయత అని చంద్రబాబు అన్నారు.

ఎవరికీ భయపడను



ప్రాణాలైనా అర్పిస్తామని తెలిపారు. ప్రత్యేకహోదా కోసం ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాట పూటకో మాట మార్చే వైఖరి సరికాదన్నారు. ప్రత్యేక హోదా గురించి ఆ రోజు పార్లమెంట్‌లో అడిగిన వారికి హోదాలు పెరిగాయే తప్ప రాష్ట్రానికి మాత్రం ప్రత్యేక హోదా రాలేదని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్నటివరకు జగన్ నన్ను టీడీపీ మనిషి అన్నారు. ఇప్పుడేమో టీడీపీ నేతలు నన్ను జగన్ మనిషి అని అంటున్నారు. నేనెవరి మనిషినీ కాదు. నేను ప్రజల మనిషిని అని పవన్ కల్యాణ్ అన్నారు.

పొట్టి శ్రీరాములుకు పవన్ నివాళి : మహాత్ముడు బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన వ్యక్తి పొట్టిశ్రీరాములు అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన నాంది పలికారని కొనియాడారు. అనంతరం తనను చూడటానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేశారు.



బిజేపీ ఎదుగుదలను చూసి ఈర్ష్యతో అవిశ్వాసం

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎదుగుదలను చూసి ఈర్ష చెంది, రాజకీయంగా ఎదుర్కోలేని తెలుగుదేశం, వైఎస్ఆర్ సీపీ పార్టీలు కేంద్రంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్‌నాయుడు ఆరోపించారు. రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార తెలుగుదేశంపార్టీ నాలుగేళ్ల పాలనలో అవినీతికి పాల్పడి ప్రజాగ్రహానికి గురైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడని వైఎస్ఆర్‌సీపీ ప్రతిపక్ష ప్రాను కోల్పోయిందన్నారు. ఈ రెండు పార్టీలు అవినీతికి పాల్పడి ప్రజలను వంచిస్తున్నాయన్నారు. పట్టిసీమ, వురుషోత్తమపట్నం ప్రాజెక్టులను చేపట్టిన మెగా కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టరు కృష్ణారెడ్డి వైఎస్ఆర్‌సీపీకి రూ.200 కోట్లు, తెలుగుదేశం పార్టీకి రూ. 450 కోట్లు ముడువులు ఇవ్వడంతోపాటు వారి మధ్య అంతర్లీనంగా సయోధ్యను కుదిర్చారని ఆరోపించారు. ప్రజల మద్దతును కోల్పోయిన ఈ రెండు పార్టీలు వారి దృష్టి మరల్చేందుకు రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టాయని విమర్శించారు. పవన్‌కల్యాణ్‌కు గతంలో ఎన్‌టీఆర్ భవన్ నుంచి స్క్రిప్టు వచ్చేదని, ఇప్పుడు బసవపున్నయ్య భవన్ నుంచి స్క్రిప్ట వస్తుందని ఎద్దేవా చేశారు. దాని ఆధారంగానే ఆయన చేసిన ఆరోపణలకు టీడీపీ సమాధానం చెప్ప లేక విలవిలలాడుతోందని విమర్శించారు.

చంద్రబాబు నాయుడు, బిజెపితో కలసి పొత్తు పెట్టుకున్న మొదటి రోజు నుంచి తమ పార్టీని, ప్రజల్ని మోసం చేశారన్నారు. విపక్షాలు చేసే కువిమర్శలు, బ్లాక్ మెయిల్ రాజకీయాలను మోదీ, బిజేపీ తలవంచదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిక్కాల రజనీకాంత్, పిట్టల గోవింద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోను ఆధార్

- ప్రతి అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు
- సీడీపీవోలకు ఏజెన్సీ బాధ్యతలు
- పథకాల అమలులో పారదర్శకత
- తప్పనున్న గ్రామీణుల ఇబ్బందులు

(కరీంనగర్-సూర్యప్రతినిధి) : ప్రభుత్వం ఇక నుంచి ఆధార్ నమోదును అంగన్‌వాడి కేంద్రాలకు అప్పగించనుంది. దీంతో ఆధార్‌నమోదు పక్రియ సులభతరం కానుంది. ఇకపై ప్రధాన అంగన్‌వాడి కేంద్రాలన్ని ఆధార్ కేంద్రాలుగా మారనున్నాయి. ప్రస్తుతం మీ సేవ కేంద్రాలు, పోస్టాఫీసుల్లో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలో శాశ్వత ప్రత్యేక కౌంటర్‌లలో మాత్రమే ఆధార్‌కార్డులు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామ స్థాయిలో ఈ కేంద్రాలు లేక పోవడంతో ప్రజలంతా మండల కేంద్రాలు, సమీపంలోని పట్టణాలకు వెళ్లి ఆధార్ నమోదు చేయించుకోవాల్సి వస్తోంది. అంతేగాక చంటి పిల్లల ఆధార్‌నమోదు తల్లితండ్రులకు ఇబ్బందికరంగా మారుతుంది.

మరోవైపు ఆధార్‌నమోదు కోసం రుసుం, రవాణా చార్జీలు, సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకే ఆధార్ నమోదు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు ఆధార్ రిజిస్ట్రేషన్ అధికారాలు ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో ఉన్న ఐసిడిఎస్‌లను ఆధార్ నమోదు ఏజెన్సిలుగా అభివృద్ధి చేయ నుంది. ఈ ఏజెన్సీల పర్యవేక్షణలో ప్రధాన అంగన్‌వాడి కేంద్రాలు ఆధార్ నమో దు నిర్వహించనున్నాయి.

గ్రామీణ చెంతకు

ఉమ్మడి జిల్లాలో ఉన్న అంగన్‌వాడిలలో 90శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. గ్రామ విస్తీర్ణం, జనాభా ఆధారంగా అంగన్‌వాడి కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేజర్ గ్రామ పంచాయితీల్లో 8 నుంచి 10 కేంద్రాలు ఉండగా, చిన్న గ్రామాల్లో ఒక్కో కేంద్రం చొప్పున కొనసాగుతున్నాయి. తాజాగా ఐసిడీఎస్ పరిధిలోని సీడిపివోకు ఆధార్ ఏజేన్సి భాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లాలో వ్యాప్తంగా ఆధార్ ఏజెన్సిలు ఏర్పాటు కానున్నాయి. ఏజెన్సిలో ఎంతమంది ఆపరేటర్లను ఏర్పాటు చేయాలనే అంశాలపైనే ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి ప్రతి గ్రామానికి ఒక కేంద్రం నిర్వహిస్తే సరిపోతుందని భావిస్తున్న ఆ శాఖ ఆ ప్రకారం ప్రణాళికలు రూపోందించేందుకు సిద్దమైంది. ప్రతి కేంద్రానికి ఒక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్ ఇవ్వనున్నారు.

పథకాల్లో పారదర్శకత

ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో ఆధార్ కీలకంగా మారింది. ఆసార ఫించన్లు మొదలు బాలమృతం పథకానికి ఆధార్‌ను కీలకం చేసింది.



శిశువుల పౌష్టికాహార పథకాల్లో ఆధార్ సంఖ్య కావాల్సి ఉన్నప్పటికి చిన్న పిల్లలకు కార్డుల జారీలో ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా వాటిని మినహాయింపు ఇస్తోంది. అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే పిల్లలకు వెంటనే ఆధార్ నమోదు చేపట్టి కార్డులు జారీచేస్తే పథకాల అమలు పారదర్శకంగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుతం పథకంతో పాటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్న, బ్యాంకు ఖాతా తెరువాలన్న, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, హెల్త్‌కార్డు, ఇలా ప్రతీదానికి ఆధార్‌కార్డు అవసరం ఉంటుంది. ఈ ఆధార్ నమోదు కోసం దూర ప్రాంతాలైన గ్రామీణులు పట్టణాలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కూలీ పని మానుకొని వస్తారు. ఇలాంటి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా వారి ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

పవన్‌కు నా సత్తా ఏంటో చూపిస్తా

టీడీపీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి



అమరావతి,సూర్యబ్యూరో: జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై పోటీ చేయాలనుకుంటే తాను స్వాగతిస్తానని అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చెప్పారు. ఇదే సమయంలో తన సత్తా ఏంటో పవన్ కు చూపిస్తానని చెప్పారు. పవన్ కల్యాణ్ మీపై పోటీ చేయబోతున్నారట, నిజమేనా? అంటూ ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఆయన పైవిధంగా సమాధానం ఇచ్చారు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబుకు తానే ప్రత్యాయామ్నం అని పవన్ భావిస్తున్నారని ఈ కారణంతోనే మంత్రి నారా లోకేష్ పై విమర్శలు గుప్పించారని ప్రభాకర్ చౌదరి అన్నారు. పవన్ కల్యాణ్ బీజేపీ డైరెక్షన్ లో నడుస్తున్నారనే విషయాన్ని తాను మూడు నెలల క్రితమే చెప్పానని తెలిపారు.

114వ రోజు షెడ్యూల్ విడుదల

వైసీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం



గుంటూరు, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యలపై పోరాడుతూ,ప్రభుత్వ అసమర్ధతను ఎండగడుతూ ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్య క్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర గుంటూరు జిల్లాలో విజయ వంతంగా కొనసాగుతుంది. ప్రజాసంకల్ప యాత్ర 114వ రోజు షెడ్యూల్ ను వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శుక్రవారం మీడియాకు విడుదల చేశారు.




సభలో చర్చ జరిగేవరకు వదిలిపెట్టం

ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఢిల్లీ, సూర్యబ్యూరో: లోక్‌సభలో సోమవారం అవిశ్వాస తీర్మాన నోటీసు ఇస్తామని వైసీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి తెలిపారు. లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం సభ జరిగి ఉంటే మా తీర్మానం చర్చకు వచ్చేది. అయినా మరోసారి తీర్మాన నోటీసు ఇస్తాం. సభలో చర్చ జరిగేవరకు వదిలిపెట్టం. వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి తృణముల్ కాంగ్రెస్, కాంగ్రెస్, శివసేన, తదితర పార్టీలు మద్దతు ఇచ్చాయి. హోదా విషయంలో చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు. ఆయన తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. హోదా విషయంలో చంద్రబాబు ఎలా మాట్లాడారో అందరికీ తెలుసు. వై సీపీ యువభేరికి వెళ్తే జైల్లో పెడతామని బెదిరించారు. మా ఆందోళనలు, బంద్‌లను భగ్నం చేసే యత్నం చేశారు. హోదాపై మొదటినుంచీ పోరాడుతున్నది వై సీపీనే. మాకు పదవులు కాదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రత్యేక హోదా సంజీవినా అని ప్రశ్నించిన చంద్రబాబు ఇప్పుడు హోదా కోసం పోరాటం చేస్తామని చెబితే ఎవరూ నమ్మరు. ఐదు కోట్ల మంది ప్రజలు ప్రత్యేక హోదా కోసం నినదిస్తుంటే ఇప్పుడు చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారు. అందుకోసమే ఇవాళ ఎన్డీయే నుంచి బయటకు వస్తున్నట్లు ప్రకటించారన్నారు. కొంప మునిగిపోతుందని భావించి చంద్రబాబు బీజేపీ నుంచి విడిపోయారు. రాబోయే రోజుల్లో ప్రజలు చంద్రబాబుకు గుణపాఠం చెప్పడం ఖాయం అని అన్నారు.

చంద్రబాబు, కేంద్రాన్ని ఎండగడతాం

సీపీఎం నేత బాబురావు



విజయవాడ,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ మరోసారి ద్రోహం చేసిందని సీపీఎం నేత బాబురావు విమర్శించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. నిబంధ నల ప్రకారం అవిశ్వాసం ఎందుకు చేపట్టరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా పార్లమెంట్‌లో చంద్రబాబు, కేంద్రాన్ని ఎండగడతామన్నారు. ప్రజా క్షేత్రంలో ఎవరు తప్పించుకోలేరని ప్రజలు తిరగబడతారనే భయంతోనే టీడీపీ డ్రామాలాడుతోందని మండిపడ్డారు. నాలుగేళ్లు హోదాపై చంద్రబాబు ఎందుకు మాట్లాడలేదని బాబురావు నిలదీశారు.

హోదా' కోసం కమ్యూనిస్టులతో కలసి ఐక్య ఉద్యమం

- మా నాన్న ఉభయ కమ్యూనిస్టు సభ్యులే
- సీపీఐ, సీపీఎం నేతలు, జనసేన నేత పవన్



విజయవాడ, సూర్య బ్యూరో : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమిస్తామని జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ సినీనటులు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. విజయవాడ దాసరిభవన్‌లో శుక్రవారం సీపీఐ, సీపీఎం నేతలతో పవన్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల్ని నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే వుందని ఆయన స్పష్టం చేశారు. నాడు రాష్ట్రానికి ఎంతోకొంత మేలు చేకూరుతుందనే ఆశతోనే టీడీపీ, బీజేపీలకు మద్దతిచ్చానని గుర్తు చేశారు. తాను ఎలాంటి పదవుల్ని ఆశించలేదని, కనీసం కప్పు కాఫీ కూడా తాగలేదని అన్నారు. ఈ రెండు పార్టీలూ ఇచ్చిన హామీలను మాట తప్పాయని, రాష్ట్రాభివృద్ధిపై నిర్లక్ష్యం చూపాయని దుయ్యబట్టారు. ఈ పరిస్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవినీతి పెరిగిపోతోందంటూ పదే పదే ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళ్లానని గుర్తుచేశారు. చేసిన తప్పులు సరిదిద్దుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం తాను ఎంతవరకైనా వెళ్తానని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నేతలతో కలిసి కూర్చుని చర్చించాక, ఒక ఉద్యమ దిశాదశను నిర్ణయిస్తామని వెల్లడించారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాక కామన్ కార్యచరణ ప్రకటిస్తామని, రాష్ట్రం నుంచి గ్రామస్థాయి వరకూ ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. నాడు రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సమావేశాలలో కొందరు పెద్ద మనుషూలు రాష్ట్రానికి ప్రత్యేక దా పదేళ్ల నుంచి 15 ఏళ్ల పాటు ఇస్తామంటూ వేలంపాటలా సభలో ప్రకటించారని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు. మా నాన్న చిన్నతనం నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీల సభ్యులేనని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వామపక్ష, సోషలిస్టు భావజాలాలను తాను గౌరవిస్తానని చెప్పారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేసి తిరిగి ఒంటరిగా పోటీ చేసి గెలుపొందాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సవాల్ విసిరారు. టీడీపీకి చిత్తశుద్ధి వుంటే తమతో కలిసి ఉద్యమించాలని సూచించారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో ఏపీ ప్రత్యేక దా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహించనున్న రౌండ్టటేబుల్ సమావేశానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విచ్చేస్తారని చెప్పారు. ఎన్నికల హామీలు, విభజన చట్టాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజల్ని టీడీపీ, బీజేపీలు మోసగించాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఎద్దేవా చేశారు. అనంతరం సీపీఐ, సీపీఎం ముఖ్యనేతలతో చర్చలు జరిపారు.

వచ్చేది యూపీఏ ప్రభుత్వం ఏపీకి న్యాయం

కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ప్రత్యేక హోదాపై తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీకి న్యాయం జరిగేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. మోదీ మళ్లీ ఎన్డీయేకు నాయకత్వం వహించి ప్రభుత్వంలోకి వస్తారని ఏ ఒక్కరూ విశ్వసించడంలేదని అన్నారు. రాబోయే యూపీఏ ప్రభుత్వంలో హామీలన్నీ అమలు చేస్తామని అన్నారు. ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కేవీపీ స్పష్టం చేశారు.


ఎఐసిసి కార్యవర్గ సభ్యుడుగా నరహరిశెట్టి



విజయవాడ, సూర్య బ్యూరో : అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) కార్యవర్గ సభ్యులుగా నియమితులైన విజయవాడ పాతబస్తీకి చెందిన న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావుకు వివిధ సంఘాల నాయకులు, పలువురు అభిమానులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాత బస్తీలో ఏర్పాటు స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం తనపై వుంచిన బాధ్యతలను సక్ర మంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజలలో సానుకూలత కనబడుతోందని చెప్పారు. ప్రస్తుత తెలుగుదేశం పార్టీ పాలనపట్ల ప్రజలలో అసంతృప్తి పెరుగు తుందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరికి కట్టుబడి వుందన్నారు. రాష్ట్రానికి రావలసిన నిధుల కేటాయింపు, బడ్జెట్‌లో స్పష్టత లేకపోవడంతో ప్రజలలో బిజెపి ప్రభుత్వం పట్ల ఆగ్రహం కనపడుతోందన్నారు. కాగా నరహరిశెట్టిని అభినందించిన వారిలో నేషనల్ ఫ్రూట్స్, హాకర్స్, ఆటోవర్కర్స్ యూనియన్ల నాయకులు సూరకాశి శంకరరావు, పారరాజు, జి. గురవయ్య, ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు సహించేది లేదు


రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత



విజయవాడ, సూర్య బ్యూరో : పనిచేసే స్థలంలో మహిళలపై వేదింవులను సహించేది లేదని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమం, సెర్ప్ శాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేసే చోట మహిళలపై లైంగిక వేదింవుల నిరోధ చట్టం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నివుణులు, ప్రొఫెసర్, పోలీస్ శాఖ వారు చట్టంలో ఉన్న విధి విధానాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2013వ సంవత్సరంలోనే భారత ప్రభుత్వం చట్టాన్ని అమలులోకి తెచ్చినా చాలా మందికి దీనిపై అవగాహన లేదన్నారు. పనిచేసే స్థలంలో లైంగిక వేధింవులు లేకుండా గౌరవంగా పనిచేయడం మహిళలకు హక్కుగా భారత ప్రభుత్వం కల్పించిందన్నారు. పనిచేసే ప్రతి మహిళకు అవగాహన కల్పించేందుకే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 33 శాఖల్లో ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చెయ్యడం జరిగిందని మంత్రి తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో త్వరలో కమిటీలు ఏర్పాటు చెయ్యాలని అధికారులకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. మహిళలు పనిచేసే చోట ఏమైనా వేదింవులకు గురవుతున్నట్లయితే డిప్రెషన్ కు లోనవకుండా కుటుంబ సభ్యులతో లేదా తోటి వారికైనా తెలియజేసి వేదింవులకు గురిచేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకురావాలన్నారు. మహిళలు ముందుకొచ్చి ఫిర్యాదు చేసినవ్పుడు ఇటు వంటి సంఘటనలు మరలా వునరావతంకాకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లోనే కాకుండా ప్రైవేటు కార్యాలయాల్లో కూడా ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చెయ్యాలన్నారు.

సురక్షితమైన పని స్థలం కోరుకోవడం మహిళల హక్కు అని మంత్రి అన్నారు. పనిచేసే స్థలం వద్ద వేదింవులు జరిగినవ్పుడు కుటుంబం పరువు పోతుందనో, అధికారులు ప్రతీకారంతో ఏం చేస్తారో అని మహిళలు బయపడకుండా ఫిర్యాదులు చేసినవ్పుడే ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోగలుగుతామన్నారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ కమీషనర్ అరుణ్‌కుమార్, సెక్రటరీ కె.సునీత, ప్రొఫెసర్ శాంతి, అడ్వకేట్ అనుపమ, ఇన్‌స్పెక్టర్ అరుణ మరియు సచివాలయంలోని మహిళా ఉద్యోగుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఆగ్నేయంగా ఆరేబియా సముద్రంలో ఉన్న వాయుగుండం బలహీనపడి తీవ్ర అల్పపీడనంగా మారడంతో బంగాళా ఖాతం నుంచి తేమగాలులు వీస్తున్నాయి. ఇదే సమయంలో ఎండ తీవ్రత కుడా కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతుంది. ఈ రెండింటి ప్రభా వంతో రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయల సీమ జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, ఈదురు గాలు లతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం ఇప్పటికే ప్రారంభమైంది అని వాతావరణశాఖ తెలిపింది. కాగా శుక్రవారం రాయల సీమ, కోస్తాల్లో పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. దీంతో విశాఖపట్నంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.


తిరుమలలో ఉగాదికి భారీ ఏర్పాట్లు

భక్తులకు ఈఓ విళంబినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు



తిరుమల, సూర్య ప్రతినిధి : శ్రీ విలంబి నామ ఉగాది సంవత్సరాన్ని వురస్క రించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జెఈవో శ్రీ కె.ఎస్. శ్రీనివాసరాజు, తిరుపతి జెఈవో శ్రీ పోల భాస్కర్ కలిసి భక్తులకు, ఉద్యోగులకు, ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. నూతన తెలుగు సంవత్సరాదిని ఉత్సాహంగా జరుపు కోవాలని, శ్రీ పద్మావతి వేంకటేశ్వరుల ఆశీస్సులతో భక్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పొట్టి శ్రీరాములుకు రఘువీరా నివాళి



విజయవాడ, సూర్యబ్యూరో : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం చేశారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఢిల్లీ ఆంధ్ర భవన్‌లో ఏపిసిసి అధ్వర్యంలో పొట్టి శ్రీరాము లు జయంతి నిర్వహించారు. తొలుత రఘువీరారెడ్డి, పిసిసి నాయకులు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించున్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్ని జైలుకు వెళ్లారున్నారు. ఆయన అమరణ దీక్షతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు.

ఎస్సీలకు సంక్షేమ పథకాలు అందించాలి

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె. రాములు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ : వికారాబాద్‌లో శుక్రవారం జాతీయ షెడ్యూల్ కులాల కమీషన్(ఎస్సీ) సభ్యులు కె.రాములు పర్యటించారు. ఆయన ఉదయం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన వికారాబాద్‌కు చేరుకున్నారు. వికారాబాద్‌లోని అతిధిగృహంలో ఆయన కు జిల్లా ఇంచార్జ్ జెసి సంధ్యారాణి, జిల్లా ఎస్పీ టి.అన్నపూర్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లద రావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు స్వాగతం తెలిపారు. అక్కడినుంచి ఆయన ఆలంపల్లిలోని 5 వార్డులోని ఎస్సీ కాలనీలో పర్యటించి, కాలనీలోని సమస్య లను ప్రజలను అడిగితెలుసుకున్నారు. కాలనీ ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగ ఆయన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడినుంచి కొత్తగడిలోని ఎస్సీ గురు కుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జెసి సంధ్యారాణి, జిల్లా ఎస్పీ టి.అన్నపూర్ణ,ఎఎస్పీ నర్సింహులు, జిల్లా సాంఘీక సంక్షేమాధికారి శ్వేతప్రియదర్శిని, ఆర్డీఓ విశ్వనాథం, 5వ వార్డు కాన్సిలర్ మాణేమ్మ,బి.జె.పి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లద రావు, బిజెపి దళిత, లీగల్ సెల్ కన్వీనర్‌లు నవీన్‌కుమార్, ఆర్. సాయి క్రిష్ణ, బిజెపి, టీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు కె.పి.రాజు, పాండుగౌడ్, పోకల సతీష్, సురేష్, తిమ్మని శంకర్, జగదీష్, పెండ్యాల అనంతయ్య,ఎంపిడిఓ సత్తయ్య, తహసీల్దార్ చిన్నఅప్పల నాయుడు, తాండూర్, పరిగి డీయస్పీలు రామ చంద్రుడు, శ్రీనివాస్, వికారాబాద్‌టౌన్, ధారూర్ సీఐలు వెంకట రామయ్య, జె.ఉపేందర్,నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ ఆన్‌లైన్ సేవల సర్వీస్ చార్జీలు తగ్గింపు

తిరుమల, సూర్య ప్రతినిధి : ప్రపంచ ప్రఖ్యాత ధార్మిక సంస్థ టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను వినియోగించుకునే భక్తులకు మార్చి 14వ తేదీ నుండి సర్వీస్ ఛార్జీలు తగ్గాయి. ఆర్జితసేవలు, వసతి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, ఈ-హుండీ, ఈ-డొనేషన్ తదితర సేవలకు ఈ తగ్గించిన ఛార్జీలు వర్తిస్తాయి. టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలకు సర్వీస్ ఛార్జీల భారం అధికంగా ఉందని భక్తుల నుండి సూచనలు, ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో సంప్రదింపులు జరపడంతో సర్వీసు ఛార్జీలు తగ్గాయి. ఆన్‌లైన్ సేవలకు తగ్గించిన సర్వీస్ ఛార్జీల వివరాలు ఇలా ఉన్నాయి. క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేస్తున్న భక్తులకు సర్వీస్ ఛార్జీని 1.5 శాతం నుండి 0.5 శాతానికి తగ్గించారు. డెబిట్‌కార్డు ద్వారా చెల్లింపులు చేస్తున్న భక్తులకు రూ.2 వేల వరకు ఎలాంటి సర్వీస్ ఛార్జీ లేదు. రూ.2 వేలు పైన చెల్లించేవారికి సర్వీస్ ఛార్జీని 1 శాతం నుండి 0.5 శాతానికి తగ్గించారు. అదేవిధంగా, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు చేస్తున్న భక్తులకు సరాసరి రూ.1000కి రూ.16 వసూలు చేస్తుండగా, ఇకపై రూ.7 వసూలు చేస్తారు.



మోడీతో జత కడితే అవిశ్వాస తీర్మానం ఎందుకిస్తాం

వైసీపీ ఎమ్మెల్యే రోజా

తిరుపతి,సూర్యబ్యూరో: బీజేపీతో వైసీపీ అధినేత జగన్ చేతులు కలిపారంటూ వస్తున్న విమర్శలపై వైసీపీ ఎమ్మెల్యే రోజా స్పందించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇలాంటి విమర్శలు ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవేళ మోదీతో జతకడితే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ఎందుకిస్తామని అన్నారు. మొన్నటి వరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను టీడీపీ నేతలు మంచోడు అని అన్నారని ఇప్పుడు టీడీపీ నేతలను ప్రశ్నించేసరికి ఆయన చెడ్డ వ్యక్తి అయ్యారా? అని ప్రశ్నించారు. ఆర్థిక నేరస్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేషేనని జగన్ కాదని అన్నారు.

అతిసార ఘటనపై పవన్‌ది రాద్ధాంతం


ఏపి సాంఘిక సంక్షేమ శాఖమంత్రి నక్కా ఆనంద్‌బాబు



వెలగపూడి, సూర్య ప్రతినిధి : గుంటూరులో అతిసార ఘటనపై జనసేన అధినే పవన్ కల్యాణ్ అనవసరంగా రాజకీయ రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. ఈ విషయంపై పవన్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ ఘటనలో మృతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం అందించిందని, సీఎం చంద్రబాబు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంటే.. పవన్ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ప్రేరేపిత చర్యలుగా ఉన్నాయన్నారు. అవగాహనా రాహిత్యంతోనే పవన్ ఇలా ప్రవర్తిస్తున్నారని మంత్రి అన్నారు.

లోపల విశ్వాసం బయట అవిశ్వాసం

- నేరస్థులను పీఎంఓలో కూర్చోపెట్టుకుంటారా
- ఎనిమిదేళ్లుగా ఆస్థులను ప్రకటిస్తున్నా
- రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వరా
- శాసనమండలిలో చంద్రబాబు ధ్వజం



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ లోపల విశ్వాసం.. బయట అవిశ్వాసం చందంగా వ్యవహరిస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని నిర్మాణం కేంద్ర ప్రభుత్వ బాధ్యత కాదా. మట్టి , నీరు పంపిస్తే సరిపోతుందా? అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్, వెకాపా లాలూచీ పడ్డాయన్నారు. వెకాపా ఎంపీలు రాజీనామా చేస్తే బీజేపీ ప్రత్యేక హోదా ఇస్తారనే ప్రచారం జరుగుతోందన్నారు. నేరస్థులను పీఎంవోలో కూర్చోపెట్టుకుంటే అవినీతిపై ఎలా పోరాడతారంటూ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఏ1, ఏ2లు ప్రధానిని కలుస్తుంటే ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయో ఆలోచించాలన్నారు. తనపై గతంలో 26 విచారణలు వేసినా తననేమీ చేయలేక పోయారని, తాను నిప్పులా బతికానన్నారు. తమ కుటుంబ ఆస్తులను ఎనిమిదేళ్లుగా ప్రకటిస్తున్నాన్నారు. ఎథిక్స్ కమిటీ తీసుకొచ్చి ఆస్తుల వివరాలను స్పీకర్ కు ఇచ్చే సంప్రదాయం తీసుకువచ్చింది తానేనన్నారు. గతంలో తనపై 26 విచారణలు వేసినా భయపడలేదని, తానెవరికీ భయపడేది లేదన్నారు. తాను ప్రజలకే భయపడతానని స్పష్టంచేశారు. తనపై ఆరోపణలు చేసేటప్పుడు ఆలోచించుకోవాలని సూచించారు. విభజన చట్టం, హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వెఖరిపై శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బీజేపీ, వైసీపీ అనుసరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

రాజధాని నిర్మాణంలో కేంద్రానికి బాధ్యత లేదా?

కొత్త రాజధాని నిర్మాణంలో ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా? రాజధాని నుంచి ఆదాయం వస్తే కేంద్రానికి కావాలా? చట్టంలో ఉండే దుగరాజపట్నం పోర్టు ఎందుకు ఇవ్వడం లేదు? ఏపీ అసెంబ్లీ సీట్ల పెంపునకు డబ్బులు అవసరం లేదు. అయినా ఎందుకు పెంచడంలేదు. చట్టంలో పెట్టిన దాన్ని అమలుచేయడం లేదంటే దురుద్దేశం కాదా? విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను నీరుగార్చే పరిస్థితి వచ్చింది. ముంబయి-ఢిల్లీ పారిశ్రామిక కారిడార్‌తో సమానంగా దానికి గుర్తింపు ఇస్తామని చెప్పారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఎందుకు పెట్టరో కేంద్రం చెప్పాలి. ఇంకా ఎన్నేళ్లు కావాలి? కర్నూలులో ట్రిపుల్ ఐటీకి రూ.53 కోట్లు ఇచ్చారు. ఎయిమ్స్‌కు రూ.1618 కోట్లు కావాలి. రూ.34 కోట్లు మాత్రమే ఇచ్చారు. పోలవరం ఆంధ్రప్రదేశ్ జీవనాడి. నిర్మాణం పూర్తిచేస్తే నీటి ఎద్దడి ఉండదు. పోలవరం పూర్తయితే రాష్ట్రంలో కరవు ఉండదు. పోలవరంలో అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారు. భూసేకరణ అక్రమాలపై సీబీఐ విచారణ వేయాలని సాక్షి పత్రికలో రాశారు. పోలవరానికి అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి అడ్డుకట్టవేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

పవన్ అవగాహనతోనే మాట్లాడుతున్నారా...

పోలవరంపై పవన్ అవగాహన ఉండి మాట్లాడుతున్నారా? అవగాహన లేక మాట్లాడుతున్నారా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తీసుకున్న నిర్ణయాలపై లేనిపోని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. రైల్వేజోన్ విషయంలో నాలుగేళ్ల తర్వాత కూడా కేంద్రం ఆలోచిస్తామనడం సబబా? రాజధానికి రైతులు 33వేల ఎకరాల భూమి ఇచ్చారు. రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా? రాజధానికి 1500 ఎకరాలు చాలని పవన్ అంటున్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించాలనుకున్నా రాజధాని నిర్మాణం మాత్రం ఆగదు. రైతులు భూములు ఇచ్చిన స్ఫూర్తితో కేంద్రం కూడా ముందుకు రావాలి కదా? ప్రపంచంలోని పుణ్యక్షేత్రాల నుంచి మట్టి, జలాలను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశాం. ప్రధాని కూడా మట్టి, నీళ్లు పంపించారు.

ఇది తమిళనాడు కాదు

మేం అవిశ్వాసం పెడతామంటే అన్ని పార్టీలు సంఘీభావం తెలుపుతున్నాయి. ఎవరునాటకాలు ఆడినా జరగనీయం. ఇది తమిళనాడు కాదు. మెగా ఆక్వా ఫుడ్ పార్కు వాళ్లు నాకు బంధువులు కాదు. కాకినాడలో కెమికల్ ఫ్యాక్టరీ వద్దంటారు. విశాఖలో భాగస్వామ్య సదస్సు పెడితే జల్లికట్టు స్ఫూర్తితో ఆందోళన చేస్తామంటారు. ఫాతిమా కళాశాల విద్యార్థులకు న్యాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నాం. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆరు సార్లు ఢిల్లీకి వెళ్లారు. ఏమీ చేయలేదని విమర్శించడం ఎంతవరకు సబబు? ఎర్రచందనం దుంగలు అమ్మాలంటే కేంద్ర ప్రభుత్వం అనుమతి కావాలి. ఎర్రచందనం దుంగలు విక్రయించి రూ.1231 కోట్లు ఆర్జించాం. రెండు నెలలకోసారి వేలం వేసి ఎర్రచందనం దుంగలు విక్రయించాలని చెప్పాం. అక్రమ రవాణా నియంత్రణకు కూంబింగ్ కొనసాగిస్తున్నాం. ఎర్ర చందనం అక్రమ రవాణాలో వైసీపీ నాయకుల ప్రమేయం ఉంది.

అవినీతిపరులతో మీకు అవసరం ఉందా

ప్రతిపక్ష పార్టీని అడ్డుపెట్టుకుని రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల్ని ఇవ్వడంలేదు. డ్రామా ఆడుతున్న వైసీపీ నాయకుడు 2017 మే 10న ప్రధానిని కలిశారు. బీజేపీకి మేం ముందు నుంచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నామని ఆ వైసీపీ నాయకుడు చెప్పారు. బీజేపీ నిలిపిన రాష్ట్రపతి అభ్యర్థికి బేషరతుగా మద్దతిస్తామని చెప్పారు. వైసీపీ నేత ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్తారు. ఈ రోజు కూడా వెళ్లారు. అవినీతిపరులకు కలిసే అవకాశం ఇచ్చి ప్రధాని ఏవిధంగా సమర్థించుకుంటారు? అవినీతిపరుల మద్దతు కేంద్రానికి అవసరం ఉందా. ఇది అనైతికం కాదా? నీతివంతమైన పాలన ఎలా ఇవ్వగలుగుతారు? కేసుల మాఫీ కోసమే ఇలా చేస్తున్నారని అందరూ అనుకుంటున్నారు. ఎవరికీ నమస్కా రం పెట్టని జగన్, విజయసాయిరెడ్డి రామ్‌నాథ్ కోవింద్ వస్తే పాదాభివందనం చేశారు. కేసులు మాఫీ అవుతాయని అధికారం ఉన్నవాళ్లకు పాదాభివందనం చేస్తారు. బంగాళాఖాతంలో పడేస్తాం. ప్రజాస్వామ్యంలో మనం ఎక్కడికి పోతున్నాం? రాష్ట్రపతి అభ్యర్థిగా రామ్‌నాథ్ కోవింద్‌ను ప్రకటించగానే బీహార్‌కు వెళ్లారు. అలా కలవడం ద్వారా సీబీఐ, ఈడీ సహా అన్ని ప్రభుత్వ విభాగాలకు సందేశాన్ని ఇచ్చారు. నాకు ప్రధాని, రాష్ట్రపతి బాగా పరిచయం. నా కేసుల జోలికి రావొద్దు. మీకేమైనా కావాలంటే సెటిల్ చేసుకుందామనే సంకేతాలు జగన్ ఇచ్చారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

సభకు హాజరు కాకుండా పారిపోయిన ప్రతిపక్షం

ఏపీ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్



అమరావతి, సూర్య ప్రతినిధి : వైసీపీ సభ్యులు ప్రతిపక్ష హోదాలో ఉండి సభకు హాజరుకాక పోవడం బాధాకరమని మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం శాసనమండలిలో మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధిపై మాట్లాడుదామంటే ప్రతిపక్షం పారిపోయిందని విమర్శించారు. అభివృద్ధికి సహకరించకపోగా ఉపాధి పథకంలో అక్రమాలంటూ కేంద్రానికి ఫిర్యాదు చేసి ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారని నారా లోకేష్ మండిపడ్డారు.

లోకేష్‌పై పవన్ ఆరోపణలు సరికాదు

బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు



వెలగపూడి, సూర్య ప్రతినిధి : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ అట్టుడికిపోతోంది. టీడీపీ నేతలతో పాటు బీజేపీ నేతలు కూడా పవన్ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. ఆధారాలు లేకుండా లోకేష్‌పై పవన్ ఆరోపణలు సరికాదని ఆయన చెప్పారు. ఫాతిమా విద్యార్థులకు టీడీపీ న్యాయం చేయలేదనడం కరక్ట్ కాదని, ఫాతిమా విద్యార్థులకు న్యాయం చేశామని చెప్పారు. తమ మంత్రి ఢిల్లీ చుట్టూ తిరిగారని, బీజేపీ చేసిన పనులు చెప్పలేకపోయిందన్నారు. టీడీపీ తమను ప్రజల ముందు దోషిగా నిలబెట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, భూకబ్జాల మీద తాను చేసిన ఆరోపణలపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారని గుర్తు చేశారు. జాతీయ రాజకీయాల్లో శూన్యత ఏమీ లేదని విష్ణుకుమార్‌రాజు కొట్టి పారేశారు. సమస్యల పట్ల బీజేపీ వెంటనే స్పందిస్తోందని, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్ త్వరలో ప్రకటించబోతున్నారని వెల్లడించారు. సభలో తాము ఒంటరి పోరాటం చేస్తామని విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు.

ఇది రాజకీయం అని ఎందుకనిపిస్తుంది?

టీడీపీ ఎంపీ కె. రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : అన్ని పార్టీల మద్దతు కోరి అవిశ్వాస తీర్మానాన్ని పూర్తి స్థాయిలో జరిగేలా చూస్తున్నామని టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయు డు పేర్కొన్నారు. ఇందులో రాజకీయం ఉందని ఎందు కనిపిస్తుందని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ప్రశ్నించారు. న్యాయం కోసం పోరాటంలో ఇదొక భాగంగా ఎస్కలేట్ చేసు కుంటూ వచ్చామని అన్నారు. కేంద్రం ఏపీకి న్యాయం చేస్తుందని నమ్మి పొత్తు పెట్టుకున్నామని, మూడున్నరేళ్లుగా ఎదురు చూశామని, ఏదో ఒక కారణం చూపుతున్నా, సహనం పాటించామని, విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలు చేయాలని కోరడం తప్పా? అని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లోనైనా ఏపీకి న్యాయం జరుగుతుందని ఎదురు చూశామని, అయినా బడ్జెట్‌లో ఏపీకి న్యాయం జరగలేదని, దీంతో తాము పార్లమెంటు లోపల, బయట నిరసన తెలుపుతున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మంత్రులు కూడా రాజీనామాలు చేశారని, రాజకీ యంగా చేయాలంటే ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకునేవారమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్డీయేతో కలిసి ఇంతకాలం ఉన్నామని, ఇక ఏపీకి న్యాయం జరగదని తెలిసి కేంద్రంపై ఒత్తిడితెచ్చే విధంగా ఒక్కొక్క టిగా తమ కార్యక్రమాలు చేపట్టామే తప్ప ఇందులో రాజకీయం లేదని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

చంద్రబాబు తన కొమ్మను తానే నరుక్కుంటున్నారు

బీజేపీ ప్రతినిధి నరసింహరావు



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్నారని బీజేపీ ప్రతి నిధి నర్సింహారావు అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే చంద్ర బాబు, తెలుగుదేశం పార్టీ కేంద్రంపై నెపాన్ని నెట్టుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో పేర్కొనని వాటిని కూడా నెరవేరుస్తుంటే బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ పాలనతో దేశం కొత్తపుంతలు తొక్కుతోందని, ఎన్డీయే కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగినా తమకు వచ్చే నష్టం లేదన్నారు. దేశంలో 20కి పైగా రాష్ట్రాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయని, దేశ ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారన్న దానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు.

టీడీపీ ఎమ్మెల్యేకు హైకోర్టులో ఊరట



హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఏపీ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై హైకోర్టు స్టే విధించింది. 2011లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి, దూషణ కేసులో చింతమనేనికి భీమడోలు కోర్టు రెండేళ్ల శిక్ష విధించింది. తనను దోషిగా నిర్ధారిస్తూ భీమడోలు మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ దశలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయ న్యాయవాది చేసిన అభ్యర్థన మేరకు ఈ వ్యాజ్యాన్ని న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. తిరిగి ఈ రోజు ఇరువర్గాల వ్యాజ్యాన్ని విన్న న్యాయస్థానం భీమడోలు కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై స్టే విధించింది.

రూ.38 లక్షలతో శ్రీ కోదండరామాలయంలో అభివృద్ధి పనులు

- వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్




తిరుమల, సూర్య ప్రతినిధి : తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో వసతులు పెంచేందుకు రూ.38 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయని, తిరుపతి, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయంలో ఉదయం 8.30 నుండి 9 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల గోవిందనామస్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ 16వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని వునరుద్ధరించినట్టు ఆధారాలు న్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా మార్చి 20న గరుడసేవ, మార్చి 21న హనుమంత వాహనం, మార్చి 23న రథోత్సవం, మార్చి 24న చక్రస్నానం జరుగనున్నాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10గంటల వరకు, రాత్రి 8 నుండి 10 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయని తెలిపారు. సివిఎస్‌వో ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. ఆలయ ప్రధాన కంకణభట్టార్ ఆనందకుమార్ దీక్షితులు ప్రసంగిస్తూ ధ్వజారోహణంతో సకలదేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్టు తెలిపారు. రాముడు ధర్మస్వరూపుడని, ఆయన ఆదర్శాలను భక్తులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ధ్వజారోహణంలో పాల్గొని ప్రసాదం స్వీకరిస్తే సమస్త దోషాలు తొలగుతాయని, సంతానం లేనివారికి ఉత్తమ సంతానం కలుగుతుందని తెలిపారు. ముందుగా ఉదయం 6 నుండి 8 గంటల వరకు శ్రీ సీతా లక్ష్మణ సమేత కోదండరాముల వారి ఉత్సవమూర్తులు, ధ్వజపటం, చక్రత్తాళ్వారులకు తిరువీధుల ఉత్సవం నిర్వహించారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు స్నపనతిరుమంజనం జరిగింది. రాత్రి 8 నుండి 10 గంటల వరకు పెద్దశేష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి భక్తులకు కనువిందు చేయనున్నారు.

ఆకట్టుకున్న అలంకరణల

ఆలయంలో అద్భుతంగా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టారు. టీటీడీ గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో రామాయణంలోని ఘట్టాలతో ఏర్పాటు చేసిన సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. ఇందులో సుందరకాండలో లక్ష్మణ, సుగ్రీవుల సమక్షంలో శ్రీరామచంద్రునికి సీతాదేవి చూడామణిని సమర్పిస్తున్న హనుమంతుడు, అరణ్యకాండలో కబంధుడనే ఒంటికన్ను రాక్షసుడితో యుద్ధం చేస్తున్న శ్రీరామలక్ష్మణులు సెట్టింగులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టిటిడి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, సివిఎస్‌వో ఆకె రవికృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో ఝాన్సీ, సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శేషారెడ్డి, మురళీకృష్ణ ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు

బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్



అమరావతి, సూర్య ప్రతిరనిధి : తమ ప్రభుత్వం వైఫల్యాలను కప్పి వుచ్చుకునేందుకే తెలుగుదేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చేసిందని భాజపా ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యా నించారు. ఈ పరిణామాన్ని స్వాగతిస్తూ ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఎన్నికల్లో గెలవడం కోసమే బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని అన్నారు. 1999లో వాజపేయి ఛరిష్మాతో గెలిచిన చంద్రబాబు తర్వాత ప్రాణం ఉన్నంత వరకు బీజేపీతో పొత్తు పెట్టుకోమని చెప్పి మాట మార్చారని వ్యాఖ్యానించారు. దేశంలో మోడీ హవా మొదలవటంతో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో సీఎం విఫలమయ్యారని ఆరోపించారు. చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకుని నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీ అవిశ్వాసం పెడితే కాంగ్రెస్‌కు ఎక్కువ మాట్లాడే అవకాశం వస్తుందన్నారు.

విశాఖలో గోఫర్ గోల్డ్ గ్రాండ్ ఉగాది వేడుకలు



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : గోఫర్ గోల్డ్ ఉగాది వేడుకలను గ్రేట్ ఈస్టర్న్ ప్రారంభించింది. విశాఖపట్నంలోని ఈస్టర్న్ స్టోర్‌లో ఈ గ్రాండ్ ఉగాది ఆఫర్‌ను గాజువాక స్టోర్‌లో నటి పాయల్‌ఘోష్ (హారిక) శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ప్రతి గంటకు ఇద్దరు అదృష్టవంతులు బంగారునాణెం గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు ప్రసాదరెడ్డి, అశోక్‌రెడ్డి వెల్లడించారు. ఉగాది పండుగ వేళ వినియోగదారులకు గోఫర్ గోల్డ్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు వివరించారు.

మహిళా ఎమ్మెల్యేలకు పట్టుచీరలు పంపిణీ



వెలగపూడి, సూర్య ప్రతినిధి : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం వెంకటగిరి నుండి ప్రత్యేకంగా తెప్పించిన పట్టుచీరలను అందజేశారు.

తెలుగువారి ఐక్యత, నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం



- అమరజీవికి నిజమైన నివాళి
- పొట్టిశ్రీరాములు త్యాగాన్ని స్మరించుకున్న చంద్రబాబు

అమరావతి, మార్చి 15: ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం చేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి పొట్టిశ్రీరాములు త్యాగాన్ని స్మరించుకున్నారు. నాటి మద్రాసు రాష్ట్రంలో తెలుగువారు ద్వితీయ శ్రేణి పౌరులుగా అవమానాలకు, అవహేళనకు, అన్యాయానికి గురవుతున్న నేపథ్యంలో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోరుతూ ఆమరణ దీక్ష చేపట్టారని అన్నారు. తన ప్రాణాలను అర్పించి తెలుగువారిలో ఐక్యత తెచ్చిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో తెలుగువారంతా ఐక్యంగా ఉండాలని, తిరిగి రాష్ట్రంలో చిచ్చుపెట్టాలని దుష్ట శక్తులు పొంచి ఉన్నాయని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని చంద్రబాబు పిలువునిచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ వునర్నిర్మాణంలో తనకు సహకరించాలని కోరారు. రాజధాని అమరావతి నిర్మాణం, తెలుగువారి ఐక్యతే ఆయనకు నేడు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి అన్నారు. అత్యంత ప్రాధాన్యతాంశాలుగా అమరావతి నిర్మాణం చేపడతామని మౌలిక సదుపాయాల పనులు వేగం వుంజుకున్నాయని, పోలవరం ప్రాజెక్టును అనుకున్నట్లుగానే 2019లో పూర్తి చేస్తామని, రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. శ్రీరాములు ప్రాణత్యాగంతో నాటి ప్రధాని 1952 డిసెంబర్‌లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును ప్రకటించారని, 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రథమ ముఖ్యమంత్రిగా పనిచేసి ఆంధ్రజాతిలో ఐక్యత తెచ్చారన్నారు. తెలుగుమాట్లాడే వారందరితో కూడిన తెలుగురాష్ట్రం కావాలన్న తెలుగువారి ఆకాంక్ష మేరకు నైజాం రాష్ట్రం, ఆంధ్రరాష్ట్రాన్ని కలిపి భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన 1956 నవంబర్ 1 హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారని చంద్రబాబు గుర్తుచేశారు. తిరిగి ఆంధ్రప్రదేశ్ విభజనతో తెలంగాణతో అరవై ఏళ్ల పాటు కొనసాగిన బంధం తెగిపోయిందన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విభజించారని గుర్తు చేశారు. రాజ ధాని లేకుండా బయటికి వచ్చామని అన్నారు. రాజధానుల నిర్మాణం తెలుగు వారికి కొత్తకాదని, సంక్షోభా లనే అవకాశాలుగా మలచుకుని అద్భుతాలు సృష్టించిన చరిత్ర మనకు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కొండలనైనా ఢీకొంటామని, ఎవరికీ భయపడబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

సీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి


ఏపీ సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాస్



అమరావతి, సూర్య ప్రతినిధి : రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినట్లు మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలి పారు. రాయలసీమ నుంచి కరువును పార దోలేందుకు సీఎం నిరంతరం కష్టపడుతున్నా రని చెప్పారు. శుక్రవారం మీడియాతో మాట్లా డిన మంత్రి నంద్యాల ఉపఎన్నికల్లో సీఎం ప్రకటించిన విధంగా జర్నలిస్టుల కోసం ఇళ్లు కేటాయించడం జరుగుతుంద న్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించడం జరిగిందన్నా రు. జర్నలిస్టుల సొంత ఇంటి కల సాకారం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. ట్రిబుల్ లేదా డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు జర్నలిస్టుల కోసం అందిస్తా మని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో తప్పకుండా గృహ నిర్మాణ శాఖ ద్వారా మరింత సబ్సిడీ ఇస్తామన్నారు.

మీ నటన చూడలేకపోతున్నారు

- సీఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ
- కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందండి అని ముద్రగడ లేఖలో పేర్కొన్నారు

అమరావతి,సూర్యబ్యూరో: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన శుక్రవారం చంద్రబాబుకి లేఖ రాశారు. ప్రత్యేక హోదా కోసం అసెంబ్లీలో కన్నీరు కార్చింది నిజమా? లేక నటనా?. ఒకవేళ నిజమే అయితే రాజధాని పేరుతో మూడు పంటలు పండే భూములను తీసుకుని వ్యాపారం చేసినప్పుడు రైతు ల కన్నీరు కనిపించలేదా ఇచ్చిన హామీలను అమలు చేయమని రోడ్డెక్కిన మా జాతిని ఈడ్చి కొట్టినపుడు మా కన్నీరు కనిపించలేదా.మీ ఆర్భాటం కోసం గోదావరి పుష్కరాల్లో 30 మంది భక్తులను చంపి వారి కుటుంబాల కన్నీటిని గోదారిలో కలిపేశారు. 4 మీ నటన, అబద్ధాలు ప్రజలు చూడలేక పోతున్నారు. ప్రజలను ఎలా గౌరవిం చాలో మహారాష్ట్ర

కొత్త డ్రామాకు తెరలేపిన చంద్రబాబు

వైసీపీ ఎంపీ సుబ్బారెడ్డి



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ కొత్త డ్రామాకు తెర లేపారని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా పార్లమెంటులో శుక్రవారం వైఎస్ఆర్ సీపీ పార్టీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాసానికి (గురువారం) మద్దతు తెలిపిన చంద్రబాబు ఈ రోజు మాట మార్చారని ఆయన వ్యాఖ్యానించారు. నాలుగేళ్లు ఎన్డీయేలో కొనసాగుతూ చంద్రబాబు ఏం సాధించారని వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు.

శుభకామనలు నింపనున్న 'విళంబి' నామ వత్సరం

రేపు తెలుగు సంవత్సరాది ఉగాది

ఉగాదిని ఆహ్వానించడానికి ప్రకృతి తనదైన శైలిలో సిద్ధమైంది. కొత్త చిగుళ్లతో, రంగురంగుల పూలతో, పరిమళాల పన్నీరుతో యావత్ వృక్ష సంపద కనువిందు అప్పుడే మొదలైంది. ప్రతి కొమ్మకీ మామిడి తోరణాలు కడుతుంటే, మరోవైపు కోయిలలు అప్పుడే తమ కమ్మని పాటలతో వస్తున్న వసంతానికి సంకేతాలు కాగా తెలుగువారి మాత్రమే ప్రత్యేకమైన షడచుల ప్రసాదం కోసం మామిడి పిందెలు, వేపపూతలు సిద్ధం కావటంతో పచ్చని ఆహ్లాదకర వాతావరణం యావత్ ప్రాణికోటికి శుభం కోసం వచ్చేస్తున్న ఉగాది పండుగకు స్వాగతం పలుకుతోంది. అన్ని రుచులు సమానంగా ఆస్వాదించాలనీ, అన్ని అనుభవాలు కలిస్తేనే సంపూర్ణ జీవితమనే తాత్విక సందేశాన్ని మానవాళికి అందిస్తున్న ఉగాదినాడు జరిగే పంచాంగ శ్రవణంలో ఉత్కంఠ గొలిపే సంవత్సర ఫలితాలను, కందాయ ఫలాలను ముందే చెప్పడం విశేషం.

ప్రతి పండగకి వెనుక ఆంతర్యం, ఔదార్యం, ఆరోగ్యం, ఆహార్యం, ఉన్నాయి. వీటన్నింటినీ యోచించే సమయం తక్కువగా ఉంటుందేమోనని ముందే మన పెద్దలు శోధించి అందించారు. మన హైందవ ధర్మానికి పట్టుకొమ్మ లు మన సంప్రదాయాలు. ఆచారాలు. వీటిని అనుసరిస్తే ధర్మ రక్షణను మనం పొందుతాం. దానితో పాటు మనం రక్షణను పొంద గలుగుతాం. కాలగణనంలో భారతీయులే దిట్ట. సశాస్త్రీయంగా అందించిన ఘనత ఆనాడే, మన పూర్వీకులదే అని సగర్వంగా చెప్పుకోవాలి. వాటిని మనం అనుసరించడం కనీస ధర్మం. శాస్త్రీయంగా, విజ్ఞానంగా, సనాతనంగా మన దేశంలో అనూచానంగా వస్తున్న పద్ధతుల్ని వదిలేసి, ఏ మాత్రం శాస్త్రీయత లేని జనవరి పై ఎందుకో వ్యామోహాన్ని పెంచుకొన్నాం. నలుగురితో పాటు నారాయణ అన్నట్టుగా వ్యవహరిస్తున్నాం. వైజ్ఞానికంగా ప్రకృతి సహజంగా మానవాభివృద్ధికి ఆధారంగా ఉన్న మన ఉగాదిని ఆనందోత్సాహాలతో, నూతన సంవత్సరంగా వినూత్నంగా జరువుకుందాం. షడ్రుచుల మేళవింపుతో కూడిన ఉగాది పచ్చడి ఎంతమందికో కాదు అందరికీ ఆరోగ్యకరం.

ఒకప్పుడు ప్రపంచం అంతా కొత్త సంవత్సరం ఉగాది నాడు ఆరంభం అయ్యేది. ఉగాది పండుగ సందర్భంలో, మన భారతీయకాలమానంలో సూర్యోదయంతో వెలుగు రేఖలు ప్రసరించాక, వసంత ఋతువు రాకతో, క్రొత్త చివుళ్ళ చెట్లతో, కోయిల కూతలతో సహజంగా వచ్చిన మార్పుతో తేదీ మారుతుంది. కానీ ఇంగ్లీషు వత్సరాది ఆరంభంతో ఇప్పుడు వేడుకలు చేసుకుంటున్నాం. అయితే జనవరి1 న్యూ ఇయర్ కాదు. దేశ, కాల స్థితిని బట్టి అయితే జనవరి 1, డిసెంబర్ 31 నాటికి ప్రకృతిలో గాని, వాతావరణంలో గానీ, గ్రహాలస్థితిలో గానీ, భూమి గమనంలో గానీ, ఏ మార్పు ఉండదని ఇప్పటికైనా గమనించారా? సంవత్సరాది అంటే ఉగాది నాడు ప్రకృాఎతిలో కొత్త ఆకులు చిగిర్చి, కోయిల పాటతో శోభాయమానంగా ఉన్న వాతావరణంలో, కొత్త శోభతో గ్రహ గమనాల ఆధారంగా కలిగే మార్పును కొత్త సం గ భారతీయులు, భారతీయ దార్శనీకులు భావిస్తారు.

ప్రస్తుతం మనం అనుసరించే కాలెండర్ గ్రెగేరియన్ కాలెండర్. క్రీ.శ. 1582 లో పోప్ గ్రెగేరియన్ సరిచేసిన కాలెం డర్ ఇది. దీని ప్రకారం మనం యదార్థ సంవత్సరం కంటే 24.6 సెకన్ల ఎక్కువ సమయాన్ని లెక్కించు కుంటున్నాం. ఈ ప్రకారం, 3,513 ఒక రోజు ఎక్కువ వస్తుంది. ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త జాన్ వార్షల్ ఈ లోపాన్ని సవరించడానికి ఆ కాలంలోనే క్రీ.శ. 4000 లీప్ ఇయర్‌గా లెక్కించకుండా వదిలేయమన్నాడు. ఈ లోపాన్ని సరి చేయడానికి నాటి నానాజాతి సమితి (నేటి ఐక్య రాజ్య సమితి) ఏర్పరిచిన కమిటీ 1926లో నివేదిక సమర్పించినా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. బైబిలులోని ఎజ్రా పుస్తకం 10;17 వచనం: సంవత్సరంలోని మొదటి నెల మార్చి–ఏప్రిల్‌లో ఆరంభమౌతుందని తెలువుతోంది.

ఫ్రాన్స్ లో క్రీ.శ.1582 వరకు, ఇంగ్లాండ్ లో క్రీ.శ. 1752 వరకు నూతన సంవత్సరం మార్చి 25న ప్రారంభం అయ్యేదని చరిత్ర చెప్పుతోంది. కాల గమనంలో ఇది ఏప్రిల్ కి మారింది. అయితే నూతన సంవత్సరం మార్చ్ లేదా ఏప్రిల్ అన్నది సమస్యగా మారిన తరుణంలో 15వ శతాబ్దం చివరలో ఫ్రాన్స్ చక్రవర్తి ఛార్లెస్ అంతవరకు 11వ నెలగా ఉన్న జనవరిని మొదటినెలగా నూతన సంవత్సరాన్ని ఆరంభించాడు. ఇట్లా ఆరంభమైంది నేటి నూతన సంవత్సరం. అయితే దీనికి ఎటువంటి శాస్త్రీయమై, ప్రకృతిపరమైన ఆధారం లభ్యం కాదు. పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దంలో తమ అధీనంలో ఉన్న అన్ని దేశాల్లో ఆంగ్లేయులు ఈ నూతన కాలెండర్ ప్రవేశపెట్టడం, అందరూ దాన్ని అనుసరించడం జరిగింది.

అత్యంత పురాతనమైన మన భారతీయ కాలెండర్ వేదపండితులైన ఋషులచే తయారుచేయబడింది. ఆర్యభట్ట, భాస్కరాచార్య వంటి మహా శాస్త్రజ్ఞులచే పరిశోధించబడింది. కొన్ని వేల సంవత్సరాల తరువాత కూడా ఏ సంవత్సరంలో, ఈ నెలలో, ఏ రోజున, ఏ సమయంలో ఏ గ్రహణం వస్తుందో, వారం, వర్జ్యంతో సహా చెప్పగలిగేంతగా శోధించబడింది. అంతటి విజ్ఞత మనది. మన ఋషులు దార్శనికులు అంటే తపోధనంతో ఆవిష్కరించే శక్తితో అందించిన బంగారు బాటగా మన కాలగణనం ఏర్పడింది.

100 తృటికలు – 1 వేధ, 3 వేధలు – 1 లవము, 3 లవములు – 1 నిమిషం, 3 నిమిషాలు – 1 క్షణం 5 క్షణాలు – 1 కాష్ట, 15 కాష్టలు – 1 లఘువు, 15 లఘువులు – 1 నిశిర, 6 నిశిరలు – 1 ప్రహర, 4 ప్రహరలు – 1 దినం, 15 దినాలు – 1 పక్షం, 2 పక్షాలు – 1 మాసం, 2 మాసాలు – 1 ఋతువు, 3 ఋతువులు – 1 ఆయనం, 2 ఆయనాలు – 1 సంవత్సరం, 12 సంవత్సరాలు 1 పుష్కరం, 100 సంవత్సరాలు 1 శతకం. 10 శతకాలు – 1 సహస్రం, 4 సహస్రాలు – 1 యుగం, 4 యుగాలు – 1 మన్వంతరం, 100 మన్వంతరాలు 1 బ్రహ్మ దినం

అయితే దేవతల కాలప్రమాణం, మానవ కాలప్రమాణానికి 360 రెట్లు అధికంగా ఉంటుంది. అంటే మన ఒక సంవత్సర కాలం దేవతలకి ఒక పగలు + ఒక రాత్రి అన్నమాట. మన 30 సంవత్సరాల కాలం వారికి ఒక నెల. మన 360 సంవత్సరాలు వారికి ఒక (దివ్య) సంవత్సర ప్రమాణం. ఇటువంటి 12000 దివ్య సంవత్సరాలు వారికి ఒక దివ్య యుగం (మహా యుగం). ఇది మనకు ఒక చతుర్యుగ కాల సమానం.

కృత యుగం = 4800 దివ్యసంవత్సరాలు (17,28,000 మానవ సంవత్సరాలు), త్రేతాయుగం = 3600 దివ్య సంవత్సరాలు (12,96,000 మానవ సంవత్సరాలు), ద్వాపర యుగం = 2400 దివ్య సం వత్సరాలు (8,64,000 మానవ సంవత్సరాలు), కలియుగం = 1200 దివ్య సంవత్సరాలు (4,32,000 మానవ సంవత్సరాలు) మొత్తం = 12,000 దివ్య సంవత్సరాలు (43,20,000 మానవ సంవత్సరాలు). ఇవన్నీ కలిసి ఒక దివ్య యుగం (చతుర్యుగం, మహా యుగం) గా చెప్పబడుతుంది. ఇటువంటి వేయి దివ్య యుగాలు బ్రహ్మదేవునికి ఒక పగలు, బ్రహ్మ పగలు ఓ కల్పం (సర్గం) గా చెప్పబడింది. మరో వేయి దివ్య యుగాలు బ్రహ్మకు ఒక రాత్రి. ఈ రాత్రిని ప్రళయం అంటారు. అటువంటి 360 దివారాత్రులు బ్రహ్మకు ఒక సంవత్సరం. అటువంటి 100 సంవత్సరాలు బ్రహ్మ ఆయుః కాలం. ఇదీ మన కాలగణనం. ఇంత నిశితంగా ప్రపంచంలో మరెక్కడా లేదు. నానో సెకండ్స్ ని మన వాళ్ళు ఎంతగా గుణించారో కదా!

పాశ్చాత్యుల కాలెండర్లో వారాలు, తేదీలు తెలుస్తాయి. అంతేకానీ, ఏ రోజులో ఏమి చెయ్యాలి? ఎప్పుడు తెలవారుతుంది? ఎప్పుడు ఏ ఏ మార్పులు వస్తాయి (ప్రకృతి పరంగా)? మొ అంశాలు మనకు కనపడవు. కానీ మన ఉగాది కాలెండర్ అదే మన పంచాగంలో తిథి, వార, నక్షత్ర, కరణ, యోగలనే పంచ అంగాలతో, సంవత్సరం పొడవునా చేయవలిసిన పనుల వివరాలన్నీ పొందుపరచారు. చక్కగా విళంబిని అందరం ఆహ్వానిద్దాం. గొప్పగా చైత్రమాస శుద్ధపాడ్యమి రోజున మన క్రొత్త సంవత్సరాన్ని జరువు కుందాం. తస్మాత్ శాస్త్రం ప్రహంతేగా అందరం ఉగాది పచ్చడిని ఆస్వాదిద్దాం. ఆ పచ్చడి ఎట్లా చేయాలో కూడా శాస్త్రం చెప్పింది:

తద్వార్షాదౌ నింబసుమం శర్కరాంలఘృతైర్యుతం,
భక్షితాం పూర్వయా మేస్య తద్వార్షాదౌ సౌఖ్యదాయకం

ఆరోగ్యానిచ్చే వేపపూవును, బెల్లం ముక్కల్ని, చింతపండు రసంలో, మామిడి ముక్కల్ని కలిపి ఆవునేయిని మిళితం చేసి ఆస్వాదిద్దాం. దీనికి నీరును కూడా కలపాలి.
నూతన సంవత్సరంలో కొత్త మాసంలో,
వినూత్నంగా మన పనులను
ఆరంభిద్దాం. సర్వే భద్రాణి
పశ్యంతు గా అందరికీ
శుభాభినందనలు.
ఉగాది విళంబి నామ
సంవత్సర శుభాకాంక్షలు

సేకరణ: **శ్రీ వల్లి, హైదరాబాద్**

ఉగాది పచ్చడి విశిష్టత

ఉగాది పచ్చడిలో ఆరోగ్య ప్రయోజనాలు

1. పులువు... పులువు అంటే చింతపండు. ఉగాది పచ్చడిలో కొత్త చింతపండుని వేయడం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. పులువు ఆకలిని పెంచుతుంది. అరుగుదలకు తోడ్పడుతుంది. పంచేంద్రియాలను పరివుష్టి చేస్తుంది.
2. తీపి.. ఉగాది పచ్చడిలో కొత్త బెల్లాన్ని కలపడం వల్ల ఉపయోగాలు. బెల్లంలో ఉండే లోహ ధాతువులు శరీరంలోకి తేలిగ్గా విలీనం అవుతాయి. ఎండా కాలం వడదెబ్బ నుండి రక్షిస్తుంది. వాతాన్ని హరిస్తుంది. శరీరంలోని వేడిని తగ్గిస్తుంది.
3. ఉప్పు... గ్యాస్‌ని తగ్గిస్తుంది. మలబద్ధకాన్ని నిరోధిస్తుంది.
4. కారం.. పచ్చిమిర్చిని వేయడం వల్ల ఆకలిని పెంచుతుంది. ప్రేగు లోపల ఉండే వురుగులను చంవుతుంది. దురదలను తగ్గిస్తుంది.
5. చేదు.. వేప వూత ఆకలిని పెంచుతుంది. ఎండాకాలంలో వచ్చే వడదెబ్బ, జ్వరాల నుండి కాపాడుతుంది. విషానికి విరుగుడులా పనిచేస్తుంది. దప్పికను తగ్గిస్తుంది.
6. వగరు.. కొత్త మామిడికాయ వగరుగా ఉంటుంది. ఇది రక్త స్రావాన్ని తగ్గిస్తుంది. గాయాలను మాన్పుతుంది.



రెండు చేతుల్లో పది చేతుల బలాన్ని నింపుకొని సాచిపెట్టి కొట్టే సవ్యసాచి



అక్కినేని నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'సవ్యసాచి'. చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్య-చందు మొండేటి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదల చేశారు.

నిర్మాతలు వై.నవీన్-వై.రవిశంకర్-మోహన్ (సివిఎం) మాట్లాడుతూ.. 'తన రెండు చేతులను సమర్ధవంతంగా వినియోగించగల అర్జునుడిని 'సవ్యసాచి' అంటారు. టైటిల్‌కి తగ్గట్లుగానే నాగచైతన్య క్యారెక్టరైజేషన్ ఉండబోతోంది. నాగచైతన్య మాస్ అప్పీల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నాగచైతన్య సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. ఇండియా షూటింగ్ ఫినిష్ అయ్యాక అమెరికా వెళ్లనున్నాం. జూన్ 14న చిత్రాన్ని విడుదల చేయనున్నాం. కీరవాణి 'బాహుబలి' తర్వాత సంగీతం సమకూరుస్తున్న చిత్రం 'సవ్యసాచి' కావడం విశేషం' అన్నారు!!

వంకలు పెట్టడంతో.. గోరొంకగా మారిన గొల్లభామ



రంగస్థలం'లో ఎంత సక్కగున్నావే పాటలో 'గొల్లభామ' పదప్రయోగంపై గొల్లలు (యాదవులు) అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. 'గొల్లభామ'ను 'గోరువంక'తో భర్తీ చేశారు. 'గొల్లభామ' అంటే గొల్ల కన్య అనే అర్ధం మాత్రమే కాదని గీత రచయిత చంద్రబోస్ చెప్పినప్పటికీ సదరు కమ్యూనిటీ వాళ్ళు ఒప్పుకోకపోవడంతో ఈ మార్పు అనివార్యం అయ్యింది. ఆ మధ్య 'దువ్వాడ జగన్నాధం' చిత్రంలోని 'అస్మైక యోగ.. తస్మైక భోగ' పాటలోని ఒక పదంపై కూడా ఇలాంటి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. మార్పులు చేసిన విషయం తెలిసిందే!!

మంచు విష్ణు వినోద యాత్ర మొదలు కానుంది



విష్ణు మంచు నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఈ చిత్రానికి జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకుడు. విష్ణు సరసన ప్రజ్ఞ జైస్వాల్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని కీర్తి చౌదరి మరియు కిట్టు 'పద్మజ పిక్చర్స్' బ్యానర్‌పై నిర్మించగా యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు. అమెరికా, మలేషియామరియు హైదరాబాద్‌లలో షూ టింగ్ జరుపుకున్న 'ఆచారి అమెరికా యాత్ర' మంచు విష్ణు ఫ్యాన్స్‌ని అమితంగా అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు!!

సుకుమార్ రైటింగ్.. ఆది పినిశెట్టి ఫైటింగ్




సుకుమార్ రైటింగ్స్ పేరుతో బ్యానర్ స్టార్ట్ చేసి 'కుమారి 21ఎఫ్, దర్శకుడు' వంటి చిత్రాలు నిర్మించిన ప్రముఖ దర్శకుడు సుకుమార్ త్వరలో మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని తెలుస్తోంది. సుకుమార్ దర్శకత్వం వహస్తున్న 'రంగస్థలం' మార్చ్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల కోసం ఏప్రిల్‌లో రెండు మూడు వారాలు కేటాయించిన సుకుమార్, ఆ తర్వాత తను తదుపరి నిర్మించే చిత్రంపై దృష్టి పెట్టనున్నాడని సమాచారం అందుతోంది.

నవదీప్‌తో 'భమ్ భోలేనాథ్' చిత్రం రూపొందించిన కార్తీక్ వర్మ వినిపించిన స్టోరీ సుకుమార్‌కి విపరీతంగా నచ్చిందని, తెలుగుతోపాటు, తమిళంలోనూ ఏక కాలంలో ద్విభాషా చిత్రంగా తెరకెక్కే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఆది పినిశెట్టిని హీరోగా ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం యాక్షన్ సినిమాలకు హిందీలో మంచి మార్కెట్ ఉండడంతో ఈ సినిమాలో యాక్షన్ దండిగా దట్టిస్తున్నారని సమాచారం!!



బాబాయ్ స్పీచ్ సూపరంటున్న అబ్బాయ్

మార్చ్ 14, గుంటూరులో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో పవన్‌కళ్యాణ్ చేసిన ప్రసంగంపై మిశ్రమ స్పందన వెలువడుతుండడం తెలిసిందే. పవన్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటుంటే.. పవన్ పొడ గిట్టనివాళ్ళు మాత్రం 'అదొక దండగమారి ప్రసంగం' అంటున్నారు!



తెరాస పనితీరు సూపర్ అంటూ.. కేసీయార్‌పై ప్ర శంసల వర్షం కురిపిం చారని కూడా చూడ కుండా.. పవన్ ప్రసంగం బ్రహ్మానందం కామెడీ షోలా ఉందని ఎంపీ కవిత విమర్శించారు. ఇక టీడీపీ వాళ్ళు సరే.. పవన్ మద్దతు ఇవ్వడం వల్లే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగామన్న విష యాన్ని విస్మరించి మరీ పవన్‌పై నిప్పులు చెరుగుతున్నారు. అయితే.. తన బాబాయ్ స్పీచ్ సూపర్‌గా ఉందంటూ రామ్ చరణ్ మెచ్చుకోవడం అభిమాను లకు ఎక్కడలేని ఆనం దాన్నిస్తోంది. చరణ్ ప్రశంస పరోక్షంగా చిరంజీవి ప్రశంస వంటిదని సైతం వారు విశ్లేషిస్తున్నారు!



ఆపరేషన్ సక్సెస్.. హీరోయిన్ ఫెయిల్



ఆపరేషన్ విజయవంత మయ్యింది. పేషంట్‌కి మాత్రం నూకలు చెల్లిపోయాయి' అన్నట్లుగా ఉంది ఇలియానా పరిస్థితి. ఈ గోవా బ్యూటీ నటించిన 'రైడ్' చిత్రానికి మంచి స్పందన వస్తోంది. హీరో అజయ్ దేవగన్ అదరగొట్టాడు అంటున్నారు. డైరెక్టర్ మామూలుగా తీయలేదంటున్నారు. కానీ.. హీరోయిన్ విషయానికొచ్చేసరికి మాత్రం అత్తెసరు మార్కులేస్తున్నారు.

కంప్లీట్ సీరియస్‌నెస్‌తో సాగే ఈ సినిమాకి పాటలే మైనస్ అనే ఫీడ్ బ్యాక్ వస్తుండడంతో.. ఆ పాటల్లో ఇలియానా ఆరబోసిన అందాలన్నీ వృధా అయిపోతున్నాయి. అజయ్ దేవగన్ సిన్సియర్ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా నటించిన 'రైడ్' చిత్రంలో ఇలియానా అతని భార్యగా నటించింది.

అత్యంత అవినీతిపరుడైన రాజకీయవేత్తతో అజయ్ ఢీకొనే సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయని.. అయితే అజయ్-ఇలియానాల మధ్య వచ్చే రొమాంటిక్ సీన్స్, సాంగ్స్ కథనానికి ఆటంకంగా మారాయని విశ్లేషకులు అభిప్రాయపడుతుండడంతో ఇలియానా ఒక రేంజ్‌లో బాధపడిపోతోందని తెలుస్తోంది. గతంలోనూ హిందీలో ఇలియానా నటించిన కొన్ని సినిమాలు హిట్టయ్యాయి. అప్పుడు కూడా అంతే. ఇలియానాకు మాత్రం రావాల్సిన గుర్తింపు రాలేదు. ఇప్పుడు 'రైడ్' సినిమాకి కూడా ఇలాగే జరుగుతుండడం ఇలియానా ఫ్యాన్స్‌కి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది!!

ఓ చెలియా.. మా ప్రియ సఖియా!



మణిరత్నం దర్శకత్వం వహించగా తెలుగులో 'చెలియా' పేరుతో విడుదలైన చిత్రంతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన అదితికి కమర్షియల్‌గా సక్సెస్ రాకపోయినా.. ఫ్యాన్స్ మాత్రం బీభత్సంగా ఏర్పడ్డారు. రవివర్మ సినిమాటోగ్రఫిలో బంధించబడ్డ ఆమె అందాలకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఈ భామకు తెలుగులో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తమిళ్, హిందీ ప్రేక్షకులకు కూడా ఈ అమ్మడు ఎంతో కొంత పరిచితురాలు కావడం అందుకు మరో కారణంగా చెప్పొచ్చు.

ప్రస్తుతం తెలుగులో సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' చేస్తున్న అదితి హైదరీ.. వరుణ్‌తేజ్‌తో క్రిష్ నిర్మించే చిత్రంలోనూ హీరోయిన్‌గా ఎంపికయ్యిందని తెలుస్తోంది. 'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం అంతరిక్షం నేపథ్యంలో తెరకెక్కనుందన్న విషయం తెలిసిందే!!

చిచ్చరపిడుగు చిరుతేజ్ సింగ్ బయోపిక్



నిర్మాత ఎస్.ఎస్.నాయక్ సహాయస హకారాలతో అవార్డ్ విన్నింగ్ లఘు చిత్రాల దర్శకులు డా.ఆనంద్ కుమార్ దర్శకత్వంలో.. తన అద్భుత మేధాశక్తితో ప్రపంచ రికార్డును నెలకొల్పిన గిరిజన బాలిక చిరుతేజ్‌సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన బాలల చిత్రం చిరుతేజ్ సింగ్. ఫ్యాషన్ డిజైనర్ ఫేమ్ మనాలి రాథోడ్, కాటమరాయుడు ఫేమ్ సౌమ్య వేణుగోపాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కేవలం 3 నిమిషాల వ్యవధిలో 236 ప్రపంచ పటాలను గుర్తించి, బాల మేధావిగా ఎన్నో పతకాలను, ప్రశంసలను సొంతం చేసుకొని తెలుగు జాతి, మరియు భారతదేశ ప్రతిష్టను పెంచిన చిరుతేజ్ సింగ్ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తల్లీకూతుళ్ల మధ్య ప్రేమ, టీచర్ స్టూడెంట్ మధ్య మనసుకు హత్తుకునే సన్నివేశాలతో ఎంతోమంది చిన్నారులకు ప్రేరణ కలిగించేలా రూపొందించబడిన ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా అనాధ పిల్లకోసం అన్నపూర్ణ స్టూడియో ప్రివ్యూ థియేటర్‌లో వేయడం జరిగింది. వీరితోపాటు సమంత అక్కినేని, డైరెక్టర్ వీరశంకర్, నిర్మాత శ్రీ రాజ్ కందుకూరి, దర్శకులు మధుర శ్రీధర్, సంగీత దర్శకులు రఘు కుంచె, యువ హీరో అభిజిత్, యువ దర్శకులు సాగర్ చంద్ర , యువ నటి సీత నారాయణ్ తదితర ప్రముఖులు ఈ చిత్రాన్ని వీక్షించి ప్రశంసించడం ఎంతో సంతోషాన్నిస్తోందని చిత్రబృందం చెబుతోంది!!



బొద్దుగుమ్మ సన్నజాజిలా అయిపోయింది!

అచ్చ తెలుగమ్మాయి అంజలిని ఇంతకుముందులా 'బొద్దుగుమ్మ' అనడానికి వీల్లేదిప్పుడు. తన గురించి మీడియా వాళ్ళు రాసే ప్రతిసారి 'బొద్దుగుమ్మ' అనే ప్రస్తావిస్తుండడం ఈ అమలాపురం అమ్మాయికి అంతగా నచ్చలేదనుకుంటా. అందుకే కడుపు మాడ్చుకొని, ఒంటిని విపరీతంగా కష్టపెట్టుకొని మరీ జీరో సైజ్ సొంతం చేసేసుకుంది. ఒంటిలో అదనంగా చేరిపోయిన కేలరీలన్నీ కరిగించేసుకుని మెరుపుతీగలా మారిపోయిన తన స్టైల్‌ని సోషల్ మీడియాకి వదిలి.. దానికి వస్తున్న రెస్పాన్స్‌ని ఎంజాయ్ చేస్తున్నదని సమాచారం.

ప్రస్తుతం అంజలి నటిస్తున్న తెలుగు సినిమాలేవీ లేకపోయినా.. తమిళంలో మాత్రం ఈ అమ్మాయి ఫుల్ జిజీగా ఉంది. అక్కడ ఆమె నటించిన 'తారామణి, బెలూన్' చిత్రాలు తెలుగులో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి!!



12 ఏళ్లలోపు బాలికలపై అత్యాచారం చేస్తే ఉరిశిక్ష

- చట్టాన్ని ఆమోదించిన హర్యానా అసెంబ్లీ
- బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం
- బాలికలను కాపాడుకునేందుకు ఈ చట్టం ఉపకరిస్తుందన్న సీఎం
- రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లోనూ ఈ తరహా చట్టం

చండీగఢ్ : బాలికలపై అత్యాచార ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో హర్యానా ఈ విషయమై గట్టి నిర్ణయం తీసుకుంది. 12 ఏళ్లు, ఆలోపు వయసున్న బాలికలపై అత్యాచారానికి పాల్పడితే నిందితులను ఉరి తీసే బిల్లుకు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. చిన్నారి బాలికలను కాపాడుకునేందుకు ఈ చట్టం ఓ మైలురాయి అవుతుందని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. బాలికలపై అత్యాచారం చేసినవారికి మరణ దండనే సరైనదని, ఇందుకు సంబంధించి చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లోగడే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఐపీసీలోని పలు సెక్షన్లను సవరించాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరిలో బాలికలపై అత్యాచార ఘటనలు వరుసగా ఐదు వెలుగు చూడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అడుగులు వేసింది. రాజస్థాన్, మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇదే తరహా చట్టాన్ని గత ఏడాది ఆమోదించిన విషయం విదితమే.

అవిశ్వాసం నిలబడేనా?

- లోక్ సభలో తాజా బలాబలాలివి
- కేంద్రంపై అవిశ్వాస తీర్మానం
- చర్చ జరగాలని కోరుకుంటున్న టీడీపీ, వైసీపీ
- ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం లేదు
- అభిప్రాయపడుతున్న రాజకీయ విశ్లేషకులు
- 50 మంది ఎంపీల మద్దతు ఉంటే చాలు
- ఆ మేరకు మద్దతు కూడా ఉంది
- అయినా స్పీకర్ పరిశీలించలేదు





న్యూఢిల్లీ : కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తుందా? ఎన్ని పార్టీలు మద్దతు ఇస్తాయి? ప్రభుత్వంపై ఏ మేరకు ఒత్తిడి వస్తుంది? అన్న అంశాలపై ప్రస్తుతం చర్చ సాగుతోంది. ఈ అవిశ్వాసంతో లోక్ సభలో పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీకి ఎటువంటి నష్టమూ కలుగకున్నా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై జాతీయ స్థాయిలో ఎలుగెత్తి చాటేందుకు దీనిని వినియోగించుకోవాలని వైసీపీ భావిస్తోంది. ఇదే సమయంలో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగు దేశం పార్టీ కూటమి నుంచి వైదొలగి, తమంతట తాముగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించుకుంది. తాజా పరిణామాలు ఆసక్తికరంగా మారగా, లోక్ సభలో ప్రస్తుత బలాబలాలను ఒక్కసారి పరిశీలిస్తే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 331 మంది సభ్యుల బలం ఉంది. బీజేపీ 273, శివసేన 18, టీడీపీ 16, ఎల్జేపీ 6, ఎస్ఏడీ 4, ఆర్ఎల్ఎస్పీ 3, ఏడీ 2, జేడీ (యూ) 2, నామినేటెడ్ సభ్యులు ఇద్దరితో పాటు, జేకే పీడీపీ, ఏఐఎన్ఆర్సీ, ఎన్పీపీ, పీఎంకే, ఎస్డీఎఫ్ పార్టీల నుంచి ఒక్కొక్కరితో పాటు అవసరమైతే స్పీకర్ మద్దతు ఆ పార్టీకి ఉంది. ఇక ప్రతిపక్ష యూపీఏకు 52 మంది సభ్యుల బలం ఉండగా, అందులో కాంగ్రెస్ 48, ఐయూఎంఎల్ 2, కేసీ (ఎం) 1, ఆర్ఎస్పీ 1 ఉన్నారు. జనతా పరివార్ కూటమికి ఏడుగురు సభ్యుల బలం ఉండగా, ఆర్జేడీ 3, ఐఎన్ఎల్డీ 2, జేడీ (ఎస్) 2 ఉన్నారు. ఇక ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోని పార్టీల నుంచి 147 మంది ఎంపీలు లోక్ సభలో సభ్యులుగా ఉన్నారు. వారిలో అన్నా డీఎంకే 37, తృణమూల్ 34, బీజేడీ 20, టీఆర్ఎస్ 11, సీపీఐ (ఎం) 9, వైఎస్ఆర్‌సీపీ 9 (నలుగురు టీడీపీలో చేరినా వారి రాజీనామాలు ఆమోదం పొందలేదు కాబట్టి సాంకేతికంగా వైసీపీ సభ్యుల కిందే లెక్క), ఎస్పీ 7, ఎన్సీపీ 6, ఆప్ 4, ఏఐయూడీఎఫ్ 3, జేఎంఎం 2తో పాటు ఏఐఎంఐఎం, సీపీఐ, జేకేఎన్సీ, ఎస్‌డబ్ల్యూపీ, జేఏపీ (ఎల్)లకు తలో సభ్యుడు ఉన్నారు. ఇతరులు ముగ్గురు ఉండగా, ఐదు ఖాళీలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలుగు దేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వెళ్లినా ఎన్డీయేకు 315 మంది సభ్యుల బలం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీని అధికారానికి దూరం చేసే పరిస్థితి ఎంత మాత్రమూ ఉండదు.

2019 ఎన్నికల్లో బీజేపీ నంబర్ 100-110 దగ్గరే ఆగిపోతుంది

- శివసేన జోస్యం
- యూపీలో ఏడాది క్రితమే ఘన విజయం
- ఇంతలోనే వారి కోటకు బీటలు పడ్డాయేమి?
- ప్రజలు అన్నీ చూస్తున్నారని వ్యాఖ్య



ముంబయి : ఎన్డీయే మాజీ మిత్ర పక్షం శివసేన మరోసారి బీజేపీపై నిప్పులు చెరిగింది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సీట్ల సంఖ్య 100-110 దగ్గరే ఆగిపోతుందని పేర్కొంది. ఈ మేరకు పార్టీ పత్రిక 'సామ్నా'లో సంపాదకీయాన్ని ప్రచురించింది. బీజేపీకి కంచుకోట అయిన రెండు చోట్ల గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్ సభ స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ గెలవడం చిన్న రాష్ట్రం త్రిపురలో విజయోత్సవ సంబరాలను జరుపుకుంటున్న ఆ పార్టీలో భయానికి దారి తీసిందని పేర్కొంది. 'ఏడాది క్రితమే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. మరి అంతలోనే వారి కోటకు బీటలు పడ్డాయేమి' అని ప్రశ్నించింది. '2014లో ప్రచార హోరు సామాన్య ప్రజల కళ్లు, చెవులను కప్పేసింది. దాంతో బీజేపీ విజయం సాధ్యమైంది. కానీ, ఇప్పుడు అదంతా కరిగిపోయింది. ప్రజలు ప్రతిదీ స్పష్టంగా చూస్తున్నారు' అని సంపాదకీయంలో పేర్కొంది.

మెజారిటీ ఉన్నా అవిశ్వాస తీర్మానంపై బీజేపీకి భయమెందుకు?: శశి థరూర్



టీడీపీ, వైసీపీ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చినప్పటికీ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం సభ ఆర్డర్‌లో లేదంటూ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సభను వాయిదా వేసిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ నేత శశి థరూర్ స్పందించారు. ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించా లంటే అందుకు మద్దతుగా 50 మంది ఎంపీలు నిలబడాలి. ప్రస్తుత అవిశ్వాస తీర్మా నానికి 50 మంది మద్దతు ఉంది. అయినా స్పీకర్ సభ నియంత్రణలో లేనందున దీనిని పరిశీలించలేమని అన్నారు. 'దీంతో నేను ఒకటి అడగదలుచుకున్నా. ప్రభుత్వానికి ఎందుకు భయం? లోక్ సభలో వారికి పూర్తి మెజారిటీ ఉంది కదా' అని పార్లమెంటు వెలుపల ఏఎన్ఐ మీడియా సంస్థతో థరూర్ అన్నారు. టీడీపీ, వైసీపీతో పాటు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సైతం మోడీ సర్కార్‌పై అవిశ్వాసానికి మద్దతు పలికిన విషయం తెలిసిందే.

గెలవబోతున్నా



రిషికేష్ : రాజకీయ నాయకుడిగా సరికొత్త పాత్రను పోషించనున్న తాను ఈ రంగంలోనూ విజయం సాధించగలనని నమ్ముతున్నట్టు దక్షిణాది సూపర్ స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రజలు తనపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, త్యాగాలు చేయడం ద్వారా వారి కోరికలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఇటీవల ఆధ్యాత్మిక పర్యటన నిమిత్తం హిమాలయాలకు వెళ్లిన రజనీ రిషికేష్‌లోని ధ్యానానంద సరస్వతి ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఆపై ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎలాంటి కట్టుబాట్లు లేకుండా ప్రజలతో మమేకమై తిరుగుతూ మనిషిగా తనను తాను తెలుసుకోవడం కోసం హిమాలయాలకు వస్తుంటానని ఆయన చెప్పారు. ఇక్కడి ప్రకృతి, ప్రజలు తనకు చాలని, రాజకీయాలు, సినీ రంగంలోని వారిని ఇక్కడ ఉన్నంత కాలం మరచిపోతుంటానని అన్నారు. ఇప్పటి వరకూ సాధారణ వ్యక్తిలా వచ్చి ఈ ప్రాంతంలో తిరిగే వాడినని, ఇకపై అలా తిరగలేనేమోనని అన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఇక్కడ తిరిగినంత స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు ఉండవని రజనీకాంత్ స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ బలహీనం అవుతున్నారు : ఆప్ నేత



చండీగఢ్ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అకాలీ దళ్ నేతకు క్షమాపణలు చెప్పడాన్ని పంజాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ శాఖ ఖండించింది. ఈ చర్యతో కేజ్రీవాల్ బలహీనుడయ్యారని ఆ రాష్ట్ర ఆప్ అధికారి ప్రతినిధి సుఖ్‌పాల్ సింగ్ ఖైరా అభిప్రాయపడ్డారు. ఖైరా శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, 'అకాలీ దళ్ నేత బిక్రం సింగ్ మజితియాను కేజ్రీవాల్ క్షమాపణలు కోరడాన్ని పంజాబ్ ఆప్ శాఖ తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్ర నేతలను సంప్రదించకుండా కేజ్రీవాల్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్యతో ఆయన మరింత బలహీనమయ్యారు. అంతే కాకుండా ఆకాలీ దళ్ నేతలకు ప్రశ్నలతో ఎదురు దాడి చేసే అవకాశం ఇచ్చారు. మాకు పంజాబ్ ప్రజల శ్రేయస్సే ముఖ్యం' అని పేర్కొన్నారు. బిక్రం సింగ్ మజితియాపై వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ టాస్క్ ఫోర్స్ హైకోర్టుకు పక్కా ఆధారాలను సమర్పించిందని ఖైరా తెలియజేస్తూ, అయినా కేజ్రీవాల్ క్షమాపణలు తెలపడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే పంజాబ్ ఆప్ పార్టీ చీఫ్, ఎంపీ భగవంత్ మాన్ బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఇక డ్రగ్స్ మాఫియాలో అకాలీ దళ్ నేత బిక్రం సింగ్ మజితియా హస్తం ఉందని ఆరోపణలు చేసిన కేజ్రీవాల్ పరువు నష్టం దావా నేపథ్యంలో ఆయనకు క్షమాపణలు తెలుపుతూ లేఖ రాసారు. దీనిపై పంజాబ్ ఆప్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పంజాబ్ మంత్రికి క్షమాపణలు చెప్పిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

- తొలి సీఎంగా రికార్డు
- డ్రగ్స్ వ్యాపారంలో పంజాబ్ మంత్రి హస్తం ఉందని కేజ్రీవాల్ ఆరోపణలు
- పరువునష్టం దావా వేసిన మంత్రి బిక్రమ్ సింగ్
- తన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణలు కోరిన ఢిల్లీ సీఎం



న్యూఢిల్లీ : పంజాబ్ మంత్రి, శిరోమణి అకాలీ దళ్ నేత బిక్రమ్ సింగ్ మజీథియాపై తాను చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పారు. ఇందుకు సంబంధించిన లేఖను కోర్టుకు అందజేశారు. డ్రగ్స్ వ్యాపారంలో మంత్రి హస్తం ఉందని కేజ్రీవాల్, ఆప్ నేత (ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు) సంజయ్ సింగ్, ఆశిష్ ఖేతన్ ఆరోపించారు. తప్పుడు ఆరోపణలతో తన పరువును తీశారని ఆరోపిస్తూ 2016 మే 20న కేజ్రీవాల్, సంజయ్ సింగ్, ఆశిష్ ఖేతన్‌లపై కోర్టులో పరువునష్టం దావా వేశారు. ప్రస్తుతం అమృత్‌సర్ కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉంది. తాజాగా కేజ్రీవాల్ తన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పడంతో మజీథియా ఈ కేసును ఉపసంహరించుకోనున్నారు. కేజ్రీవాల్ క్షమాపణలపై మజీథియా మాట్లాడుతూ, కేజ్రీవాల్ ఆరోపణలతో చిత్రహింసలు అనుభవించినట్టు చెప్పారు. అయితే, తనపై వచ్చిన అన్ని ఆరోపణలను ఎదుర్కొన్నట్టు చెప్పారు. తాను చేసిన పొరపాటు ఆరోపణలకు సీఎం క్షమాపణలు చెప్పడం చరిత్రలోనే ఇది తొలిసారి అని అన్నారు. కేజ్రీవాల్, ఆశిష్ ఖేతన్ క్షమాపణలు చెప్పడంతో కేసును ఉపసంహరించాల్సిందిగా తన న్యాయవాదులను కోరినట్టు మజీథియా తెలిపారు. కోర్టుకు సమర్పించిన క్షమాపణల లేఖలో కేజ్రీవాల్ తన తప్పు అంగీకరించారు. అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలు రాజకీయ అంశంగా మారిందని, అయితే, ఆ ఆరోపణలు నిజం కాదని తేలిందని పేర్కొన్నారు. ఇకపై ఈ విషయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. గతంలో మంత్రిపై చేసిన ఆరోపణలపై భేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్టు పేర్కొన్నారు. తన ఆరోపణలతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు నొచ్చుకుని ఉంటే క్షమించాల్సిందిగా కేజ్రీవాల్ కోరారు.



విడిపోతున్న ట్రంప్ జూనియర్ దంపతులు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌తో తన 12 ఏళ్ల వైవాహిక బంధాన్ని ఆయన భార్య వెనీసా ట్రంప్ తెంచుకోనున్నారు. మాజీ మోడల్ అయిన వెనీసా భర్త నుంచి విడాకులు కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్ర యించారు. తామిద్దరం విడిపోతున్నట్టు ప్రకటించిన జూనియర్ ట్రంప్, వెనీసా విడిపోయినా ఒకరిని ఒకరం గౌరవించుకుంటామని పేర్కొన్నారు. జూనియర్ ట్రంప్ (40), వెనీసా (40)లు 2005లో వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. ట్రంప్ ఆర్గనైజేషన్స్‌లో ఎగ్జిక్యూటివ్ అయిన జూనియర్ ట్రంప్ ఓ ప్రకటన విడుదల చేస్తూ, తమ వివాహమై 12 ఏళ్లు గడిచాయని, ఇప్పుడు తామిద్దరం విడిపోవాలని నిర్ణయించుకున్నామని తెలియజేశారు. తమకు ఐదుగురు అందమైన పిల్లలు ఉన్నారని, వారికి తామిచ్చే ప్రాధాన్యం ఎప్పటికీ అలాగే ఉంటుందని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్-రష్యా సంబంధాలపై ప్రత్యేక న్యాయవాదుల బృందం దర్యాప్తు ప్రారం భించిన తరుణంలో విడాకుల వ్యవహారం తెరపైకి రావడం చర్చనీయమైంది. 2016లో ట్రంప్ టవర్‌లో జరిగిన సమావేశంలో రష్యా లాయర్, ట్రంప్ ప్రచార ముఖ్యులు పాల్గొన్నారు. తన రాజకీయ ప్రత్యర్థి అయిన హిల్లరీ క్లింటన్‌పై బురద చల్లాలని ఆ సమావేశంలో నిర్ణయించినట్టు జూనియర్ ట్రంప్ ఇ-మెయిల్స్ ద్వారా వెల్లడైంది. ట్రంప్ ఎన్నికల ప్రచారంలో జూనియర్ ట్రంప్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ప్రధాని నరేంద్ర మోడీకి దెబ్బ మీద దెబ్బ



పాట్నా : తమకు అడ్డే లేదన్నట్టుగా ముందుకు సాగుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఇంత వరకు మోడీ ప్రభు త్వానికి బలమైన మిత్ర పక్షంగా ఉన్న తెలుగు దేశం పార్టీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు కూడా ఇదే విష యాన్ని బాబె స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీహార్‌కు కూడా ప్రత్యేక హోదా ఇస్తామని గతంలో ప్రకటించి, ఇంత వరకు ఇవ్వకపోవడంతో నితీష్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని ఇటీవలి కాలంలో ఆయన పలు మార్లు కోరారు. ఈ నేపథ్యంలో, ఇకపై స్పెషల్ స్టేటస్ డిమాండ్‌ను ఉద్ధృతంగా ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని జేడీయూ నేత కేసీ త్యాగి వెల్లడించారు. గత వారం బీహార్ అసెంబ్లీలో ఆర్జేడీ ఎమ్మెల్యే తేజస్వి యాదవ్ మాట్లాడుతూ నితీష్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీతో చేతులు కలిపిన వెంటనే,ప్రత్యేక హోదాను నితీష్ పక్కన పెట్టారని విమర్శించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేయక తప్పదనే నిర్ణయానికి నితీష్ వచ్చారు. ప్రస్తుతం జేడీయూ కూడా ఎన్డీయే కూటమిలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

జాతీయ గీతంలో ఆ పదాన్ని తొలగించండి

న్యూఢిల్లీ: జాతీయ గీతంలో 'సింధ్' అనే పదాన్ని తొలగించాలని, ఆ పదం సానంలో 'ఈశాన్య (నార్త్ ఈస్ట్)'ను చేర్చాలనే తీర్మానాన్ని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రిపున్ బోరా ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సింధ్ అనే ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లోఉందని తెలిపారు. భారత్‌లో అంతర్భాగమైన,అత్యంత ముఖ్యమైన ఈశాన్య రాష్ట్రాలకు జాతీయ గీతంలో స్థానం లేకపోవడం దారుణమని అన్నారు. జాతీయ గీతంలో ఉన్న సింధ్ అనే పదాన్ని తొలగించి, ఈశాన్య రాష్ట్రాల పేరును చేర్చేలా సవరణ చేయాలని కోరారు.

28 ఏళ్ల బచ్చాను.. నితీశ్ దుమ్ము దులిపా!



- ఎన్నికల చాలెంజ్‌ను గుర్తు చేసిన తేజస్వీ యాదవ్
- విజయోత్సవాలు చేసుకునే తీరిక లేదు
- ఎన్డీఏ నుంచి ఎప్పుడు వైదొలగుతారు?
- సీఎం నితీశ్‌కు మాజీ మంత్రి తేజస్వీ సూటి ప్రశ్న



పాట్నా : బీహార్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఓ లోక్‌సభ స్థానాన్ని, ఓ అసెంబ్లీ సీటును ఆర్జేడీ సొంతం చేసుకుంది. ఓ స్థానంలో మాత్రం బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గెలుపొందారు. అయితే, ఎన్నికలకు ముందు తాను ఏం చెప్పానో గుర్తు చేసుకోవాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఆర్జేడీ నేత, మాజీ మంత్రి తేజస్వీ యాదవ్ సూచించారు. ఉప ఎన్నికల విజయాన్ని ఆస్వాదించే సమయం తన వద్ద లేదని రైతులు, రాష్ట్రంలో ఎన్నో సమస్యలపై పోరాడాల్సి ఉందన్నారు తేజస్వీ. తాను 28 ఏళ్ల బచ్చానని, చాచా (నితీశ్) మీరు 67 ఏళ్ల వ్యక్తి అయినా ఎన్నికల్లో సత్తా చాటి చూపిస్తానని సీఎం నితీశ్‌కు వారం రోజుల ముందే చెప్పానన్నారు తేజస్వీ. బీహార్ మాజీ సీఎం, తేజస్వీ తండ్రి లాలు ప్రసాద్ యాదవ్ జైలుకు వెళ్లిన తరువాత జరిగే ఎన్నికల్లో తామే విజయం సాధిస్తామని జేడీయూ చీఫ్, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ధీమాగా ఉన్నారు. కానీ ఉప ఎన్నికల ఫలితాల తరువాత నితీశ్ వెనుకంజ వేస్తున్నారని ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని తేజస్వీ అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో బీజేపీ బీహార్ రైతులకు ఇచ్చిన ఇచ్చిన హామీల అమలుపై పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. ఎన్డీయేతర పార్టీల సీనియర్ నేతలు చర్చించుకుని 2019 ఎన్నికలకు ఇప్పట నుంచే వ్యూ హాలు రచించాలని లాలు తనయుడు ఆకాంక్షించారు. 'ఎన్డీఏ కూటమి నుంచి ఇప్పుడు టీడీపీ వైదొలగింది. నితీశ్ ఇంకా ఏ విషయమూ తేల్చుకోలేకపోతు న్నారు. మహా కూటమి నుంచి బయటకు వచ్చి బీజేపీతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నితీశ్ తప్పిదం చేశారు. టీడీపీ బాటలో పయనించి మీరు ఎన్డీఏ నుంచి ఎప్పుడు బయటకు వస్తారో చెప్పాలి' అని నితీశ్‌ను తేజస్వీ ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు ఎన్డీఏ నుంచి వైదొలగే అంశంపై కామెంట్ చేసేంత వరకూ తాను ప్రశ్నిస్తూనే ఉంటానని తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు.

కర్నాటకలో ప్రత్యేక మతం సెగలు



బెంగళూరు : కర్నాటకలో లింగాయత్ ప్రత్యేక మతం అంశం రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. రాష్ట్ర రాజకీయాలను శాసించగలిగే స్థాయిలో ఉండే లింగాయత్ కులాన్ని ప్రత్యేక మతంగా చేయాలని కొందరు, చేయకూడదని మరికొందరు పట్టుబట్టుతున్నారు. ఈ విషయంలో మంత్రులు, స్వామీజీలు, మఠాధిపతులు కూడా రెండు వర్గాలుగా చీలిపోయారు. లింగాయత్‌లకు ప్రత్యేక మతానికి సంబంధించి నాగమోహన్ దాస్ నివేదికను అమలు చేయాలనుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలను చేపడతామని బాగల్‌కోటెలోని విరక్తి మఠాధీశుడు చంద్రశేఖర శివాచార్య స్వామీజీ సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. మరో వైపు, లింగాయత్‌లకు చెందిన స్వామీజీలు కూడా రెండు వర్గాలుగా చీలిపోవడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ అంశం రోజురోజుకూ తీవ్రతరం అవుతోంది. ఈ నేపథ్యంలో, సిద్ధరామయ్య ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎలాంటి నిర్ణయాలూ తీసుకోకుండా, ప్రకటనలూచేయకుండా సంయమనం పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంత్రివర్గ సమావేశాన్ని సైతం ఆయన వాయిదా వేశారు.

ఏపీకి ప్రత్యేక హొదా ఎన్నికల ముందు డిమాండా?



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌తో పాటు, దక్షిణాది పట్ల బీజేపీ ఉత్తరాది నేతలు మరోసారి చులకన భావాన్ని చాటుకున్నారు. ఇందుకు బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ వ్యాఖ్యలే నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇస్తామని రాష్ట్ర విభజన సమయంలోనే అప్పటి యూపీఏ సర్కార్ పేర్కొంది. బీజేపీ కూడా ఎన్నికల ముందు ఇదే హామీ ఇచ్చి తరువాత కేంద్రంలో కొలువు తీరింది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి నిలువునా వంచించిన మోడీ సర్కార్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి సిద్ధమైన విషయం తెలిసిందే. రాష్ట్రానికి హోదా కోసం ఎవరికైనా మద్దతు ఇస్తామంటూ టీడీపీ కూడా అవిశ్వాసానికి ఓకే చెప్పింది. కాంగ్రెస్ కూడా మద్దతు పలికింది. మరిన్ని పక్షాలు కలసి రానున్నాయి. దీనిపై కేంద్ర మంత్రి నఖ్వీని మీడియా ప్రశ్నించగా, 'పార్లమెంటులో ఏమి జరుగుతుందో, ఏ పార్టీ ఏ మార్గాన్ని ఎంచుకుంటుందో చూద్దాం. ఏదైనా ఇది ఎన్నికల ఏడాది. కనుక ప్రతి రాష్ట్రానికి డిమాండ్లు, అంశాలు ఉంటాయి. వాటిపై మాట్లాడడం సరి కాదు. ఇది ఒక ఆచారం. ఎన్నికల ముందు పార్లమెంటులో రిహార్సల్స్ జరుగుతుంటాయి' అని ఆయన సమాధానం ఇచ్చారు.

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లోని అరారియా పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలతో వేడి పుట్టించారు. అరారియా నిండా ముస్లింలే ఉన్నారని, అందుకే బీజేపీ ఓడిపోయిందని, ఇక అరారియా ఉగ్రవాద స్థావరంగా మారిపోతుందని వ్యాఖ్యానించి కలకలం రేపారు. 'అరారియా నేపాల్, బెంగాల్ సరిహద్దు ప్రాంతమే కాదు. ఇక్కడ మతవాద సిద్ధాంతం పురుడు పోసుకుంది. ఇది ఒక్క బీహార్‌కే కాదు. యావత్ దేశానికే పెను ముప్పుగా పరిణమిస్తుంది. ఇది ఉగ్రవాద స్థావరంగా మారిపోతుంది' అని మంత్రి గిరిరాజ్ పేర్కొన్నారు. ఈ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి ప్రదీప్ సింగ్‌పై ఆర్జేడీ అభ్యర్థి సర్ఫరాజ్ ఆలం భారీ మెజారిటీతో గెలిచారు. ఇక వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గిరిరాజ్‌కు కొత్త కాదు. ముస్లిం జనాభా పెరగడం సమాజానికి అంతమంచిది కాదని గతంలో వ్యాఖ్యానించారు. అలాగే నరేంద్ర మోడీ వ్యతిరేకులు దేశం విడిచి పాకిస్తాన్ వెళ్లిపోవాలని మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీకి మంచి మేనిఛాయ ఉందనే ఆమెను కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అంగీకరించారని ఆరోపించారు. కాగా, మంత్రి తాజా వ్యాఖ్యలపై ఆర్జేడీ సహా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

దక్షిణాది రాష్ట్రాల డబ్బుల్ని ఉత్తరాది రాష్ట్రాలకు ఇస్తారా?

- మేం అభివృద్ధి చెంది ఏమి లాభం?: మండిపడ్డ సిద్ధరామయ్య
- కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నది దక్షిణాది రాష్ట్రాలే
- కేంద్రం నుంచి వస్తున్న నిధులు మాత్రం చాలా తక్కువ
- మేం అభివృద్ధి చెంది ఏమి లాభం?
- ఎక్కువ పన్నులు చెల్లిస్తున్న దక్షిణాదికి ఎక్కువ కేంద్ర నిధులు రావాల్సిందే



బెంగళూరు : ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య అగాధం క్రమంగా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై దక్షిణాది రాష్ట్రాలు మండిపడుతున్నాయి. తాజాగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కేంద్రంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశానికి ఎక్కువ ట్యాక్స్‌లు దక్షిణాది రాష్ట్రాల నుంచే వెళుతున్నాయని, ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వస్తున్న నిధులు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇలాంటి ఆరోపణలను ప్రాంతీయ పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు మాత్రమే చేశారు. ఒక జాతీయ పార్టీకి (కాంగ్రెస్) చెందిన ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి. ఉత్తరాది రాష్ట్రాలు విఫలమయ్యాయని, వాటిని పోషించడానికి దక్షిణాది రాష్ట్రాల సంపదను వాడుకుంటున్నారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు దక్షిణాది రాష్ట్రాలే సబ్సిడీలను అందిస్తున్నాయని సిద్ధూ అన్నారు. దక్షిణాదికి చెందిన 6 రాష్ట్రాలు దేశానికి ఎక్కువ పన్నులు కడుతున్నాయని, కానీ, కేంద్రం నుంచి తిరిగి వస్తున్న నిధులు మాత్రం చాలా స్వల్పంగా ఉన్నాయని మండిపడ్డారు. ఉత్తర ప్రదేశ్ నుంచి కేంద్రం వసూలు చేస్తున్న ప్రతి ఒక్క రూపాయి పన్నుకు కేంద్ర ప్రభుత్వ నిధుల రూపంలో రూ. 1.79 తిరిగి అందుతున్నాయని చెప్పారు. ఇదే సమయంలో కర్నాటకకు కేవలం 47 పైసల కేంద్ర నిధులు అందుతున్నాయని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు గొప్పగా అభివృద్ధి చెంది, దేశానికి భారీ సంపదను అందిస్తున్నాయని ఆయన చెబుతూ, అలాంటి దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి దక్కే ప్రతిఫలం ఇదేనా అని ప్రశ్నించారు. కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలు సెంట్రల్ ట్యాక్స్ రూపంలో చెల్లించే మొత్తంతో పోల్చితే కేంద్రం నుంచి తిరిగి వస్తున్న నిధులు అతి తక్కువ అని సిద్ధరామయ్య చెప్పారు. కేంద్ర పథకాలు మాత్రం దేశ వ్యాప్తంగా ఒకేలా ఉంటాయని, వాటిని అమలు చేయడానికి కూడా కేంద్రాన్ని తాము అడుక్కోవాలని మండిపడ్డారు. తమ రాష్ట్రాల నుంచి వెళుతున్న పన్నుల్లో సింహ భాగం మళ్లీ తమ రాష్ట్రాలకే రావాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర పథకాలను మార్చుకునే వెసులుబాటు కూడా దక్షిణాది రాష్ట్రాలకు ఉండాలని, దీనితో, తమ అవసరాలకు తగ్గట్టుగా పథకాలను తాము డిజైన్ చేసుకుంటామని చెప్పారు. సిద్ధరామయ్య అభిప్రాయాలను ఇప్పటికే ఏపీ, టీఎస్ ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్ లేవనెత్తారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితతో పాటు పలువురు తమిళ నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని చెప్పారు.

తన వ్యాధి పేరు బయటపెట్టిన ఇర్ఫాన్ ఖాన్

ముంబయి : ముందు చెప్పినట్లుగానే ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ తన వ్యాధి ఏమిటో బయటపెట్టారు. తనకు నాడీ సంబంధమైన అంత:స్రావి గ్రంధిలో ట్యూమర్ (న్యూరో ఎండోక్రిన్ ట్యూమర్) ఉందని, ఇది అత్యంత అరుదైనదని పేర్కొన్నారు. దీని కోసం తాను విదేశాల్లో వైద్యానికి వెళుతున్నట్లు కూడా తెలియజేశారు. ఇర్ఫాన్ ఖాన్ తన అధికారిక ట్విటర్ పేజీలో ఈ విషయం పోస్ట్ చేశారు. అత్యంత అరుదైన వ్యాధితో ఇర్ఫాన్ బాధ పడుతున్నారని, అది ఒక క్యాన్సర్ అంటూ విపరీతమైన ఊహాగానాలతో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో న్యూరో అంటే బ్రెయిన్‌కు సంబంధించినది మాత్రమే ఉండబోదని తెలిపారు.

సూర్య
హైదరాబాద్
శనివారం
17 మార్చి 2018
12
సూర్య స్పోర్ట్స్

కోహ్లీ ఇంటి అద్దె నెలకు రూ.15 లక్షలు




ముంబయి : భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ ప్రస్తుతం ముంబయిలో భార్య అనుష్క శర్మతో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఎన్నో ప్రముఖ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న కోహ్లీ ఏడాదిన్నర క్రితం ముంబయిలో అత్యంత విలాసవంతమైన ప్రదేశమైన వోర్లిలో ఒక ఫ్లాట్ కొనుకున్నాడు. దీని ఖరీదు ఎంతో తెలుసా రూ.34 కోట్లు. 7వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల ఈ ఇంటిని 2016లోనే కొన్నాడు. కాని ఇప్పటికీ ఇది ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కాలేకపోవడంతో ప్రస్తుతం అనుష్కతో కలిసి ఓ ఇల్లు అద్దెకు తీసుకున్న కొహ్లీ... ఈ ఇంటికి అద్దె రూపంలో రూ.15 లక్షలు చెల్లిస్తున్నాడు. అత్యాధునిక సదుపాయాలు గల ఓ అపార్టుమెంట్లోని 15వ అంతస్తులో 2,675 చదరవు అడుగుల విస్తీరణంలోని ఫ్లాట్‌లో అద్దెకు దిగాడు కోహ్లీ. ఇందులో రెండేళ్లు ఉండేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్న కోహ్లీ ఇందుకోసం రూ.1.50 కోట్లు ముందుగానే చెల్లించినట్లు సమాచారం. ముక్కోణపు టోర్నీ నుంచి విశ్రాంతి తీసుకున్న కోహ్లీ తన ఖాళీ సమయాన్ని కుటుంబసభ్యులతోనే ఇక్కడే గడువుతున్నాడు.

భారత్‌లో చాలా మంది మిత్రులున్నారు



న్యూఢిల్లీ : ఐపీఎల్ వల్ల తనకు భారత్ రెండో ఇల్లు అయ్యిందని అంటున్నాడు ఆసీస్ ఆటగాడు అరోన్ ఫించ్. ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో రూ.6.2కోట్లు చెల్లించి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫించ్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఫించ్ ఆరు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. తాజాగా ఫించ్ మాట్లాడుతూ బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)-ఐపీఎల్‌కు మధ్య వ్యత్యాసం ఏమిటో తెలిపాడు. బీబీఎల్‌తో పోల్చుకుంటే పీఎల్‌లో మ్యాచ్‌లు ఎక్కువ. అలాగే మ్యాచ్ జరిగే ప్రదేశాలు ఎక్కువే. అంతేకాదు వివిధ దేశాలకు చెందిన ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడతారు. బీబీఎల్‌లో ఎక్కువ స్వదేశీ ఆటగాళ్లే ఉంటారు. అంతర్జాతీయ షెడ్యూల్స్ కారణంగా ఒక్కోసారి కీలక ఆటగాళ్లు దూరమవుతారు. కానీ, ఐపీఎల్ అలా కాదు. ఈ లీగ్‌కి ఉన్న ఆదరణ, స్థాయి వేరు. టీ20 ఆటగాడు ఈ లీగ్ ద్వారా ఎంతో నేర్చుకోవచ్చు అని ఫించ్ తెలిపాడు. అనంతరం భారత్ నాకు రెండో ఇల్లు లాంటిది. ఇక్కడికి చాలా సార్లు వచ్చాను. వివిధ ఫ్రాంఛైజీలకు ఆడాను. చాలా పట్టణాలు తిరిగాను. ఈ దేశంలో నేను చాలా సౌకర్యవంతంగా ఫీలవుతాను. దేశ వ్యాప్తంగా నాకు చాలా మంది స్నేహితులున్నారని ఫించ్ చెప్పాడు.

నరైన్ ఐపీఎల్‌కు అనుమానమే



న్యూఢిల్లీ : వెస్టిండీస్ స్పిన్నర్ సునీల్ నరైన్ ఐపీఎల్‌లో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. వేలంలో అతడిని కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం నరైన్ పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్)లో ఆడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని బౌలింగ్ శైలిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అతడు ఐపీఎల్‌కు దూరం కావొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. పీఎస్ఎల్‌లో భాగంగా బుధవారం లాహోర్ క్వాలాండర్స్-క్వెట్టా గ్లాడియేటర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో నరైన్ బౌలింగ్ శైలి అనుమానాస్పదంగా ఉందని అంపైర్లు ఫిర్యాదు చేశారు. దీంతో అతడ్ని వార్నింగ్ లిస్టులో చేర్చారు. దీనిపై మ్యాచ్ నిర్వహకులు క్రికెట్ వెస్టిండీస్‌ను వివరణ కోరనున్నారు. ఇప్పుడు వెస్టిండీస్ బోర్డు చేపట్టే పరీక్షల్లో ఒకవేళ నరైన్ ఫెయిలైతే ఐపీఎల్‌కు కచ్చితంగా దూరమవుతాడు. నరైన్ బౌలింగ్ శైలిపై ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. 2014 లోను ఇలాగే ఆరోపణలు ఎదుర్కోవడంతో జట్టుకు దూరమైన అతడు ఆ తర్వాత తిరిగి 2015లో మైదానంలో అడుగుపెట్టాడు. మళ్లీ తిరిగి 2016లో మరోసారి ఇలాగే ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఏప్రిల్ 7 నుంచి ఐపీఎల్ మెగా టోర్నీ ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

పంజాబ్ మ్యాచ్‌ల వేదికలు మార్చండి



ముంబయి : ఐపీఎల్‌లో భాగంగా మే 12, మే 14న కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తన సొంతగడ్డపై ఆడే మ్యాచ్‌ల వేదికలు మార్చాల్సిందిగా పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ (పీసీఏ) బీసీసీఐకి లేఖ రాసింది. మే 12 నుంచి మే 31 వరకు మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో చండీగఢ్ విమానాశ్రయాన్ని మూసివే స్తున్నారు. ఈ నేపథ్యంలో మే 12న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో, మే 14న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మొహాలీలో జరిగే మ్యాచ్‌లను లఖ్‌నవూకు మార్చాల్సిందిగా పీసీఏ, ఐపీఎల్ నిర్వాహకులు.. బీసీసీఐకు లేఖ రాశారు. పీసీఏ, ఐపీ ఎల్ నిర్వాహకులు రాసిన లేఖ అందింది. త్వరలోనే దీనిపై నిర్ణయం వెల్లడిస్తాం అని బీసీసీఐ ప్రతినిధులు తెలిపారు. రెండు రోజుల క్రితమే కింగ్స్ ఎలెవన్ పం జాబ్ ఈ ఏడాది ఐపీఎల్‌లో ధరించే జెర్సీని ఆవిష్కరించింది. ఎరువు రంగులోని జెర్సీ అభిమానులకు తెగ నచ్చేసింది. టోర్నీలో భాగంగా పంజాబ్ తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 8న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో ఆడనుంది. పంజాబ్ తన సొంతగడ్డపై ఆడే మ్యాచ్‌ల్లో మూడింటిని ఇండోర్‌లో ఆడనున్న సంగతి తెలిసిందే.

అందుబాటులో ఐపీఎల్ టిక్కెట్లు



ముంబయి : ఈ ఏడాది ఐపీఎల్ టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 7న ఐపీఎల్ 11వ సీజన్ ప్రారంభంకానుంది. అదే రోజు ముంబయిలో ప్రారంభ వేడుకలు జరగనున్నాయి. అనంతరం వాంఖడే మైదానంలో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ - చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబయి ఇండియన్స్ టిక్కెట్లు అమ్మకానికి పెట్టింది. ఆన్‌లైన్ ద్వారా ఈ టిక్కెట్లను సొంతం చేసుకోవచ్చని ఈ సందర్భంగా ముంబయి ఇండియన్స్ నిర్వాహకులు తెలిపారు. సొంతగడ్డపై ముంబయి ఇండియన్స్ ఆడే ప్రతి మ్యాచ్ టిక్కెట్లు అందుబాటులో ఉంచాం. టిక్కెట్లు కావల్సిన వారు www.mumbaiindians.com వెబ్‌సైట్‌ను ఆశ్రయించిండి రూ.800 నుంచి రూ.8 వేల మధ్య టిక్కెట్ ధరలు ఉన్నాయి. ఏప్రిల్ 14న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లను మాత్రం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచట్లేదు. ఎందుకంటే రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు ఈ మ్యాచ్ చూసే అవకాశం కల్పించనున్నాం అని వారు తెలిపారు.

సూపర్ సింధూ



- క్వార్టర్స్‌లో ఒకుహరాపై విజయం
- తొలిసారి సెమీస్‌లోకి ప్రవేశం
- ప్రీక్వార్టర్స్ నుంచే వెనుదిరిగిన శ్రీకాంత్
- చైనా షట్లర్ హుయాంగ్ చేతిలో ఓటమి
- ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

బర్మింగ్‌హామ్ : ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ టోర్నీలో తెలుగు తేజం పీవీ సింధూ సత్తా చాటింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన సింధూ... సెమీస్‌లోకి ప్రవేశించింది. చివరి వరకూ ఉత్కంఠ భరితంగా సాగిన మహిళల క్వార్టర్ ఫైనల్ పోరులో సింధు 20-22, 21-18, 21-18 తేడాతో జపాన్ క్రీడాకారిణి ఒకుహరాపై గెలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. 84 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సింధు శభాష్ అనిపించింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను సింధు చేజార్చుకుంది. ప్రతీ పాయింట్ కోసం ఇరువురి క్రీడాకారిణల మధ్య నువ్వా-నేనా అన్నట్లు సాగిన మొదటి గేమ్‌ను సింధు స్వల్ప తేడాతో కోల్పోయింది. ఇక రెండో గేమ్‌లో తొలి అర్థం భాగం వరకూ ఇరువురి మధ్య ఆసక్తికర పోరు సాగింది. కాగా, చక్కటి ప్లేస్‌మెంట్స్‌తో ఆకట్టుకున్న సింధు... ఒకుహరాను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ క్రమంలోనే రెండో గేమ్‌ను 21-18తో గెలిచి స్కోరును సమం చేసింది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో మాత్రం ఒకుహరా నుంచి సింధుకు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఒకుహరా సుదీర్ఘ ర్యాలీలతో సింధును ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసింది. అయితే దాన్ని తన అనుభవంతో అధిగమించిన సింధు మూడో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకుంది. ఫలితంగా ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీలో తొలిసారి సింధు సెమీస్‌లోకి ప్రవేశించి కొత్త చరిత్రను లిఖించింది.

అంతకు ముందు రోజు గురువారం హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్స్‌లో సింధూ 21-13, 13-21, 21-18తో నిచావోన్ జిందాపోల్ (థాయ్‌లాండ్)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్ళింది. ఇప్పటివరకు ఐదు సార్లు ఆల్ ఇంగ్లాండ్ బరిలో దిగిన సింధుకు క్వార్టర్స్‌కు చేరుకోవడమే అత్యుత్తమ ప్రదర్శన. ఆ కఠిన సవాల్ ఎదురయ్యేది. ప్రతిష్మాత్మక టోర్నీ తొలి రౌండ్లో చెమటోడ్చిన సింధుకు.. ప్రిక్వార్టర్స్‌లోనూ మూడు గేమ్‌ల పాటు పోరాడక తప్పలేదు. ప్రపంచ 11వ ర్యాంకర్ జిందాపోల్.. మూడో ర్యాంకర్ సింధుకు గట్టి పోటీనిచ్చింది. గంటా 7 నిమిషాల పాటు సాగిన పోరులో ఇరువురు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. షటిల్‌ను కోర్టు నలువైపులా పంపిస్తూ ప్రత్యర్థిని తీవ్రంగా ఇబ్బందిపెట్టిన సింధు తొలి గేమ్‌ను అలవోకగా గెలుచుకుంది. రెండు పాయింట్ల వద్ద జిందాపోల్‌ను అధిగమించిన ఆమె.. ఆ తర్వాత ఎక్కడా ఆధిక్యం కోల్పోలేదు. రెండో గేమ్‌లో పరిస్థితి తారుమారైంది. థాయ్‌లాండ్ షట్లర్ దూకుడు పెంచి.. సింధుపై ఆధిపత్యం ప్రదర్శించింది. బలమైన షాట్‌లతో, సుదీర్ఘ ర్యాలీలతో భారత షట్లర్‌ను పరీక్షించింది. చివరిగి సులభంగానే రెండో గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్ ఇద్దరు క్రీడాకారిణులకు పరీక్షగా నిలిచింది. మ్యాచ్‌లో విజయం కోసం సింధు, జిందాపోల్ శక్తినంతా కూడదీసుకుని పోటీపడ్డారు. ర్యాలీలు సుదీర్ఘంగా సాగాయి. 12 పాయింట్ల వరకు ఆధిక్యం చేతులు మారుతూ వెళ్ళింది. ఐతే జిందాపోల్ వరుసగా 4 పాయింట్లు గెల్చుకుని 16-12తో ముందంజ వేసింది. ఈ దశలో వెంటనే వుంజుకున్న సింధు స్కోరును సమం చేసింది. రెండు బలమైన స్మాష్‌లతో ఆమె 16-16తో జిందాపోల్‌ను అందుకుంది. ఆ తర్వాత 17-16తో ఆధిక్యంలోకి దూసుకెళ్ళింది. ఈ సమయంలో జిందాపోల్ 2 పాయింట్లు నెగ్గి 18-17తో మళ్ళీ పైచేయి సాధించింది. విజయానికి చేరువుగా ఉన్న స్థితిలో సింధు విజృంభించి ఆడి వరుసగా పాయింట్లు రాబట్టింది. స్మాష్‌లతో చెలరేగిన సింధు 4 పాయింట్లు సాధించి 21-18తో విజయాన్ని అందుకుని ఉత్కంఠకు తెరదించింది. జిందాపోల్‌పై తన గెలుపోటముల రికార్డును 3-1కి పెంచుకుంది.



శ్రీకాంత్ ఔట్

భారత అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ నుంచి ఇంటి ముఖం పట్టాడు. గత ఏడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న శ్రీకాంత్ ప్రిక్వార్టర్స్ నుంచే వెనుదిరుగుతాడని భారత అభిమానులు ఊహించలేదు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ కోసం రేసులో ఉన్న ఆటగాళ్లలో శ్రీకాంత్ ఒకడు. ప్రిక్వార్టర్స్‌లో భాగంగా చైనాకు చెందిన హుయాంగ్‌తో తలపడిన శ్రీకాంత్ తొలి గేమ్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయాడు. దీంతో 11-21తో తొలి గేమ్‌ను కోల్పోయాడు. రెండో గేమ్‌లో వుంజుకున్న శ్రీకాంత్ 21-15తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇద్దరూ చెరో గేమ్ గెలవడంతో మూడో గేమ్ హోరాహోరీగా సాగింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన మూడో గేమ్‌లో పలుసార్లు ఇద్దరూ పాయింట్లు సమం చేసుకున్నారు. చివరికి 20-22తో శ్రీకాంత్ గేమ్‌ను ఓడిపోవడంతో పాటు మ్యాచ్‌ను కోల్పోయాడు.

శ్రీలంకకు షాక్

- ఆఖరు లీగ్ మ్యాచ్‌లో బంగ్లా విక్టరీ
- రెండు వికెట్ల తేడాతో శ్రీలంక ఓటమి
- సొంతగడ్డపై ఫైనల్‌కు చేరని శ్రీలంక
- ముక్కోణపు సీరీస్ ఫైనల్లో భారత్‌తో తలపడనున్న బంగ్లాదేశ్

కొలంబో : సొంతగడ్డపై జరుగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో శ్రీలంకకు ఊహించని షాక్ తగిలింది. లీగ్ దశలో భాగంగా శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన కీలకమైన ఆఖరు మ్యాచ్‌లో శ్రీలంక రెండు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇప్పటికే ఫైనల్స్‌కు చేరుకున్న భారత్‌తో ఆఖరు మ్యాచ్ అవకాశాన్ని చేజార్చుకున్న శ్రీలంక టోర్నీ నుంచి నిష్క్రమించి తమ అభిమానులకు నిరాశ మిగల్చింది. ఫలితంగా ఫైనల్‌కు చేరిన బంగ్లాదేశ్... ఆదివారం భారత్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ పరిణామం శ్రీలంక క్రికెట్ అభిమానుల్ని తీవ్రంగా నిరాశపరిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లంక నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (50) హాఫ్ సెంచరీ సాధించగా, మొహ్మదుల్లా (43 నాటౌట్)లు బంగ్లాదేశ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆఖరు వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోరులో మొహ్మదుల్లా సిక్స్ సాధించి మ్యాచ్ విజయాన్ని తమ ఖాతాలో వేసుకున్నాడు.

బంగ్లాదేశ్ టార్గెట్ 160

తొలుత టాస్ కోల్పోయిన శ్రీలంక బంగ్లాదేశ్ కెప్టెన్ నిర్ణయం మేరకు బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. మరోవైపు ఎనిమిది ఓవర్లు ముగిసే సరికే కీలకమైన ఐదు వికెట్లు కోల్పోయిన శ్రీలంకను వన్ డౌన్ బ్యాట్స్‌మెన్ కుశాల్ పెరీరా 61 (40 బంతుల్లో; 7 ఫోర్లు, 1 సిక్స్), తిషార పెరీరా 58 (37 బంతుల్లో; 3 ఫోర్లు, 3 సిక్స్) పరుగులు చేసి ఆదుకున్నారు. వీరిద్దరూ మినహాయిస్తే... శ్రీలంక మిగతా బ్యాట్స్‌మెన్లు తక్కువ పరుగులకే పెవిలియన్ బాట పట్టడంతో ప్రత్యర్థి బంగ్లాదేశ్ జట్టుకు శ్రీలంక 160 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ముస్తాఫిజర్ రహ్మాన్ రెండు వికెట్లు పడగొట్టగా... షకిబ్, రుబేల్, మెహిదీ హసన్, సౌమ్య సర్కార్ తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంగ్లా బౌలర్లు తమ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్టును నిలువరించారు.



షమిని ఐపీఎల్ ఆడిస్తారా?

- ఎఫ్ఐఆర్ కాపీని బీసీసీఐకి పంపిన జహాన్
- కీలకంగా మారిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ వింగ్ రిపోర్ట్

ముంబయి : టీమిండియా పేసర్ మహమ్మద్ షమిని ఐపీఎల్‌లో ఆడించాలా వద్దా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపింది బీసీసీఐ. తాజాగా బీసీసీఐ ప్రతినిధులు ఐపీఎల్‌లో అన్ని జట్ల ఫ్రాంఛైజీ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీసీఐ పాలకుల కమిటీ యాక్టింగ్ ప్రెసిడెంట్ సీకే ఖన్నా మాట్లాడారు. షమిపై అతని భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు చేపట్టాల్సిందిగా బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్‌ను ఆదేశించాము. వారం రోజుల్లోగా ఆయన నివేదిక అందిస్తారు. ఆ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటాం అని సీకే ఖన్నా వివరించారు. ఒక మ్యాచ్‌ను ఫిక్స్ చేసేందుకు షమి పాకిస్థాన్‌కు చెందిన అమ్మాయి నుంచి నగదు తీసుకున్నాడని హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపైనే బీసీసీఐ పాలకుల కమిటీ విచారణకు ఆదేశించింది. ఈ ఏడాది దిల్లీ డేర్‌డెవిల్స్ షమిని రూ.3 కోట్లకు దక్కించుకు న్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ ప్రారంభ వేడుకల కోసం బీసీసీఐ ఫైనాన్స్ విభాగం రూ.18 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.50 కోట్లతో అంగ రంగ వైభవంగా ఐపీఎల్ వేడుకలను నిర్వహించాలనుకోగా బీసీసీఐ పాలకు ల కమిటీ రూ.20 కోట్లు కోత పెట్టి రూ.30 కోట్లతో సరిపెట్టుకోమన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులో రూ.18కోట్లు మంజూరైనట్లు ఖన్నా తెలిపారు.

ఎఫ్ఐఆర్ కాపీని బీసీసీఐకి పంపిన జహాన్

షమిపై అతని భార్య హసీన్ జహాన్ గత వారం కోల్‌కతాలోని లాల్‌బజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు గృహహింస, హత్యాయత్నంతో పాటు మరికొన్ని సెక్షన్ల కింద షమితో పాటు మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు. తాజాగా హసీన్ పోలీస్‌స్టేషన్‌లో షమిపై తాను చేసిన ఫిర్యాదుకు సంబంధించిన కాపీని బీసీసీఐకి పంపినట్లు ఆమె తరవు న్యాయవాది జకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం కోల్‌కతా పోలీస్ స్టేషన్లో షమిపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన కాపీని సీఓఏ



ఛైర్మన్ వినోద్ రాయ్‌కి పంపించాం అని జకీర్ చెప్పారు. ఒక మ్యాచ్‌ను ఫిక్స్ చేసేందుకు పాకిస్థాన్ అమ్మాయి ద్వారా షమి డబ్బు తీసుకున్నట్లు షమి భార్య హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై దృష్టి సారించిన సీఓఏ దీనిపై విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం ఛైర్మన్ నీరజ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే జకీర్ ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన కాపీని పంపినట్లు తెలుస్తోంది. హసీన్ తనపై చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై షమి స్పందించాడు. విచారణలో తాను ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తేలితే ఉరి తీయండి అని కన్నీటి పర్యంతమయ్యాడు. బీసీసీఐ తొందరపడి నా కాంట్రాక్టును రద్దు చేసింది. నేనెప్పుడూ నిజాయితీగానే ఆడాను అని షమి ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఆ రిపోర్ట్‌పైనే షమీ భవితవ్యం

ఇటీవల కాలంలో భారత క్రికెట్ జట్టులో కీలక బౌలర్‌గా ఎదిగిన మహ్మద్ షమీ క్రికెట్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. తన భర్త షమీ ఫిక్సింగ్‌కు పాల్పడి ఉండవచ్చని భార్య హసీన్ జహాన్ చేసిన ఆరోపణలు అతనికి సరికొత తలనొప్పిని తెచ్చిపెట్టాయి. దీనిపై విచారణ జరపాలని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం (యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ వింగ్) చీఫ్ నీరజ్ కుమార్‌ను సీఓఏ ఛైర్మన్ వినోద్ రాయ్ ఇప్పటికే ఆదేశించారు. దాంతో యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ వింగ్ ఇచ్చే రిపోర్ట్‌పైనే షమీ క్రికెట్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. దీనిపై బీసీసీఐ యాక్టింగ్ ప్రెసిడెంట్ సీకే ఖన్నా మాట్లాడుతూ.. 'పాకిస్తాన్‌కు చెందిన మహిళ నుంచి షమీ డబ్బులు తీసుకున్నట్లు అతని భార్య జహాన్ ఆరోపించిన కేసులో విచారణ జరుగుతుంది. దీనిపై నీరజ్ కుమార్ నేతృత్వంలోని అవినీతి నిరోధక విభాగం ఏడు రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఆ రిపోర్ట్ తర్వాత భారత క్రికెట్ పాలక మండలి (సీఓఏ) తీసుకునే నిర్ణయంపైనే షమీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఆ క్రమంలోనే రాబోవు ఐపీఎల్ సీజన్‌లో షమీ ఆడతాడా..లేదా అనేది తేలుతుంది. అప్పటివరకూ అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోదలుచుకోలేదు' అని ఐపీఎల్ గవర్నింగ్ సమావేశాలకు హాజరైన సీకే ఖన్నా తెలిపారు. ఐపీఎల్ ఫ్రాంచైజీల్లో ఒకటైన ఢిల్లీ డేర్‌డెవిల్స్ షమీని రూ.3 కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·